RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 23.09.2024 | సంపుటి : 11 సంచిక : 73 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సర్కారుబడికి స్కూల్‌బస్సు ఇవ్వండి..

కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ బడులను ఎదిగించండి

బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో షాద్‌నగర్ పట్టణంలో గత 3 రోజుల క్రితం మెరుపుధర్నాకు దిగిన విద్యార్థులు..

కేరళ తరహా విద్యా విధానం తెలంగాణకు అవసరం

- ఇంటి నుంచి అప్ అండ్ డౌన్‌తో డ్రాపౌట్‌లు ఔట్
- మారుమూల ప్రాంత పేద విద్యార్థులకు ఉచిత బస్సుతో మేలు

హైదరాబాద్ కరస్పాండెంట్ (జనంసాక్షి)

పేదరిక నిర్మూలన కోసం బహుళ దశ ప్రణాళికలతో సాగుతున్న కేరళ ప్రభుత్వం గతేడాది తీసుకున్న నిర్ణయం ఆదర్శంగా నిలుస్తోంది. అందరికీ సమాన విద్యనందించాలనే లక్ష్యంతో నిరుపేద పిల్లల కోసం చదువును మరింత దగ్గర చేయాలనే సంకల్పానికి శ్రీకారం చుట్టింది. డోర్ టు డోర్ సర్వే చేసి నిరుపేద విద్యార్థుల డేటాను సేకరించి వారందరికీ మెరుగైన విద్యనందించేలా కొత్త ప్రణాళికను తీసుకొచ్చింది. కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (కేఎస్ఆర్‌టీసీ) ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభించింది.

మిగతా 2లో..

ప్రభుత్వ పాఠశాలలు, విద్యాలయాలను ఆధునీకరిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ ప్రయాణ సౌకర్యం లేక ఇప్పటికీ ఉన్నత విద్యకు నిరుపేదలు దూరమవుతున్న పరిస్థితి. తమ గ్రామాలకు బస్సులు రావడం లేదని, సకాలంలో రాక పాఠశాలలకు కూడా వెళ్లలేకపోతున్నామని ఎన్నోచోట్ల రోడ్డుపై బైటాయిస్తున్న సందర్భాలు కోకొల్లలు. ఇటీవలే రంగారెడ్డి, గద్వాల, వికారాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు మెరుపు ధర్నా చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీయడం వారి ఆవేదనను బయటపెట్టింది. ఇలా మరెన్నో ప్రాంతాల్లో ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదులు కూడా వెళ్తున్నా ఏండ్ల తరబడి మెరుగైన ప్రయాణానికి నోచక కాలిబాటన, సైకిళ్ల మీద ప్రయాసగా పాఠశాలలకు వెళ్లాల్సిన దుస్థితి. పేద, మధ్య తరగతి పిల్లలకు సమగ్ర విద్య అందాలంటే సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ కేరళ తరహా ప్రగతిశీల నిర్ణయాలను తీసుకోవాలని విద్యావంతులు విన్నవిస్తున్నారు. కేరళలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం కేఎస్ఆర్‌టీసీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్టే తెలంగాణలో టీఎస్ఆర్‌టీసీ చొరవ చూపాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బీజీపేట మండలంలో బస్సులు సకాలంలో నడపడంపోవడంతో కాలేజీలకు సరిగా వెళ్లలేక పోతున్నామని రోడ్డుపై బైటాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలోని పలు గ్రామాల విద్యార్థులు లోకేశ్వరం మండలం కనకాపూర్ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేందుకు ఐదు కిలోమీటర్లు వివిధ వాహనాలపై వెళ్తున్నారు. ఈ మార్గంలో బస్సులు రాకపోవడంతో ప్రమాదకర పరిస్థితుల్లో ఇతర వాహనాలపై ప్రయాణిస్తున్నారు. (ఫైల్)

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం న్యాలకొండపల్లి ఆదర్శ పాఠశాలకు వచ్చేందుకు వివిధ గ్రామాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతం కంటే ఆర్టీసీ బస్సు ట్రిప్పులు తగ్గించడంతో ఒక్కో బస్సులో వందకుపైగా మంది ఊపిరాడని పరిస్థితుల్లో ప్రయాణిస్తున్నారు

పీసీసీ అధ్యక్షుడిగా నేను సక్సెస్

పార్టీ అధికారంలోకి వచ్చింది.. లోక్‌సభ సీట్లూ గెలిచాం..

- మహేష్ కుమార్ గౌడ్ కూడా విజయవంతం కావాలి
- పార్టీ నాయకత్వం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- సీఎల్పీ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష

హైదరాబాద్(జనంసాక్షి): పీసీసీ అధ్యక్షుడిగా తాను విజయవంతమయ్యానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.మహేష్ కుమార్ గౌడ్ ను తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కి ధన్యవాదాలు తెలుపుతు సీఎల్పీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా భేటిలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ" నా ఆధ్వర్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాం, లోక్ సభ సీట్లు గెలిచాం. పార్టీ నాయకత్వం ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకు వెళ్లాలి...ప్రజల్లో ఉన్న వారికే జిల్లా అధ్యక్ష పదవులు ఇవ్వాలని పీసీసీకి సూచిస్తున్నా..పార్టీ అనుబంధ విభాగాల్లో పనిచేసిన 36 మందికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చాం.పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసినందుకే వారికి పదవులు ఇచ్చాం.పార్టీ లో కష్టపడి పనిచేసిన వారికి ఖచ్చితంగా అవకాశాలు వస్తాయి.నరేంద్ర మోదీని ఓడించాల్సిన చారిత్రాత్మక అవసరం ఉన్న సమయంలో పీసీసీ చీఫ్ గా మహేష్ గౌడ్ బాధ్యత చేపట్టారు..బీసీ కులగణన చేయాలన్నది రాహుల్ గాంధీ బలమైన ఆలోచన.రాహుల్ ఆలోచన మేరకు బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను నియమించాం..బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే కచ్చితంగా జనాభాను లెక్కించాల్సిందే.ఎస్సీ వర్గీకరణ అమలుపై ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశాం.సుప్రీం కోర్టు తీర్పు ను పూర్తిగా అధ్యయనం చేసి ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది..దేశంపై నాలుగోసారి పట్టు సాధించడానికి మోడీ ప్రయత్నాలు చేస్తున్నాడు. .నాలుగో సారి గెలవడం

మిగతా 2లో..

హైటెక్ సిటీ ట్రైడెంట్ హోటల్ కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,మంత్రులు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షీ,ఇంచార్జి సెక్రటరీలు, ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారు

చిరంజీవికి విశిష్ట గౌరవం..

2లో

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు..

'ఆప్'ను అంతమొందించేందుకు మోదీ కుట్ర

పార్టీ నాయకులపై అవినీతి బురద జల్లుతున్నారు

మార్పు కోసమే రాజకీయాల్లోకి వచ్చా: అరవింద్ కేజ్రీవాల్

దిల్లీ(జనంసాక్షి): ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్) పార్టీ నేతలను అవినీతి పరులుగా చూపడానికి ప్రధాని నరేంద్ర మోదీ కుట్రపన్నారని ఆప్ అధినేత, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఆదివారం దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన 'జనతాకీ అదాలత్'

మిగతా 2లో..

మిగులు నిధుల జోన్‌గా తెలంగాణ రాష్ట్రం

కొత్త ఉద్యోగులకు నెల వేతనం 'ఈపీఎఫ్'లో జమ

కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ

హైదరాబాద్(జనంసాక్షి): కొత్తగా వస్తున్న యువ ఉద్యోగులకు ఉపాధి ఆధారిత ప్రోత్సాహ పథకం(ఈఎల్ఐ) కింద వారి ఈపీఎఫ్ ఖాతాలో ఒక నెల వేతనం (గరిష్ఠంగా రూ.15 వేలు) జమ చేయనున్నట్లు కేంద్ర కార్మికశాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు.

మిగతా 2లో..

హైడ్రాబాద్ హడల్

- హెచ్ఎండీఏ పరిధిలో జోరుగా కూల్చివేతలు
- మూడుప్రాంతాల్లో 44 అక్రమ నిర్మాణాల నేలమట్టం
- 8 ఎకరాల భూమి ప్రభుత్వ స్వాధీనం.

హైదరాబాద్(జనంసాక్షి): హెచ్ఎండీఏ పరిధిలోని మూడు ప్రాంతాల్లో ఆదివారం కూల్చివేతలు చేపట్టినట్లు హైడ్రా వెల్లడించింది. సుమారు 8 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది.ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వ స్థలాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నివాసాల కోసం నిర్మించుకున్న భవనాలను కాకుండా వ్యాపారం కోసం నిర్మించిన వాటిని మాత్రమే కూల్చివేస్తున్నట్లు హైడ్రా స్పష్టం చేసింది. ఇవాళ మూడు చోట్ల 44 అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, 8 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా వెల్లడించింది. కూకట్‌పల్లి నల్ల చెరువులో 4 ఎకరాలు, అమీన్?పూర్ మండలం కిష్టారెడ్డిపేటలో ఎకరం, పటేల్?గూడలో 3 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణ చెర నుంచి విడిపించినట్లు హైడ్రా తెలిపింది. నీటి వనరుల పునరుద్ధరణ, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా 12 రోజుల తర్వాత మరోసారి హైదరాబాద్ మహానగరంలో పంజా విసిరింది. మూడు చోట్ల బుల్డోజర్లతో విరుచుకుపడి, పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది. కూకట్‌పల్లి నల్ల చెరువు, సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన నివాసాలను, బహుళ అంతస్తుల భవనాలను నేలమట్టం చేసింది. ఈ మేరకు ఆదివారం

మిగతా 2లో..

శ్రీలంక అధ్యక్షుడిగా అనుర కుమార దిసనాయకే

హెజ్‌బొల్లా ప్రతిదాడులు

ఇజ్రాయెల్ వాయుసేన స్థావరంపై రాకెట్ల వర్షం

పలు రాకెట్ లాంచర్లను ధ్వంసం చేసిన ఇజ్రాయెల్

బోనస్ కాదు.. బోగస్

సింగరేణి కార్మికులను మోసం చేసిన ప్రభుత్వం:కేటీఆర్

పైవార్తల వివరాలు 2లో

ఐరాసలో భారత్ శాశ్వత సభ్యత్వానికి మద్దతిస్తాం

ప్రకటించిన ఆ దేశాధ్యక్షుడు జో బైడెన్ • ఇండో-పసిఫిక్ దేశాలకు 40 మిలియన్ల వ్యాక్సిన్ డోస్‌లు

క్వాడ్ సమ్మిట్‌లో భారత ప్రధాని మోదీ ప్రకటన • 31 ఎంక్యూ9బీ డ్రోన్ల కొనుగోలుపై చర్చలు

వాషింగ్టన్(జనంసాక్షి): మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం భారత ప్రధాని మోదీ శనివారం అమెరికాకు చేరుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడ నిర్వహించిన క్యాన్సర్ మూన్‌షాట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఇండో- పసిఫిక్ దేశాలకు 40 మిలియన్ల వ్యాక్సిన్ డోస్‌లు అందించి క్యాన్సర్‌తో పోరాటానికి సాయం అందిస్తామని మోదీ హామీ ఇచ్చారు."40 మిలియన్ల వ్యాక్సిన్ డోస్‌లు కోట్లాది మంది ప్రజల జీవితాల్లో ఆశాకిరణంగా మారతాయి. ఒక దేశం... ఒక ఆరోగ్యం అనేది భారత్ లక్ష్యం. అందుకే మూన్‌షాట్ చొరవ కింద 7.5 మిలియన్ డాలర్ల విలువైన నమూనా కిట్‌లు, డిటెక్షన్ కిట్‌లతో పాటు వ్యాక్సిన్‌ల మద్దతును ప్రకటిస్తున్నాం. ఈ కార్యక్రమం నిర్వహించినందుకు అధ్యక్షుడు బైడెన్‌కు కృతజ్ఞతలు. ఈ కార్యక్రమం నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించాలనే మా భాగస్వామ్య సంకల్పాన్ని ప్రతిబింబిస్తుంది. కొవిడ్ మహమ్మారి సమయంలో ఇండో- పసిఫిక్‌కు క్వాడ్ వ్యాక్సిన్ చొరవ తీసుకున్నాం. అందుకు నేను ఎంతో సంతోషిస్తున్నా. క్వాడ్‌లో గర్భాశయ క్యాన్సర్ వంటి సవాళ్లను సంయుక్తంగా ఎదుర్కోవాలని మేము నిర్ణయించాం. అందుకు అన్ని దేశాల మద్దతు ఎంతో అవసరం" అని మోదీ పేర్కొన్నారు."ప్రతి సంవత్సరం ఇండో- పసిఫిక్‌లో గర్భాశయ క్యాన్సర్‌తో 1,50,000 మంది మహిళలు మర ణిస్తున్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన నేతలు, అనేక సంస్థలు హెచ్‌పీబీ స్క్రీనింగ్, థెరప్యూటిక్స్‌కు 150 మిలియన్ల డాలర్లకు పైగా వెచ్చిస్తున్నారు. వచ్చే ఏడాది యూఎస్ నేవీకి చెందిన వైద్యులు, నర్సులు ఇండో- పసిఫిక్ సహచరులకు గర్భాశయ

మిగతా 2లో..

ఎటూ తేలని ఫలితాన్ని భాజపా కోరుకుంటోంది

హంగ్‌ను నివారించేందుకే కాంగ్రెస్‌తో పొత్తు

నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్(జనంసాక్షి): జమ్మూకశ్మీర్‌లో హంగ్ పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకే అసెంబ్లీ ఎన్నికలకు ముందుగానే కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకున్నట్లు నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా తెలిపారు.భాజపా మాత్రం ఎటూ తేలని ఫలితాలనే కోరుకుంటోందని ఆరోపించారు. ఎన్నికల ప్రచారం లో భాగంగా ఆదివారం శికారా ర్యాలీలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. "కాంగ్రెస్‌తో మేం ఎన్నికల అనంతరం కూడా కూటమి ఏర్పాటు చేయొచ్చు. కానీ, హంగ్ వస్తుందేమో.. ప్రభుత్వం ఏర్పడదేమోనని ఓటర్లలో సందేహాలకు తావులేకుండా ముందస్తు పొత్తు

మిగతా 7లో..

ఉగ్రవాదం అంతమయ్యేవరకు పాక్‌తో చర్చలుండవు

ఎన్నికల ప్రచారంలో అమిత్ షా

శ్రీనగర్(జనంసాక్షి): జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే తొలి విడత పోలింగ్ పూర్తయింది. ఈ ఎన్నికల్లో గెలిచేందుకు భాజపా, కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ సహా ఇతర పార్టీలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి.ఈ నేపథ్యంలోనే రాజౌరీ జిల్లా నౌషేరాలో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. "జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన రాజ్యాంగ అధికరణం 370 రద్దు చేస్తూ కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కానీ, అధికారం వచ్చాక ఆ ఆర్టికల్‌ను పునరుద్ధరిస్తామని ఫరూక్ అబ్దుల్లా చెబుతున్నారు. ఏ శక్తీ దాన్ని తిరిగి తీసుకురాలేదు. ఇప్పుడు ఈ ప్రాంతంలో బంకర్ల అవసరం లేదు. ఎందుకంటే.. కాల్పులు జరిపే సాహసం

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
23.09.2024

ఆర్య వైశ్యుల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతా

ఘనంగా వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ సాయి హర్షిని సంతోషాల

శ్రీనివాసుని రీకాన్ మహోత్సవంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్త

హైదరాబాద్(జనంసాక్షి): ఆర్య వైశ్యుల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతానని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్,రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు.మిర్యాలగూడ లక్ష్మి కల్యాణ మండపంలో జరిగిన వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ సాయి హర్షిని సంతోషాల శ్రీనివాసుని రీకాన్ మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్య వైశ్యుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుంది అని ఆయన అన్నారు.ఎన్నో యేండ్ల కల ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ,గుండ ప్రకాశ్ వాసవి సేవ సమితి నేషనల్ ప్రెసిడెంట్ పూరి సురేష్ శెట్టి ,ఐఈఈసీ అధికారి వెంకటేశ్వర్లు ,ఎల్వీ కుమార్,రీజియన్ ఛైర్పర్సన్ గుండ సుధ మాధురి, మిట్టపల్లి రమేశ్, బికుమల్ల నాగేశ్వర్ రావుఐవీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హెజ్‌బొల్లా ప్రతిదాడులు

జెరుసలెం(జనంసాక్షి): హెజ్బొల్లా ప్రతీకారదాడులను తీవ్రం చేసింది. తాజాగా ఆదివారం తెల్లవారుజామున నాలుగు విడతలుగా రాకెట్లను ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించింది. ఈ క్రమంలో కీలక నౌకానగరమైన హైఫా, రమాత్ డేవిడ్ ఎయిర్ బేస్, నజారీత్, అఫులా, దిగువ గిల్లీ ప్రాంతాలపై ఇవి పడ్డాయి. ఇక శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత లెబనాన్‌పై ఇజ్రాయెల్ మరోసారి భీకర వైమానిక దాడులు నిర్వహించింది. ఈ విషయాన్ని ఆర్మీ రేడియో కెఎన్ఏ ధ్రువీకరించింది.హెజ్‌బొల్లా దళాలు రమాత్‌డేవిడ్ ఎయిర్ ఫోర్స్‌ను తమ ప్రధాన లక్ష్యంగా చేసుకొన్నట్లు ఐడీఎఫ్ రేడియో వెల్లడించింది. మరోవైపు ఆ మిలిటెంట్ సంస్థ కూడా దీనిని ధ్రువీకరించింది. ఫాదీ-1, ఫాదీ-2 రాకెట్లను ప్రయోగించింది. ఈ దాడిలో ఎయిర్‌బేస్ స్వల్పంగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. మరోవైపు లెబనాన్‌పై చేసిన దాడిలో ఇప్పటి వరకు 400 రాకెట్ లాంచర్లను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. మరోవైపు వెస్ట్‌బ్యాంక్‌లోని అరబ్ వార్తా ఛానెల్ అల్‌జజీరా ఆఫీస్‌ను తమ భూభాగంపై కొన్నాళ్లపాటు మూసివేయాలని ఇజ్రాయెల్ ఆదేశించింది. దీంతో దళాలు ఆ కార్యాలయాన్ని సీజ్‌చేశాయి.ఇప్పటికే హెజ్‌బొల్లా కీలక కమాండర్లను ఇజ్రాయెల్ మట్టుబెట్టిన విషయం తెలిసంది. రద్వాన్, అబ్బాస్ బ్రిగేడ్స్.. హెజ్‌బొల్లాలోని రెండు కీలక దళాలు. ఉత్తర ఇజ్రాయెల్‌లోని హగాలిల్‌లో నిర్వహించాల్సిన ఓ సైనిక ఆపరేషన్ గురించి చర్చించడానికి శుక్రవారం సమావేశమయ్యాయి. వారి సమావేశ భవనంపై ఇజ్రాయెల్ వైమానిక దాడి చేసింది. ఈ దాడిలో కమాండర్లు మృతి చెందారు.

హెజ్‌బొల్లాను ఊహించని విధంగా దెబ్బకొట్టాం: నెతన్యాహు

ఇటీవలి కాలంలో హెజ్‌బొల్లాను ఊహించని విధంగా దెబ్బకొట్టామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. ఈ సందేశాన్ని హెజ్‌బొల్లా ఇప్పటికీ అర్థం చేసుకోకపోతే.. త్వరలోనే అర్థం చేసుకుంటుందన్నారు. రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటుందని హెచ్చరించారు. ఉత్తర ఇజ్రాయెల్‌లో దాడులు జరుపుతున్న హెజ్‌బొల్లాపై.. నెతన్యాహు సైన్యం కూడా దీటుగా ప్రతిస్పందిస్తోంది. దక్షిణ లెబనాన్‌లో యుద్ధవిమానాలతో తీవ్ర దాడులు చేసింది. శనివారం ఒక్కరోజే 290 లక్ష్యాలపై దాడులు చేసినట్లు ఐడీఎఫ్ పేర్కొంది. ఈక్రమంలో ఏకంగా 16 మంది అగ్రశేణి కమాండర్లను హెజ్‌బొల్లా కోల్పోయింది. ఇలా ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య ఆదివారం కూడా భీకర దాడులు కొనసాగాయి. మొత్తంగా ఇజ్రాయెల్ దాడుల్లో 39 మంది చనిపోగా.. 3వేల మంది గాయాలపాలైనట్లు అంచనా.

మిగులు నిధుల జోన్‌గా తెలంగాణ

తెలంగాణ అధిక మిగులు నిధులున్న జోన్‌గా నిలిచిందని, ఏటా వస్తున్న చందా మొత్తం పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 669 మంది ఉద్యోగులకు పదవీ విరమణ రోజునే పింఛను చెల్లింపు పత్రాలు(పీపీవో) జారీ అయ్యాయని వెల్లడించారు. శనివారం ఆయన ఈపీఎఫ్‌వో హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయంలో ఈపీఎఫ్‌వో, ఈఎస్ఐసీ పథకాలపై ఈపీఎఫ్‌వో తెలంగాణ జోన్ అదనపు కేంద్ర పీఎఫ్ కమిషనర్ శ్రీకృష్ణతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈఎల్ఐ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించామని, అమలు కోసం పటిష్ఠమైన ఐటీ వ్యవస్థను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ పథకాన్ని విస్తృతంగా ప్రచారం చేసి విజయవంతం చేయాలన్నారు. తెలంగాణలో 36,018 సంస్థల కింద 47.96 లక్షల మంది చందాదారులు, 4.54 లక్షల మంది పింఛనుదారులు ఉన్నారన్నారు. ఈ జోన్ పరిధిలో చందా వసూళ్లు రూ.19,939 కోట్లు ఉంటే.. చెల్లింపులు రూ.7,797 కోట్లుగా ఉన్నాయి. ఏటా చందా వసూళ్లు పెరుగుతున్నాయి. 2023-24 ఏడాదికి 16.58% పెరుగుదల నమోదైందని, పరిపాలన ఖాతాలో నిధులు 14.90% పెరిగాయని వివరించారు. 2024-25 ఏడాదిలో పదిరోజుల్లో పరిష్కారమైన క్లెయిమ్‌లు 70.39% ఉంటే, 20 రోజుల్లో పూర్తయినవి 92.89% ఉన్నాయని చెప్పారు. సమావేశంలో ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కమిషనర్లు సౌరభ్‌జగాతి(హైదరాబాద్-2), శివకుమార్(హైదరాబాద్-1), గణేశ్‌కుమార్(నిజామాబాద్), ఈఎస్ఐసీ తెలంగాణ ప్రాంతీయ డైరెక్టర్ గౌమింగ్‌థంగ్ గాంగ్టే, డిప్యూటీ డైరెక్టర్ పాత్రాస్ గ్రిగొరీ ఖాల్కో తదితరులు పాల్గొన్నారు.

భవనాల ప్రారంభోత్సవం వాయిదా

కేంద్ర కార్మికశాఖ మంత్రి పర్యటనలో ముందుగా ఖరారైన షెడ్యూలు ప్రకారం ఈపీఎఫ్‌వో తెలంగాణ జోన్ కార్యాలయం, బేగంపేటలో భవిష్యనిధి ఎన్‌క్లేవ్‌లో ఈపీఎఫ్‌వో కూకట్‌పల్లి ప్రాంతీయ కార్యాలయ భవనాలు ప్రారంభించాల్సి ఉంది. అయితే సాంకేతిక కారణాలతో ఈ కార్యక్రమం వాయిదా పడింది. అక్టోబరు మొదటి వారంలో మరోసారి వచ్చి మంత్రి వీటిని ప్రారంభిస్తారని తెలిసింది.

సర్కారు బడికి స్కూల్ బస్సు ఇవ్వండి

ఆ రాష్ట్రం లో 64వేల కుటుంబాలు అత్యంత నిరుపేద కుటుంబాలు న్నట్టు వెల్లడవగా.. ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడంతో విద్యార్థులు ఉత్సాహంగా బడిబాట పడుతున్నారు. దేశంలోనే 100శాతం అక్షరాస్యత గత కేరళలో ఈ ఉచిత బస్సు సౌకర్యం పేద విద్యార్థుల ఉన్నత చదువులకూ అమలు చేయాలని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం నిర్ణయించడాన్ని విద్యావంతులు స్వాగతిస్తున్నారు. పేదరిక నిర్మూలనకు నవంబర్ 2025లోపు లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం.. 2023ను మొదటి దశగా, 2024 సంవత్సరాన్ని రెండో దశగా, 2025 నవంబర్ వరకు చివరి దశగా నిర్ణయించుకుని మల్టీ ఫేస్ ప్లాన్‌ను అమలు చేస్తోంది. పదో తరగతి తర్వాత కూడా ఉన్నత విద్య కోసం ఈ ఫ్రీ బస్ స్కీమ్ కొనసాగిస్తామని పినరయీ ప్రభుత్వం వెల్లడించడం పేదలకు ఊరటనిస్తోంది.

వెళ్లలేక వెనుక'బడి'

ఏజెన్సీ ప్రాంతాలతో పాటు జిల్లా కేంద్రాలకు సమీపంలో ఉన్న ప్రాంతాల్లోనూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బస్సుల్లేక వెనుకబడిపోతున్నారు. ప్రయివేటు స్కూళ్లలో మాత్రం అందులోనే బస్సు సౌకర్యం ఉండటంతో అదనపు ఫీజులు చెల్లించి పిల్లలను బడికి పంపుతున్నారు. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలు దాదాపు 26 వేలు ఉండగా.. రమారమి 28 లక్షల మంది విద్యార్థులున్నారు. స్థోమత లేనివారు, సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని భావించేవారు తమ పిల్లలను పంపుతున్నారు. ప్రాథమిక స్థాయి విద్య స్వగ్రామాల్లోనే అందుతుండగా.. ఆపై తరగతుల కోసం పక్కనున్న గ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జెడ్పీహెచ్ఎస్ స్కూళ్లకు కిలోమీటర్ల మేర ప్రయాణించి వేలాది మంది విద్యార్థులు ప్రయాణ ప్రయాసకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో బస్సుల్లేక ఆలస్యమై పరీక్షలకు కూడా దూరమవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

మచ్చుకు కొన్ని ఉదాహరణలు

వికారాబాద్ జిల్లా పరిగి, గడిసింగాపూర్ మీదుగా కిష్టాపూర్‌కు బస్సులు సకాలంలో బస్సులు నడపడం లేదని విద్యార్థులు రోడ్డుపై బైటాయించి నిరసన తెలుపుతున్నారు.గద్వాల జిల్లా రాజోలి మండలం మాన్‌దోడ్డి గ్రామ జెడ్పీహెచ్ఎస్‌కు వెళ్లేందుకు పరిసర ప్రాంతాల విద్యార్థులు లిఫ్టులు, ఇతర ప్రైవేటు వాహనాల్లో వెళ్తున్నారు.సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్, అందోల్ నియోజకవర్గాల్లో ఉన్నత పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులకు రవాణా సౌకర్యం కరువై నిత్యం ప్రయాణ పాట్లు పడుతున్నారు. ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే దాదాపు లక్షన్నర మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులుండటం గమనార్హం.

జగిత్యాల జిల్లా బీమారం మండలం వెంకట్రావుపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తిరిగి ఇంటికి రావాలంటే బస్సుల కోసం గంటల కొద్దీ ఎదురుచూస్తున్న పరిస్థితులు వారి ఆందోళనకు కారణమవుతోంది.వీటితో పాటు ఇతర జిల్లాల్లోనూ ఇలాంటి ఇబ్బందుల నడుమ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుకోవడం భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యావంతులు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. కొన్ని జిల్లాల్లో పరీక్షల సమయంలో బస్సులు ఆలస్యమై పరీక్షకు దూరమైన సందర్భాలున్నాయని చెబుతున్నారు. ఆర్టీసీ డీఎంలకు ఎన్నోసార్లు ఫిర్యాదులు వెళ్తున్నప్పటికీ పరిస్థితులు మారక, బస్సులు రాక తరచూ విద్యార్థులు ధర్నాలకు దిగుతుండటం తెలంగాణవ్యాప్తంగా నిత్యకృత్యంగా మారిందని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహిస్తున్నారు. అందుకే కేరళ తరహాలో ప్రభుత్వ పాఠశాలలు, ఆపై సర్కారు కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే ప్రభుత్వ విద్య మరింత బలోపేతమవుతుందని భావిస్తున్నారు. ఆర్థిక వెనుకబడిన పిల్లల కోసం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కారు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యానికి నిర్దిష్ట మార్గదర్శకాలను రూపొందించాలని కోరుతున్నారు.

పీసీసీ అధ్యక్షుడిగా నేను సక్సెస్

కోసమే ప్రధాని మోదీ జమిలీ ఎన్నికలు తీసుకువస్తున్నారు.. జమిలీ ఎన్నికలపై అప్రమత్తంగా ఉండాలి.తొమ్మిది నెలల్లో ఒక్క రోజు కూడా నేను సెలవు తీసుకోలేదు.ప్రభుత్వం చేపడుతున్న కొత్త కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.. భారతదేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం 27 రోజుల్లో 18 వేల కోట్ల రైతు రుణమాఫీ చేయలేదు.రైతు రుణ విముక్తి కావడమే ప్రభుత్వ లక్ష్యం...ఫ్యామిలీ డిజిటల్ కార్డు తీసుకురాబోతున్నం.రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డు ఇస్తాం.రాష్ట్రంలో ఎక్కడున్నా రేషన్ తీసుకునే అవకాశం కల్పిస్తాం.అధికారం కోల్పోయిన అసహనంలో ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తోంది.ఇంచార్జ్ మంత్రులు వారానికి రెండు సార్లు జిల్లాల్లో పర్యటించాలి.పార్టీలో కష్టపడి పనిచేసే వారికి కచ్చితంగా అవకాశాలు వస్తాయి" అన్నారు.

'హైడ్రా'బాద్ హడల్

జరిగిన కూల్చివేతలకు సంబంధించి వివరణ ఇచ్చిన హైడ్రా, ప్రభుత్వ స్థలాలు, చెరువుల ఎఫ్?టీఎల్, బఫర్ జోన్లలో నివాసం కోసం కాకుండా వ్యాపారం కోసం ఏర్పాటు చేసిన నిర్మాణాలను మాత్రమే కూల్చివేసినట్లు స్పష్టం చేసింది. కూకట్‌పల్లి నల్ల చెరువు 27 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, సర్వే నెంబర్ 66, 67, 68, 69లో 16 కమర్షియల్ షెడ్లు, ప్రహరీ గోడలను అక్రమంగా నిర్మించినట్లు గుర్తించామని, వాటిని కూల్చివేసి 4 ఎకరాల భూ మిని స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా వెల్లడించింది.సంగారెడ్డి జిల్లా అమీ న్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట్, పటేల్‌గూడలో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించి వాణిజ్య కార్యకలాపాల కోసం భవనాలను నిర్మించారని హైడ్రా పేర్కొంది. కిష్టారెడ్డిపేటలో సర్వే నెంబర్ 164లో వాణిజ్యపరంగా నిర్వహిస్తున్న 3 ఐదంతస్తుల భవనాలను కూల్చివేశామని, అక్కడ ఎకరం ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా వివరించింది. అలాగే పటేల్?గూడలోని సర్వే నెంబర్ 12/2, 12/3లోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి 25 నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని, వాటిని తొలగించి 3 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది.ఈ మూడు ప్రాంతాల్లో మొత్తంగా 8 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించినట్లు హైడ్రా వివరించింది. రెవెన్యూ, నీటి పారుదల, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి సంయుక్తంగా మూడు చోట్ల ఆపరేషన్ చేపట్టామని హైడ్రా వెల్లడించింది. నీటి వనరుల సంరక్షణ, ప్రభుత్వ భూములు అన్యక్రాంతం కాకుండా చూడటమే తమ లక్ష్యంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. హైడ్రా ఏర్పడి రెండు నెలలు పూర్తైంది. ఇప్పటి వరకు 26 చోట్ల 306 అనధికారిక నిర్మాణాలను కూల్చివేసింది. 119 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా ఆక్రమణదారుల నుంచి విడిపించింది.

ఉగ్రవాదం అంతమయ్యే పాక్‌తో చర్చలు ఉండవు

ఎవరూ చేయలేరు. జమ్మూకశ్మీర్‌లో కేవలం మన దేశ త్రివర్ణ పతకం మాత్రమే రెపరెపలాడుతుంది" అని అమిత్ షా పేర్కొన్నారు. "కొందరు పాకిస్థాన్‌తో చర్చలు జరపాలని బలంగా కోరుకుంటున్నారు. కానీ, ఉగ్రవాదం అంతమయ్యే వరకు వారితో ఎలాంటి చర్చలు జరిపేది లేదు. దేశంపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను జైలు నుంచి విడుదల చేయాలని వారు (కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ) కోరుకుంటున్నారు. కానీ, మోదీ సర్కార్ అలా ఎన్నటికీ చేయదు. భారత ప్రజలపై రాళ్లు రువ్విన వారికి కారాగారం నుంచి విముక్తి కల్పించేది లేదు" అని షా మరోసారి స్పష్టం చేశారు. కాగా.. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత మొదటిసారిగా అసెంబ్లీ ఎన్నికలు (సెప్టెంబరు 18న తొలి విడత, సెప్టెంబరు 25న రెండో విడత, అక్టోబరు 1న మూడో విడత)జరుగుతున్నాయి.ఏడు జిల్లాల పరిధిలో తొలిదశ కింద 24 శాసనసభ నియోజకవర్గాలకు ఇటీవల జరిగిన పోలింగు ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 61 శాతం పోలింగు నమోదైంది. దీనిపై అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. తదుపరి విడతల్లో పోలింగ్ జరగాల్సి ఉంది. అక్టోబరు 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

శ్రీలంక అధ్యక్షుడిగా అనుర కుమార దిసనాయకే

దేశాధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం

కొలంబో(జనంసాక్షి):

మార్క్సిస్ట్ నేత అనుర కుమార దిసనాయకే(56) శ్రీలంక నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. శ్రీలకం ఎన్నికల కమిషన్ దిసనాయకేను విజేతగా ప్రకటించింది. సోమవారం శ్రీలంక 9వ అధ్యక్షుడిగా దిసనాయకే ప్రమాణ స్వీకారం చేయనున్నారు.కాగా అనుర కుమార దిసనాయకే తన గెలుపపై దిసనాయకే స్పందించారు. "మనందరి శతాబ్దాల కల ఎట్టకేలకు సాకారమవుతోంది. ఈ విజయం ఏ ఒక్కరి కష్టం కాదు, వందల వేల మంది సమష్టి కృషి. ఈ విజయం మనందరిది. ఎందరో కన్నీళ్లు, ప్రాణ త్యాగాలతో మన ప్రయాణం సాగింది. వాళ్ల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివి. లక్షలాది కళ్లు ఎన్నో ఆశలతో నిండిపోయాయి. శ్రీలంక చరిత్రను తిరగరాయడానికి మేం సిద్ధంగా ఉన్నాం" అని ఎన్‌పీపీ నాయకుడు అనుర కుమార దిసానాయకే సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

ఐరాసలో భారత్ శాశ్వత సభ్యత్వానికి మద్ధతిస్తాం

క్యాన్సర్ స్క్రీనింగ్, వ్యాక్సినేషన్ నిర్వహించడంలో శిక్షణ ఇస్తారు" అని బైడెన్ వెల్లడించారు. ఇక, క్యాన్సర్ మూన్‌షాట్ కార్యక్రమంలో ప్రపంచ నేతలందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల ప్రాణాలు తీసే క్యాన్సర్‌ను నివారించేందుకు తమ సహకారం ఉంటుందన్నారు.ఇదిలా ఉండగా.. మొట్టమొదట మూన్‌షాట్ క్యాన్సర్ కార్యక్రమాన్ని 2016లో నిర్వహించారు. క్యాన్సర్‌పై పరిశోధనను వేగవంతం చేసేందుకు రోగులు, వైద్యులు, పరిశోధనా సంఘాల్ని ఒకచోట చేర్చారు. 2022లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈ ప్రయత్నాలు పునరుద్ధరించారు. ఫెడరల్ ఏజెన్సీలను ఒక చోట చేర్చి వైట్‌హౌస్ ద్వారా క్యాన్సర్ క్యాబినెట్‌ను సైతం సమావేశపరిచారు. ఇప్పటి వరకు ఐదు వేర్వేరు దేశాల్లో 95 కార్యక్రమాలు, విధానాలు, వనరులు అందించారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి లో భారత్‌కు శాశ్వత సభ్యత్వానికి అమెరికా మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ఆ దేశాధ్యక్షుడు జో బైడెన్ ఈ విషయాన్ని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అంశానికి క్వాడ్ నాయకులు సైతం మద్దతు పలికారు. మన దేశం ఎప్పటి నుంచో శాశ్వత సభ్యత్వానికి పట్టుపడుతోంది. భద్రతా మండలిలోని ఐదింట నాలుగు దేశాలు భారత్‌కు అనుకూలంగా ఉన్నా.. ఒక్క చైనా మాత్రం మోకాలడ్డుతోంది.అమెరికా పర్యటనలో ఉన్న మోదీ అమెరికా అధ్యక్షుడు బైడెన్‌ల మధ్య ఎంక్యూ9బీ డ్రోన్ల ఒప్పందంపై చర్చలు జరిగాయి. గత ఏడాదిగా వీటి కొనుగోలుకు చర్చలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ డీల్ మొత్తం విలువ సుమారు 3 బిలియన్ డాలర్లు. మొత్తం 31 డ్రోన్లలో 16 నౌకాదళానికి, 8 సైన్యానికి, మిగిలినవి వాయుసేనకు కేటాయించనున్నారు.కాగా మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం భారత ప్రధాని మోదీ శనివారం అమెరికా వెళ్లారు. క్యాన్సర్ మూన్‌షాట్ కార్యక్రమం, డెలావేర్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు.అనంతరం న్యూయార్క్‌కు

చేరుకున్నారు. ప్రధాని మోదీకి ప్రవాసులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ జరగనున్న కమ్యూనిటీ ఈవెంట్‌లో పాల్గొనేందుకు ఉత్సాహంగా ఉన్నానంటూ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. అమెరికాలోని ప్రవాస భారతీయులతో తీసుకున్న ఫొటోలను సైతం పోస్ట్ చేశారు.అమెరికా లోని న్యూయార్క్‌లో నేడు 'మోదీఉయూఎస్ ప్రోగ్రెస్ టుగెదర్' కార్యక్రమం నిర్వహించనున్నారు. కాగా ఈ ఈవెంట్‌కు ఇండో-అమెరికన్ కమ్యూనిటీ ఆఫ్ యూఎస్ఏ(ఎంఅజ) పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమానికి దాదాపు 14వేల మంది హాజరవనుండగా, పెద్దసంఖ్యలో సెలబ్రిటీలు రానున్నారని సమాచారం. 500 మంది కళాకారులు, 350 మంది వాలంటీర్లు, 85 మీడియా వర్గాలు, 40కి పైగా అమెరికా రాష్ట్రాలు ఈ కార్యక్రమానికి ప్రాతినిధ్యం వహించనున్నాయని నిర్వాహకులు వెల్లడించారు. ప్రవాస భారతీయులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించనున్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ.. ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్‌తో భేటీ అయ్యారు. డెలావేర్‌లోని బైడెన్ నివాసంలో ఇద్దరు నేతలు సమావేశమయ్యారు. ఇందులో భాగంగా జో బైడెన్‌కు మోదీ వెండితో చేసిన రైలు నమూనాను బహుమతిగా ఇచ్చారు. రైలు బండిపై దిల్లీ టు డెలావేర్ అని రాసి ఉంది. దీనిని మహారాష్ట్రకు చెందిన కళాకారులు తయారుచేసినట్టు తెలిపారు. 297 భారతీయ పురాతన వస్తువులు వెనక్కి..

వాషింగ్టన్: అక్రమ రవాణా సహా వివిధ మార్గాల్లో భారత్ నుంచి తరలిపోయి అమెరికాను చేరిన కళాఖండాలు తిరిగి స్వదేశానికి చేరనున్నాయి. క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో భాగంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా భారత్‌కు చెందిన 297 పురాతన వస్తువులు తిరిగి ఇచ్చేందుకు భారత్-అమెరికాల మధ్య ఒప్పందం కుదురింది.భారత్ నుంచి అమెరికాకు తరలిపోయిన 297 పురాతన వస్తువులు వెనక్కి అప్పగిస్తున్నందుకు అమెరికాకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఒప్పందం సాంస్కృతిక వస్తువుల అక్రమ రవాణా నిరోధించడాన్ని బలపరుస్తుందన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.ఇదిలా ఉండగా.. 2024 జులైలో దిల్లీలో జరిగిన 46వ ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశంలో సాంస్కృతిక వస్తువులను తిరిగి రప్పించడంపై అమెరికా- భారత్‌ల మధ్య ఒప్పందం జరిగింది. భారత్ నుంచి యూఎస్‌కి కళాఖండాల అక్రమ రవాణాను నిరోధించడం, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడంలో నిబద్ధతను బలోపేతం చేయాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.ఇక, సాంస్కృతిక సంపద చోరీ, లూటీలను నివారించాలని, వలస పాలకులు కొల్లగొట్టిన పురాతన వస్తువులను ఆయా దేశాలకు తిరిగి అప్పగించాలని 1970లో యునెస్కో తీర్మానించింది. దీన్ని ఆసరాగా చేసుకొని భారత్ నుంచి తరలిపోయిన విలువైన వస్తువులను కేంద్రం వెనక్కి రప్పిస్తోంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి భారత ప్రభుత్వం అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, సింగపూర్, ఆస్ట్రేలియా, కెనడాల నుంచి అనేక పురాతన వస్తువులను స్వదేశానికి తీసుకురాగలిగింది. ఇందులో భాగంగా అమెరికా ఇప్పటివరకు 578 పురాతన వస్తువులు అప్పగించింది. ఈ నేపథ్యంలో 2004- 2013 మధ్య కాలంలో భారత్‌కు కేవలం ఒక్కటంటే ఒక్క వస్తువు మాత్రమే వెనక్కి వచ్చింది.

'ఆప్'ను అంతమొందించేందుకు మోదీ కుట్ర

కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రధాని మోదీ తనను, మనీష్ సిసోదియాను అవినీతిపరులుగా చూపి, ప్రజలకు దూరం చేయాలని కుట్రపన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో మార్పు కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. అంతే కానీ సీఎం పీఠంపై కోరికతో, లేదా డబ్బు సంపాదించాలనే అత్యాశతో కాదని పేర్కొన్నారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి పదేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు దిల్లీలో సొంత ఇల్లు కూడా లేదని వెల్లడించారు."భాజపా ఆరెస్సెస్ నుంచి పుట్టింది. ప్రస్తుతం ఆ పార్టీ చేస్తున్న రాజకీయాలతో ఆరెస్సెస్ సంతృప్తిగా ఉందా? లేదా? అనే విషయాన్ని మోహన్ భగవత్ ప్రజలకు తెలియజేయాలి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతలను ప్రధాని పార్టీలో చేర్చుకోవడం సమంజసమా అని ఆయనను అడగాలనుకుంటున్నాను. పార్టీ నాయకులు 75 ఏళ్లు రాగానే పదవీ విరమణ చెయ్యాలనే నిబంధన భాజపాలో ఉంది. ఇది ప్రధాని మోదీకి వర్తించదా?" అని కేజ్రీవాల్ ప్రశ్నించారు.రాబోయే దిల్లీ ఎన్నికలు తనకు అగ్నిపరీక్ష వంటివని కేజ్రీవాల్ పేర్కొన్నారు. తాను నిజాయితీ గల వాడినని నమ్మితేనే ఎన్నికల్లో ఓటు వేయాలని ప్రజలను కోరారు. కేజ్రీవాల్ అనే వ్యక్తి నిజాయితీ లేనివాడైతే మహిళలకు ఫ్రీ బస్సు, ఫ్రీ కరెంట్, ప్రభుత్వాసుపపత్రుల్లో ఉచితంగా వైద్యం, పిల్లల కోసం కొత్త పాఠశాలల ఏర్పాటు చేసేవాడా? అని ప్రశ్నించారు. భాజపా పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ప్రజలకు ఇటువంటి సౌకర్యాలు ఉన్నాయా అని ప్రజలను అడిగారు.

బోనస్ కాదు.. బోగస్

హైదరాబాద్(జనంసాక్షి): సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది దసరా బోనస్ కాదు.. బోగస్ అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.కేసీఆర్ హయాంలో సింగరేణి ఎన్నో విజయాలు సాధించిందన్నారు. కాంగ్రెస్ హయాంలో లాభాల్లో వాటా 20 శాతానికి మించలేదని చెప్పారు. హైదరాబాద్‌

డొంక మింగిన కారు

- రాజకీయ పలుకుబడితో కబ్జా
- కళ్లు మూసుకున్న రెవిన్యూ
- సహకరించిన మాజీ అధికారి
- సర్వే రిపోర్టులు తారుమారు
- చేతులు మారిన భారీ నగదు

ఖమ్మం జిల్లా ప్రతినిధి (జనం సాక్షి): ఖమ్మం నగరంతో పాటు పరిసరాల్లోని ప్రైవేట్ , ప్రభుత్వ భూములన్నీ బిఆర్ఎస్ హయాంలో కబ్జాకు గురైయ్యాయి. చెరువులు , కాల్వలు, డొంకలు ఏ ఒక్కటి వదలకుండా కబ్జాకు పాల్పడ్డారు. భూమికి సంబంధించిన విషయం అని చెప్పగానే బిఆర్ఎస్ నాయకులు రెక్కలు కట్టుకొని వాలిపోయేవారు. బిఆర్ఎస్ నాయకుల కబ్జాల ద్వారా రెవిన్యూ , ఇరిగేషన్ అధికారులకు కనకవర్షం కురిసేది. దాంతో ఇరు శాఖల అధికారులు కోట్లకు పడగెత్తారు. గతంలో కబ్జాలకు పాల్పడిన వాళ్లు , అవినీతి అధికారులు ప్రభుత్వం మారడంతో కుక్కిన పేనుల్లాగా పడి ఉన్నారు. ఎప్పుడు ఏ బండారం బయటపడుతుందో అని భయం భయంగా బతుకుతున్నారు. హైడ్రా కబ్జాలను తొలగిస్తున్న విషయం విదితమే. ఇప్పుడు హైడ్రా ని రాష్ట్ర నలుమూలలకు విస్తరించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. హైదరాబాద్ తర్వాత అత్యధికంగా కబ్జాకు గురైన భూములు ఖమ్మంలోనే ఉన్నాయి. ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ప్రజల నుంచి బలంగా వినిపిస్తున్న డిమాండ్. ఖమ్మంలో ఇప్పటికే కబ్జా లపై దృష్టి సారించాలని అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. తాజాగా ఖమ్మం నగరంలోని గొల్లగూడెం గోశాల సమీపంలోని సర్వే నంబర్ 542 / ఇ కు పడమర , తూర్పున డొంక ఉంది. ఆ భూమి పై కన్నేసిన కొందరు డొంకను కలిపేసుకొని వారీ జాగీరైనట్లుగా ఏకంగా ఎత్తైన గోడను నిర్మించేసారు. డొంకను ఆక్రమించుకున్న వ్యక్తి వెనుక బిఆర్ఎస్ నాయకుల అండ ఉండటంతో అధికారులకు జేబులు నిండాయి. తమ కండ్ల ముందే ప్రభుత్వ డొంక కబ్జాకు గురౌతున్నప్పటికి అధికారులు నోరు మెదపలేదు. ఆ డొంకతో పాటు అక్కడి ఓ ప్రైవేట్ భూమిని కబ్జా చేసారు. బిఆర్ఎస్ లో కీలకంగా వ్యవహరించిన కొందరు వెనుక ఉండి తతంగం నడిపారు. కబ్జాకు సహకరించినందుకు గాను గత రెవిన్యూ అధికారులకు భారీగా బహుమానాలు అందాయి. సర్వే చేసిన రిపోర్టును సైతం బిఆర్ఎస్ నాయకులు తారుమారు చేసారు. సర్వేయర్ బెదిరించి బదిలి చేయిస్తామని హెచ్చరించారనే ఆరోపణలు ఉన్నాయి. దాంతో సర్వేయర్ చేసేది లేక మౌనం వహించాడు. రెవిన్యూ , ఇరిగేషన్ అధికారులు ఎన్ని డొంకలు , చెరువులు ఉన్నాయి. వాటి విస్తీర్ణం ఎంతుంది. అవి భద్రంగా ఉన్నాయా లేవా అనే సమాచారం సేకరించడం లేదు. ప్రభుత్వ భూములు , పంట కాల్వలు , డొంకలు కబ్జాకు గురి కావడంలో రెవిన్యూ , ఇరిగేషన్ అధికారుల ప్రధాన భూమిక ఉంది. హైడ్రా కు ఫిర్యాదులు అందిన తరహాలో ఖమ్మంలో గొల్లగూడెం డొంక కబ్జాకు సంబంధించి జిల్లా అదనపు కలెక్టర్ కు ఓ వ్యక్తి ఫిర్యాదు చేసాడు. గత ప్రభుత్వ హాయాంలో జరిగిన పరిణామాలను తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన వద్ద ఉన్న అన్ని ఆధారాలు సమర్పించాడు. అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఫిర్యాదును స్వీకరించి ఖమ్మం ఆర్డిఓ కు ఫార్వర్డ్ చేసారు. ఇప్పుడున్న రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకుంటారో లేక గతంలోని అధికారుల్లాగా వ్యవహరిస్తారో వేచి చూడాల్సిందే.

'రోబోటిక్' శస్త్రచికిత్సలతో
విప్లవాత్మక మార్పులు

- ఇది ఖర్చులను గణనీయంగా తగ్గిస్తుంది
- కీళ్ల చికిత్సకు అత్యాధునిక పద్ధతులు
- అపోలో హాస్పిటల్ సీనియర్ ఆర్థో, జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ మితిన్ ఆచి
- ఆర్థోప్లాస్టీ ఆర్థోస్కోపీ సమ్మిట్ 2024 నిర్వహణ

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : 'రోబోటిక్' తో శస్త్రచికిత్సలు విప్లవాత్మక మార్పులకు నాందిగా చెప్పవచ్చని అపోలో హాస్పిటల్ సీనియర్ ఆర్థో, జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్, ఏఏఎస్ కోర్సు డైరెక్టర్ డాక్టర్ మితిన్ ఆచి తెలిపారు. ఇది ఖర్చులను గణనీయంగా తగ్గిస్తుందన్నారు. కచ్చితమైన వైద్య సేవలకు ఆస్కారం ఉంటుందన్నారు. అపోలో హాస్పిటల్స్, అపోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ తో కలిసి తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ (టీఓఎస్ఏ), ట్విన్ సిటీస్ ఆర్థోపెడిక్ సొసైటీ (టీసీఓఎస్) ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్లోని అపోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ లో 8వ ఆర్థ్రోప్లాస్టీ ఆర్థ్రోస్కోపీ సమ్మిట్ 2024 (ఏఏఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రోబోటిక్ శస్త్రచికిత్స దీర్ఘకాలిక సమర్థత ఇంకా పరిశోధనలో ఉందన్నారు. హిప్ రీప్లేస్మెంట్ సమయంలో కచ్చితమైన కప్ పొజిషనింగ్లో, తీవ్రమైన మోకాలి వైకల్యాలు నిర్వహించడంలో దీని ప్రయోజనాలు కాదనలేనివన్నారు. ఈ పురోగతి అధునాతన చికిత్సా ఎంపికలను మరింత సరసమైనదిగా చేస్తాయన్నారు. పెద్ద సంఖ్యలో రోగులకు అందుబాటులోకి తెస్తుందన్నారు. ఇది కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలో సమూల మార్పులకు కారణమవుతుందని తెలిపారు. కీళ్ల సంరక్షణలో అత్యాధునిక పురోగతిని ఈ సమ్మిట్ గుర్తించిందన్నారు. కీళ్లనొప్పులు రాకుండా నిరోధించే లక్ష్యంతో మోకాలిలోని మృదులాస్థి గాయాలకు సంబంధించిన కీళ్ల మార్పిడిలో రోబోటిక్స్ పాత్రపై అంతర్దృష్టులు ఉన్నాయన్నారు. ఈ చర్చలు జాయింట్ ప్రిజర్వేషన్లో అత్యంత అధునాతన పద్ధతులను, భుజం శస్త్రచికిత్సలో కనిష్టంగా ఇన్వాసివ్ కీహోల్ విధానాలను కవర్ చేశాయన్నారు. సీనియర్ సర్జన్ రోబోట్కి సమానమైన ఫలితాలు ఇస్తారని సెమినార్ అభిప్రాయపడిందని తెలిపారు. రోబోల తయారీ, సేకరణ ఖర్చులను తగ్గించుకోవడానికి మేకింగ్ ఇన్ ఇండియా ఉత్తమ మార్గం అన్నారు. భవిష్యత్తులో ఆస్టియో ఆర్థరైటిస్ను నిరోధించడానికి నమ్మదగినదనవన్నారు. స్వల్పకాలిక ఫలితాలలో నిరూపించబడ్డాయని తెలిపారు. దీర్ఘకాలిక ఫలితాలు ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్ సీనియర్ ఆర్థో, జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్, ఏఏఎస్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎన్ సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సమగ్ర బోధనా వ్యాయామం యువ ఆర్థోపెడిక్ సర్జన్లకు విజ్ఞానం, నైపుణ్యాలు రెండింటిపై మార్గనిర్దేశం చేయడానికి రూపొందించబడిందని తెలిపారు. సరైన శస్త్రచికిత్స సూచనలు గుర్తించడం లోనూ నైపుణ్యం సాధించడంలోనూ అన్నారు. విద్యార్థులకు శస్త్రచికిత్స కచ్చితత్వం, నైపుణ్యాన్ని పెంపొందించడంలో సహాయపడిందని తెలిపారు.

తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ
లడ్డూ వివాదం దురదృష్టకరం

- సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ లడ్డూ వివాదం దురదృష్టకరమని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి అన్నారు. చంద్రబాబు విజనరీ లీడర్ అని, అలాంటి వ్యక్తి ఇంత మంది భక్తులను ఆందోళనకు గురి చేసే స్టేట్మెంట్ ఎందుకు ఇచ్చారో అర్థం కావట్లేదన్నారు. లడ్డు కల్తీ జరిగిందని, ఏదయినా జరిగితే విచారణ చేయండని మాజీ సీఎం జగన్ అంటున్నారని, ఏ దేశ విదేశాల్లో వున్న భక్తులు ఇపుడు లడ్డు తినాలా వద్దా అనే ఆందోళనలో వున్నారని, ఏ తిరుపతిలో స్వామి దర్శనం తర్వాత లడ్డు ప్రసాదం తింటేనే భక్తులకు తృప్తి అని, ఇప్పుడా తృప్తి లేకుండా చేస్తున్నారని, ఏ తిరుపతి వెంకన్న స్వామి అందరివాడని, వైసీపీ టీడీపీ రాజకీయ గొడవల్లో శ్రీవారిని ఆలయాన్ని ప్రసాదాన్ని అప్రతిష్ట పాలు చేయొద్దని, ఏమీ రాజకీయాలు కొట్లాటలు వేరే సబ్జెక్టుల మీద వేరే అంశాలు మీద పెట్టుకోవాలని, అంతే కానీ దేవుడి విషయంలో కాదని, ఏ కాంగ్రెస్ పార్టీ నాయకుడు లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఏం జరిగిందో తక్షణమే విచారణ చేసి దోషులను శిక్షించాలని కోరారు హిందువుల మనోభావాలను కాపాడాలని సూచించారు. ఏ తక్షణం దీని మీద విచారణ చేసి దోషులని శిక్షంచాలని, ఈ విషయం లో రాజకీయాలు మానేయాలని, ఏ తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయ లడ్డు విశిష్టతను కాపాడటంపై అధికార టిడిపి ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలు దృష్టి పెట్టాలని కోరారు. ఏ శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తుడిగా ఏపీలోని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు.

జోష్ నింపిన జగిత్యాల ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల స్పార్కిల్ 2024

జగిత్యాల బ్యూరో , సెప్టెంబర్ 21,(జనం సాక్షి) : సాంస్కృతిక కార్యక్రమాలతో నూతన ఉత్సాహం కలుగుతుందని మరియు వివిధ కార్యక్రమాలను చాలా ప్రైవేట్ వేదుక హద్దుగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి జగిత్యాల స్థానిక ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు వారు చదువుల తల్లి సరస్వత మాత విగ్రహానికి పూల మాల వేసి సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేసి వేదుకలను అజ్ఞాహసంగా ప్రారంభించారు. వేదుక మందిరంలో ఆకాశమే నేదు చాలా మంది విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారని, అనుకున్న లక్ష్యాలను చాలా సులభంగా చేదిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కడు తరగతి గదుల్లో చాలా ఉత్తమంగా వ్యవహరించి, శ్రద్దతో, ఏకాగ్రతతో అధ్యాపకులు భోదించే విషయాలను సమగ్రంగా విని విశ్లేషించుకోవాలని కోరారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు కావాల్సిన వనరులను సమకూర్చి వారిన అగ్రప్రెసిలో నిలుపేందుకు ప్రోత్సాహం అందించి సాధించే దిశగా పయనించాలను సూచించారు. మన దేశం నుండి రాష్ట్ర ప్రతినిధులు అభివృద్ధి ప్రణాళికలను రూపొందస్తు విద్యార్థులను ఎల్లపుడు ప్రోత్సహిస్తూ వారికి ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తున్నారని చెప్పారు. వివిధ పనులకు ఆకర్షితుడై ఆకర్షితులై ఉన్నాల భవిషత్ ను వృథా చేసుకోవద్దని చెప్పారు. చిన్నవాటి నుండే ఉత్తమంగా వ్యవహరించి సమాజనికి ప్రతీకగా ఉండాలని చెప్పారు. ఆల్ఫోర్స్ విద్యార్థులు సంచలన విజయాలను నమోదు చేయడం చాలా అభినందనీయమని మరియు మొదటి నుండే ఉత్తమంగా వ్యవహరిస్తు చాలా చక్కటి పేరు ప్రఖ్యాతలను వ్వంతం చేసుకోవడం వారి వ్యవహరా శైలికి ఒక గొప్ప నిదర్శనమని అభివర్ణించారు. గత 30 సంలుగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు నిర్విరామంగా విరాటకంగా కృషి చేస్తున్నదని మరియు విద్యాభివృద్ధికై నూతన ఒరవడిని సృష్టిస్తు సమాజంలో వెలుబడుతున్న మార్పులకు అనుగుణంగా మరియు ప్రవేశపెడుతున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగడమే కాకుండా సంచలనాత్మక విజయాలను నమోదు చేస్తు నూతన అధ్యాయాలకు బీజం పోస్తున్నదని హర్షం వ్యక్తం చేశారు. 1. విద్యార్థులను అన్ని రకాలుగా అభివృద్ధి పరచడమే ప్రధాన లక్ష్యమని చెప్పారు. విద్యార్థుల కృషి వంగే నేదు ఆల్ఫోర్స్ జగిత్యాలను విద్యారంగ అభివృద్ధికి మారు పేరుగా నిలిచినదని "విరిచివరని కొనియాడారు.వేదుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి మైనమ్మ , ఓమైసమ్మ, జయ్ సియరామ్ జయ్ జయ్ సియరామ్, అబ్బవితీయని దెబ్బ, దెబ్బ, స్నేహాన్నికన్న మిన్న, చలియా చలియా... వృత్యాలు చాలా అలరించాయి మరియు మన దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన విద్యార్థులను అతిథులు చాలా గొప్పగా సన్మానించారు. ముఖ్యంగా తల్లిదండ్రుల వారి పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి లక్ష్యాలను సాధించే విధంగా ప్రేరేపించి ముందంజలో నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ప్రిన్సిపాల్, అధ్యాపకలు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

వాస్తవ లాభాలపై శ్వేత పత్రం విడుదల చేయాలి

- బిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

నస్పూర్, సెప్టెంబర్ 22, (జనం సాక్షి): సింగరేణి యాజమాన్యం 2023-24వ సంవత్సరంలో సాధించిన వాస్తవ లాభాలపైన శ్వేత పత్రం విడుదల చేయాలని బి.ఎం.ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బి.ఎం.ఎస్ కార్యాలయంలో శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 4701 కోట్ల నికర లాభం అర్జించిందని,కార్మికులకు ఇచ్చే 796 కోట్లలో 33 శాతం వాస్తవ లాభాలను చెల్లిస్తున్నామని ప్రకటించినప్పటి,కేవలం 16.9 శాతం మాత్రమే చెల్లిస్తుందని తెలిపారు.వాస్తవ లాభాలను పంపిణీ చేయడంలో సింగరేణి యాజమాన్యం వైఫల్యం చెందిందని తెలిపారు.33 శాతం లాభాల వాటా ఇప్పించిన ఘనత మాకే దక్కుతుందని చెప్పుకుంటున్న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు, సంస్థ ఆర్జించిన 4701 కోట్ల నికర లాభం పై ఏ లెక్కన 33 శాతం వాస్తవ లాభాలు చెల్లించారో కార్మిక లోకానికి తెలియజేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు రాగం రాజేందర్, పురుషోత్తం చారి,గూడ శ్రీకాంత్, మంద కమలాకర్, మేకల స్వామి,జెల్ల తిరుపతి, మోతే ఓదెలు,కాంపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : త్రిపుల్ఆర్ భూసేకరణను ముందుగా నిర్ణయించిన అల్మెన్మెంట్ ప్రకారమే చేపట్టాలని సీపీఐ(ఎం) పొలిట్బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డితో కూడిన పార్టీ ప్రతినిధి బృందం నిన్న రాత్రి ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించింది. భూసేకరణ, సిరిసిల్ల పవర్లూమ్కు విద్యుత్ ఛార్జీలు, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల వంటి పలు సమస్యలపై చర్చించారు. భూసేకరణలో మొదటి అల్మెన్మెంట్ను ప్రభుత్వం మార్చడం వల్ల మధ్యతరగతి ఉద్యోగులు, రైతులు, పేదలు నష్టపోతున్నారని, దాని ప్రకారమే ప్రభుత్వం ముందుకు పోవాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఇప్పటికే త్రిపుల్ఆర్ అల్మెన్మెంట్ మార్పుపై నిర్ణయం జరిగిపోయిందనీ, వెనక్కి వెళ్లడం కష్టమనీ, బాధితులకు నష్టపరిహారం పెంచే ప్రయత్నాం చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. సిరిసిల్లలో పవర్లూమ్ల కరెంటు చార్జీలను ప్రభుత్వం రూ.2 నుంచి రూ.8.30లకు పెంచడంతో 30,000మంది పవర్లూమ్ కార్మికులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. పదేండ్ల నుంచి బకాయిలు కట్టాలంటున్నారని పేర్కొన్నారు. దానివల్ల పవర్లూమ్లు మూతపడ్డాయనీ, కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. పవర్లూమ్లకు కరెంట్ రాయితీని కల్పించాలని కోరారు. గతంలోలాగా యూనిట్కు రూ.2 వసూలు చేసి కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కొంతమంది జర్నలిస్టులకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. అయితే కొందరు సీనియర్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు రావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఒక సొసైటీకి భూమి ఇచ్చిందని వివరించారు. ఆ సొసైటీలో లేని సీనియర్ జర్నలిస్టులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీనియర్లు నష్టపోకుండా తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జూబ్లీహిల్స్ సొసైటీలో సీనియర్లు ఎక్కువమంది ఉన్నారని వివరించారు. ఏ సొసైటీలో ఉన్నప్పటికీ వారి సొసైటీ ద్వారా స్థలాలు పొందేవిధంగా సీనియర్ జర్నలిస్టులకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను పరిశీలించాలంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డిని సీఎం కోరారు. హన్మకొండ జిల్లా కాకతీయ విశ్వవిద్యాలయానికి ఆనుకుని 40సం?లుగా నివసిస్తున్న టీచర్లు, కాంట్రాక్టు కార్మికులు, ఆటో డ్రైవర్ల ఇండ్లను యూనివర్సిటీ స్థలమనే పేరుతో కూల్చివేస్తామని మున్సిపల్ అధికారులు బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ఇది వారి ప్రయివేటు స్థలమనీ, వర్సిటీకి సంబంధం లేదని తెలిపారు. సాధారణ ఉద్యోగులు, కార్మికుల ఇండ్లను కూల్చవద్దనీ, వాటిని పరిరక్షించాలని కోరారు.

కాపు కులాల పునరేకీకరణతోనే అభివృద్ధి సాధించగలం

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : కాపు కులాల పునరేకీకరణతోనే అభివృద్ధి సాధించగలమని కృష్ణ దేవరాయ ఉద్యోగ జేఏసీ నాయకులు ఎస్.రామకృష్ణ, తెలంగాణా మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాల శ్రీనివాస్ పటేల్ అన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ లో జలవిహార్ లో జరిగిన 9 వ వార్షికోత్సవం తో పాటు 1000 లీడర్స్ గ్లోబల్ మీటింగు 1400 మంది హాజరు అయ్యారు. కేఎన్ కుమార్ కన్వీనర్, ఫౌండర్, మెండు చక్రపాణి దేశంలో తెలంగాణ తమిళనాడు కర్నాటక కేరళ ఓరిస్సా మహారాష్ట్ర లో పనిచేసే సినియర్ బ్యూరోకసీ, ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, సీనియర్ సినియర్ లాయర్స్, డాక్టర్లు , శాస్త్రవేత్తలు , బిజనెస్ పీపుల్స్, టీచర్స్ ఉద్యోగులు, ఇతర రంగాల్లో నిష్ణాతులు హాజరయ్యారు. శ్రీకృష్ణ దేవరాయ ఉద్యోగ జేఏసీ నాయకులు ఎస్.రామకృష్ణ, తెలంగాణా మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాల శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ దక్షణ భారత దేశం కాపు కులాలను పునరేకీకరణతో అభివృద్ధి సాదించగలమన్నారు. బలిజ , కాపు , తెలగ , ఓంటరి తూర్పుకాపు మున్నూరు కాపు కలిపి మహబలిజ గా పునరేకీకరణ, ఆర్థిక సామాజిక సాంస్కృతిక జానపద కలిపి ప్రమోట్గా కల్పి పండుగలు, కార్యక్రమాలు నిర్వహించి ఐక్యత సాధించాలని,2025 సెప్టెంబర్లో ఐకాన్ లీడర్స్తో కార్యక్రమం నిర్వహిస్తామని, రాజకీయం బోమ్మ బోరుసు గా మాత్రమే ఐకాన్గా గుర్తిస్తామని, విద్య, ఆర్థిక విషయాలు పై ఫోకస్ పెడతామని, ఉద్యోగ ఉపాద్యాయ పెన్షనర్లు ద్వారా మన జాతి ఐక్యం గా నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ నుండి మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగులు టీచర్లు అధిక సంఖ్యలో హజరు అయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుండి 50 మంది శ్రీకృష్ణ దేవరాయ ఉద్యోగ జెఏసి హజరయ్యారు.

విద్యుత్ సిబ్బందిపై
తేనెటీగల దాడి..

- పరిస్థితి విషమం.. ఆసుపత్రికి తరలింపు..

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): విద్యుత్ మరమ్మతు పనులు చేసేందుకు వెళ్లిన విద్యుత్ సిబ్బందిపై తేనెటీగలు దాడి చేసిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని బాంబులగడ్డకు 33 కెవి లైన్ విద్యుత్ మరమ్మత్తు కోసం తిరుపతి, మహేశ్, అనీల్ అనే లైన్ మెన్, మరో ఇద్దరు అసిస్టెంట్ లైన్ మెన్ లు వెళ్లారు. అయితే విద్యుత్ మరమ్మతు చర్యల్లో భాగంగా చెట్లను తొలగిస్తున్న క్రమంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో లైన్ మెన్, అసిస్టెంట్ లైన్ మెన్ లు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

బిడ్డలు తండ్రి గుండె చప్పుళ్ళు!

ఎస్ బేటీయా బాప్కే దిల్ కె దడ్కన్ హోతే హై! (బిడ్డలు తండ్రి గుండె చప్పుళ్ళు!) ఒక గడపలో ముగ్గు ఉందంటే ఆ ఇంటిలో ఒక బిడ్డ ఉన్నట్లే లెక్క! ఒక తండ్రి ఆరోగ్యంగా ఉండడానికి కారణం బిడ్డలే!ఇంటికి ఇల్లాలు ఎలా అందమో,కూతురు కూడ అంతే! అందుకే కూతురు ను చాలామంది నా బంగారం,మా అమ్మనే అని పిలుచుకుంటూ ఉంటారు.తొలుసూరి ఆడపిల్ల పుడితే ఇంటికి లక్ష్మి వచ్చినట్టే అంటారు. ఆడపిల్లలు ఉన్న ఇంటిలో ఇంటిల్లిపాధి అందరూ హ్యాపీ గా ఉంటారు. డాటర్స్ డే ను ప్రతి సెప్టెంబర్ 22 న జరుపుకుంటూఉంటాము! గురువారం చాలా మంది సెల్ ఫోన్ లలో బిడ్డల స్టేటస్ లు పెట్టుకుని, వారికి అభినందనలు తెలుపుకుని, తల్లి, దండ్రులు, ముఖ్యంగా తండ్రులు సంబరపడిపోవడం చూసాను. కేంద్రం భేటీ బచావో,భేటీ పడావో అంటూ గత దశాబ్ద కాలంగా నినాదాలు ఇస్తున్నది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఫోటో తో పెద్ద, పెద్ద హోర్డింగులు చూస్తూనే ఉన్నాము. దేశ వ్యాపితంగా బిడ్డల మీద దాష్టికాలు మాత్రం తగ్గలేదు!రేప్ అండ్ మర్డర్ లు పెరుగుతూనే ఉన్నాయి. మనదేశం బోర్డర్లలో ఉండి, మన దేశం రక్షణ కోసం, రాత్రినక, పగలు అనక ఫహరా కాస్తూ, అప్పుడపుడు, శత్రువు తో పోరాడుతూ,శత్రువు దొంగ దాడుల్లో ఊపిరి కోల్పోతున్న సైనికుల బిడ్డలకే రక్షణ లేని పరిస్థితి ఉంటుందంటే, పరిస్థితి దేశంలో ఎలా ఉందో తెలుస్తున్నది. అందుకే బిడ్డల రక్షణకు కృషి చేయాలి, వారిని వారు రక్షించుకునే విధంగా వారిని ట్రైన్ చేయాలి!ఎవరిని నమ్మాలో, నమ్మవద్దో అర్థంకాని పరిస్థితి ఉన్నది. ఆడపిల్లలు ఒంటరిగా కనిపిస్తే చాలు, నిస్సహాయంగా కనిపిస్తే చాలు, భర్త వెంట ఉన్నా,తండ్రి, సోదరుడు, ఎవరు వెంట ఉన్నా బిడ్డల పట్ల ఆకతాయిలు వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకరంగా ఉంటున్నది.దేశంలో డాక్టర్స్, నర్సులు, న్యాయవాదులు, ఉద్యోగులు, కూలి లు, నిరుపేద ఆడబిడ్డలే ఒంటరిగా తిరిగే పరిస్థితి, బయటకు వెళ్లే పరస్థితి లేదు!పరిస్థితులు కొన్ని చోట్ల చాలా భయంకరంగా ఉన్నాయి,అంటే అతిషయోక్తి కాదు!బిడ్డల రక్షణకు ప్రభుత్వం లు గ్యారంటీ ఇచ్చే పరిస్థితి లేదు! ఇందులో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని, వెలుగు చూస్తున్న పలు సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. ఆడ బిడ్డలను కాపాడుకుందాం! వారికి రక్షణ కవచం లా ఉందాం!మానసికంగా వారిలో ధైర్యం నింపే పని కి ఇంటి నుంచే శ్రీకారం చుడుదాం! ఆడపిల్లల ను గౌరవించే విధంగా మగ పిల్లలకు చిన్నప్పటి నుంచే సమానతల తో పెంచుతూ వారికి విషయాన్ని, ఆడపిల్లల ప్రధాన్యతను వివరించాలి!

ఎండి. మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

ఈ ఎన్నికలు ఎటువైపు?

నేడు 'ఒకే దేశం ఒకే ఎన్నికలు' అనే యజ్ఞం కోసం కేంద్రం సిద్ధమైపోయినట్టుంది. గత సంవత్సరమే మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది., అది సిఫారసులు ఇవ్వడం, కేంద్ర మంత్రిత్వ శాఖ ఆమోదం తెలపడం, ప్రభుత్వం అందుకు అనుగుణంగా సన్నద్ధం కావడం జరిగిపోతోంది. ఈ సిఫారసుల ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించడం జరుగుతుంది. ఆ తర్వాత 100 రోజులకు లోకల్ ఎన్నికలు నిర్వహిస్తారు. ఒకవేళ లోక్ సభ ఎన్నికలకు ముందు ఏదైనా రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడం జరిగితే, వాటి కాల పరిమితి కూడా లోక్ సభ ఎన్నికల వరకు మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత, ఆ రాష్ట్రాలు మరలా లోక్‌సభతో కలిపి ఎన్నికల కోసం సిద్ధం కావలసి ఉంటుంది. దాదాపు ఆరు అధికరణాలు ఇందుకోసం సవరిస్తారు. బిల్లులు ప్రవేశపెడతారు.

ప్రభుత్వం వాదన ప్రకారం, ఇలా నిర్వహిస్తే ఖర్చు తగ్గుతుంది. ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. ఎన్నికల నిర్వహణలో మరింత సౌలభ్యం ఏర్పడుతుంది. ఎన్నికల కోడ్ మాటి మాటికి లేకపోవడం కారణంగా వివిధ సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులు తొలగుతాయి. కాబట్టి పరిపాలనలో అడ్డంకులు లేకుండా సున్నితంగా ముందుకు నడుస్తుంది. దేశ అభివృద్ధి అగ్రగతిలో నడుస్తుంది. అభివృద్ధి చెందిన దేశాలతో మనం చేరతాం.. ప్రతిపక్షం ప్రకారం, భారతదేశం ఫెడరల్ రాజ్యాంగం స్వభావంతో ఉంది. కేంద్రం హక్కులు కేంద్రానికి ఉన్నాయి. రాష్ట్రాల హక్కులు రాష్ట్రాలకు ఉన్నాయి. ఒకే దేశం ఒకే ఎన్నికలు అనే నినాదం కింద రాష్ట్రాలు తమకంటూ ఒక ఉనికిని కోల్పోతాయి. రాష్ట్రాలకు సంబంధించిన పార్టీలకు ప్రాధాన్యత తగ్గుతుంది. ఇలా ఎన్నికలు జరిగేటప్పుడు కేంద్రానికి సంబంధించిన అంశాలే డామినేట్ అవుతాయి. రాష్ట్రాలకు సంబంధించిన అంశాలు వెనక్కి నడుస్తాయి. ప్రజలు వాటిని పెద్దగా గుర్తించరు.

ఈ కొత్త విధానం ఎన్నో కొత్త సమస్యలను సృష్టిస్తుంది. లోక్ సభ లో ఏదైనా ఒక ప్రభుత్వం ఏర్పడినప్పుడు, ఆ ప్రభుత్వం సక్రమంగా పనిచెయ్యకపోతే, ఆ ప్రభుత్వం మీద అవిశ్వాసం ఏర్పడినప్పుడు, ఆ ప్రభుత్వం పడిపోయి మరలా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉంటుంది. కానీ, కొత్తగా ప్రతిపాదిస్తున్న జమిలి ఎన్నికల ప్రకారం, ఈ అవకాశం ప్రజలకూ, ప్రజా ప్రతినిధులకూ దొరక్కుండా పోతుంది. అంటే, ఒకసారి మనం ఎన్నుకుంటే, ఆయా ప్రభుత్వాలు ఎలా పరిపాలన చేసినా సరే, అవిశ్వాస తీర్మానం అనేది అసాధ్యం అయ్యేలా వాస్తవ పరిస్థితి ఉంటుంది. ఒకవేళ, కేంద్ర ప్రభుత్వం పడిపోయే పరిస్థితి వచ్చేటప్పుడు, రాష్ట్రాల అసెంబ్లీల పరిస్థితి ఏమవుతుంది? ఇదే పరిస్థితి రాష్ట్రాలలో కూడా రావచ్చు. అప్పుడు లోక్ సభ గడువు వరకు ఆ రాష్ట్రాలు వేచి ఉండాలా? అంతవరకూ ఆయా రాష్ట్రాల్లో ప్రెసిడెంట్ రూల్ విధిస్తారా? కనీస ప్రజాస్వామ్య హక్కులు ఇవ్వరా? నోట్ల రద్దు సమయంలో కూడా దేశానికి ఏదేదో మంచి జరిగిపోతుందనీ, ఇదో మహా యజ్ఞం అనీ నమ్మించారు. జి ఎస్ టి సమయంలో కూడా ఇలానే నమ్మించారు. వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా మారాయి. దేశమంతా ఒకే పన్ను విధానం ఆరంభం అయ్యేటప్పుడు దేశాభివృద్ధి ఎంతో ముందుకు నడుస్తుందని ఆరోజు నమ్మించారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పన్ను విధించడం ద్వారా పాలనా సౌలభ్యం దెబ్బతింటుంది అని అన్నారు. కానీ వాస్తవంలో జరిగిందేమిటి? తమ రాష్ట్రాల పన్నుల కోసం కూడా రాష్ట్రాలు కేంద్రం మీద నిస్సహాయ స్థితిలో ఆధారపడే పరిస్థితి వచ్చింది. మా వాటా మాకు ఇవ్వండి అని ప్రతిసారి రాష్ట్రాలు కేంద్రానికి అభ్యర్థించడం అనే పరిస్థితి దాపురించింది. మొదట్లో ఇలా లేకుండేది. అలానే దేశమంతా ఒకే పన్ను విధానం ద్వారా దేశం అభివృద్ధి అవుతుందని, ప్రజల సంక్షేమం బాగుపడుతుందని అన్నారు. కానీ ఏ రకమైన పన్నులు ఉన్నా సరే అభివృద్ధి అనేది రాజకీయ నాయకులకే ఉంటుంది. కానీ సాధారణ ప్రజలకు ఎలా ఉంటుంది? ప్రజలు అప్పుడు ఎలా ఉన్నారో ఇప్పుడు అలానే ఉన్నారు. ప్రజల సమస్యలు అప్పుడు ఎలా ఉన్నాయో, ఇప్పుడు అలానే ఉన్నాయి. అభివృద్ధి ఫలాలు ఎప్పుడూ కూడా సాధారణ ప్రజలకి అందవు. అందేదంతా ధనిక వర్గానికే.



ఖర్చు తగ్గుతుందనే సాకుతో దేశమంతా ఎన్నికలు ఒకేసారి నిర్వహించడం అనేది పార్లమెంటరీ రాజ్యాంగానికి, ఫెడరల్ విధానానికి విరుద్ధం. 2014 నుండి ఎన్నికలు మరింత ఈవెంట్ మేనేజ్మెంట్ గా మారిపోయాయి. ఎన్నికలు ఒక భారీ వ్యాపారం అయ్యాయి. ఎలెక్టోరల్ బాండ్ల కుంభకోణం మనకు తెలిసిందే. వ్యాపారాలు నిశ్చయంగా ధనిక వర్గానికి మాత్రమే ప్రయోజనం ఇస్తాయి. అలానే, వ్యాపారంగా రూపొందిన ఎన్నికలు కూడా. ప్రజలకు ప్రజాస్వామ్యం అనే మాటలు చెబుతూ, ఒకవైపు కార్పొరేట్లు, మరోవైపు విపరీతంగా డబ్బు బలం ఉన్న ధనిక పార్టీలు కుమ్మక్కై మొత్తం ఎన్నికలని హైజాక్ చేసి దేశమంతా ఒకే పార్టీ ఉండేలా శాసించే పరిస్థితి రావచ్చు. ముఖ్యంగా 1990 తర్వాత ప్రారంభమైన ప్రపంచీకరణ ప్రజా ప్రయోజనాలను పక్కకు తోసి, పాలిసీల్లో కార్పొరేట్ వర్గం ప్రయోజనాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 2014 తర్వాత ఇది మరింత తీవ్ర స్థాయికి చేరుకుంది. ప్రశాంత్ కిషోర్ ల ప్రవేశంతో ఎన్నికల రూపురేఖలు మారిపోయాయి. వీరంతా ఎన్నికలకు ఒక వ్యూహం అందించారు. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో రకమైన వ్యూహాన్ని అందిస్తూ ఎన్నికలను ఒక వ్యాపార కేంద్రంగా మార్చారు.

దేశంలోకి విపరీతంగా వచ్చి పడుతున్న పెట్టుబడులకు ఒక సానుకూలమైన ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు కావాలి. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారీ వర్గానికి తమకు ఇబ్బంది కలగని, తమ పాలనా విధానాలకూ, తమ వ్యాపార ప్రయోజనాలకూ అడ్డంకులు లేని ఒక సున్నితమైన ఆర్థిక విధానం కావాలి. ఎన్నికలు దేశమంతా ఒకేసారి నిర్వహిస్తే ప్రయోజనం పొందేది ఎన్నికల ఈవెంట్ మేనేజ్మెంట్ నిర్వహించగలిగే బి జే పి లాంటి బలమైన పార్టీలే. చిరునామా కోల్పోయేది రాష్ట్రాలకు సంబంధించిన చిన్న పార్టీలే. ఎన్నికల మీద మరింత భారీగా పెట్టుబడులు చేరతాయి. కాబట్టి ఖర్చు తగ్గడం అనేది జరగదు. ఖర్చు మరింత భారీ స్థాయిలోకి చేరుతుంది ఎన్నికల్ని మరింత భారీగా ఈ విధానం మార్చుతుంది. విపరీతమైన పెట్టుబడులు ఎన్నికల్లోకి వస్తాయి. ఎన్నికల నిర్వహణ మరింత సులభం అవుతుందనే వాదన అర్థం లేని మాట. ఎన్నికలను నిర్వహించే ఎన్నికల కమిషన్ ఇలా ఎన్నికల నిర్వహణ కష్టం అవుతుందని ఏనాడైనా చెప్పినట్టు భారత పౌరులు విన్నట్టు లేదు. ఇంతవరకు ఎన్నికల నిర్వహణలో వైఫల్యాలను మనం చూడలేదు. అలానే, సంక్షేమ పథకాలకు ఎన్నికల కారణంగా ఆయా రాష్ట్రాలలో ఇబ్బంది వచ్చినట్టు ప్రజలనుండి ఎలాంటి ఫిర్యాదులు లేవు. ఒకవేళ అలాంటి సమస్యలు ఉంటే అవి ప్రభుత్వం వైఫల్యం అవుతుంది. కాని, ఎన్నికలు అందుకు కారణం కావు. ప్రజలకు సమయం ఆదా అవుతుందనేది మరో వాదన. రెండు సార్లు వోటు వేసే ప్రజలు ఒకసారి వోటు వేస్తారు. ఈ ఒక్క రోజు ఆదా చేసేసినంత మాత్రాన ప్రజలకు ఒనగూడే ప్రయోజనం ఏమీ ఉండదు. ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు దేశమంతా జరిగి, ఆ తర్వాత ఎలాంటి సమస్య వచ్చినా సరే మరలా ఐదు సంవత్సరాల వరకు ఎన్నికలు నిర్వహించని పరిస్థితి ఉన్నప్పుడు వినడానికి బాగానే ఉంటుంది. కానీ ప్రజాస్వామ్యం మెల్లమెల్లగా ఏకస్వామ్యంలోకి పయనిస్తుంది. లోక్‌సభకు అనుగుణంగా రాష్ట్రాలలోని శాసనసభలు తమకు తాము సర్దుకోవడం అలవాటు చేసుకుంటాయి. ఇలా సర్దుకోవడం పరోక్షంగా ప్రజాస్వామ్యాన్ని బలహీనం చేసి కేంద్రాన్ని బలోపేతంగా మార్చుతుంది. అప్పుడు వీరు కలలుగనే హిందూ రాష్ట్రం ఇంకా ఎంతో దూరంలో ఉండదు. ఎన్నికలు మాటిమాటికి నిర్వహించేటప్పుడు ఏదైనా పాలనాపరమైన ఇబ్బందులు ఎదురైనప్పుడు వాటిని సులభతరం చేయడానికి మారుతున్న కాలంతో పాటు ఎన్నికల పద్ధతులు మరింత ఆధునికీకరణం చేయడానికి ప్రయత్నాలు జరగాలి. అంతేగాని మొత్తం ఎన్నికలన్నిటినీ ఒక దగ్గరే ప్యాకింగ్ చేసే పద్ధతులు ప్రజలకు ఏ విధమైన ప్రయోజనం అందించవు. ఏవైనా ప్రయోజనాలు అందిస్తే బలమైన పార్టీలకూ, స్వేచ్ఛా వాణిజ్యం చేస్తున్న కార్పొరేట్ వర్గానికి మాత్రమే.ప్రజలు కనీస హక్కులు కూడా కోల్పోయే పరిస్థితి ఎంతో దూరంలో లేదు. భారతదేశం అనేది కొన్ని రాష్ట్రాల సమాఖ్యగా ఉంది. ఇక్కడ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉంది. ప్రతి రాష్ట్రానికి కొన్ని రకాలైన ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయి ప్రత్యేక సమస్యలు ఉన్నాయి. ఇతర దేశాల్లాగ ఇక్కడ ఒకటి రెండు పార్టీలు లేవు. కొన్ని వందల పార్టీలు ఉన్నాయి. ఒకే దేశం ఒకే ఎన్నిక అన్నప్పుడు ఈ పార్టీలన్నీ బడా ఎన్నికల వ్యాపారంలో మాయమైపోయి ఏవో ఒకటి, రెండు పార్టీలు మిగిలే పరిస్థితి కూడా భవిష్యత్తులో ఉంటుంది. పెద్ద చేపలు చిన్న చేపల్ని మింగేస్తే, చివరికి పెద్ద చేపలే మిగులుతాయి.

కేశవ్
ఆర్థిక, సామాజిక విశ్లేషకులు
9831314213

క్రాంతి జాడ "గురజాడ"

నవయుగ వైతాళికుడు
ఆధునిక నాటక సామ్రాట్టుడు
తెలుగు భాషా వికాస చరితుడు
అభ్యుదయ కవితా
పితామహుడు
కవిశేఖరుడు గురుజాడ
అప్పారావు
వంద సంవత్సరాల క్రితమే
వ్యవస్థీకృత దురాచారాలపై
దిక్కరించిన కలం యోధుడు
కట్టుబాట్ల కటకటాల్ని తెంచి
స్త్రీజాతికి విముక్తి కల్పించిన
నవయుగ కవి వైతాళికుడు
ఛాందస పాండిత్యాన్ని చీల్చి
అభ్యుదయ సాహిత్యాన్ని
జనపదం చేసిన ధార్మికుడు
దేశమును ప్రేమించుమన్నా
మంచియన్నది..అంటూ
యువతలో స్ఫూర్తి నింపిన
కలియుగ కవి పితామహుడు
కన్యాశుల్కం నాటకంతో
సమాజాన్ని మేలుకొలిపిన
అభినవ నాటక వ్యాసుడు
తెలుగు భాషనే శ్వాసగా
సాహితీ సేద్యమే లక్ష్యంగా
సంఘ సంస్కరణే సమస్తంగా
జీవితమే అర్పించిన చరితుడు
గురజాడ అడుగు జాడలో
అందరం కలిసి నడుద్దాం
తన స్వప్నాల సాకారం చేసి
వికాస సమాజాన్ని స్థాపిద్దాం
తెలుగు భాషా ప్రాశస్త్యాన్ని
ప్రపంచమెల్లెడలా చాటుదాం

(సెప్టెంబర్ 21న గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా...)

కోడిగూటి తిరుపతి
9573929493

ఆగదు నా ప్రయాణం...

కారు మబ్బుల్లో..కమ్ముకున్న చీకట్లలో..
సాగుతోంది నా ప్రయాణం
దారి చూపడానికి చంద్రుడు కూడా లేడు
బహుశా ఈరోజు అమావాస్య నేమో
అయినా ఆగదు నా ప్రయాణం..

నా చుట్టూ భయంకరంగా కమ్ముకున్న చీకట్లు
అయినా నాలో అణుకు లేదు బెణుకు లేదు
చేతిలో ఓ నిప్పు కాగడ పట్టుకొని
ఛాతి నిండా ధైర్యంతో
ముందుకు సాగుతోంది నా ప్రయాణం..

దారిలో మిణుకు మిణుకుమని
ఎగిరే మిణుగురు పురుగులు
సెలయేళ్ల చప్పుళ్లు..పక్షుల కూనీ రాగాలు..
కీటకాల కిట కిట ధ్వనులు
నా ప్రయాణానికి స్వాగతం
పలుకుతున్నట్లుగా ఉన్నాయి.

దారిలో ఎత్తయిన పెద్ద చెట్ల మధ్య
సాగుతోంది నా ప్రయాణం
నా మీద ఏదో పడుతున్నట్లుగా
నన్ను ఎవరో వెంబడిస్తున్నట్లుగా
నా కాళ్ళ చప్పుడు
నన్నే భయపెట్టేంతగా ఉంది
నా శరీరానికి గుచ్చుకున్న ముళ్ళకంపలు
దారి పొడువునా నా ఒంటి నుంచి
కారుతున్న రక్తంతో..సాగుతోంది నా
ప్రయాణం..

దారి మలుపులతో
అలుపు లేని నా కాళ్ళతో
అలసట చెందని నా శరీరంతో.. గెలుపు
కోసం..
విరామమెరుగక ముందుకు సాగుతోంది నా
ప్రయాణం

గుడ్ల గూబల శబ్దాలు..
ఏనుగుల ఘీంకారాలు
సింహాల ఘర్జనలు...
నన్ను భయపెడుతున్నా..
ఆగదు నా ప్రయాణం
గమ్యస్థానం చేరే వరకు.

కోనేటి నరేష్,
8499847863
శ్రీ సత్యసాయి జిల్లా.

నదీజలాలను సక్రమంగా వినియోగించాలి

(సెప్టెంబర్ 21, ప్రపంచ నదుల దినోత్సవం)

కొన్ని దేశాల్లో ఈనాటికీ సరైన త్రాగు నీరు లేదు. సింగపూర్ లాంటి ధనిక దేశాలు నీటికోసం మలేషియా వంటి దేశాలపై ఆధారపడుతున్నాయి. భవిష్యత్తులో నీటిలభ్యత మరింత జటిలంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొన్ని దేశాల్లో అనేక నదులున్నా, నదీజలాల వినియోగంలో చిత్త శుద్ధి లేక నిరుపయోగంగా మారుతున్నాయి. సముద్రాల్లోకి నదీజలాలు వృథాగా పోతున్నాయి.

పెరిగిన జనాభాతో పాటుగా కాలుష్యం కూడా విపరీతంగా పెరిగిపోతున్నది. పెరుగుతున్న పారిశ్రామీకరణ వలన జల వనరులు,జల మార్గాలు కూడా కాలుష్య భరితంగా మారుతున్నాయి.మానవ జీవితంలో నీరు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం.

నదుల ప్రాధాన్యత,నదుల పరిరక్షణ వంటి అంశాలపై కెనడాకు చెందిన నదుల పరిరక్షణ ఉద్యమకారుడు, రచయిత,వక్త మార్క్ ఏంజెలో ఆలోచనలకు అనుగుణంగా ప్రతీ ఏటా సెప్టెంబర్ నాల్గవ ఆదివారం ఐక్యరాజ్య సమితి ప్రపంచ నదుల దినోత్సవం జరపాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమం 2005 వ సంవత్సరం నుండి క్రమ బద్ధంగా జరుగుతున్నది. నీటి వనరుల యొక్క విశిష్టతతో పాటు జల మార్గాలు అభివృద్ధికి చిహ్నాలని చాటి చెప్పడానికి, నదుల సంరక్షణ కోసం ప్రజల బాధ్యతను గుర్తు చేయడానికి,ప్రజల్లో నీటి వనరుల పట్ల అవగాహన కలిగించడానికి ప్రపంచ నదుల దినోత్సవం జరుపుకుంటున్నారు.నదులు జన జీవన నాడులు.నదులు నాగరికతకు చిహ్నం. నదీ పరివాహక ప్రాంతాల్లోనే నాగరికత పరిఢవిల్లినట్లు, అభివృద్ధి జరిగినట్టు తేటతెల్లమవుతున్నది.

నదుల గురించి అవగాహన కలిగించడం,నదుల్లో పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టి జీవవైవిధ్యాన్ని కాపాడడం వంటి అనేక చర్యల ద్వారా జనజీవితాలకు,ఇతర జీవరాశులకు మేలు చేయడం కోసం బృహత్తర కార్యచరణతో ముందుకు సాగడం, నదుల పరిరక్షణ పట్ల అవగాహన కలిగించడం ప్రపంచ నదుల దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం.ప్రపంచంలో ఎన్నో నదులున్నాయి.నైలు నది,మిసిసిపి,హెూయాంగ్ హెూ,అమెజాన్,కాంగోలు ప్రపంచంలో ప్రఖ్యాత నదులు.ప్రపంచంలో పొడవైన నది నైలునది,రెండవది అమెజాన్. ప్రపంచంలో మూడవ పొడవైన,ఆసియాలో మొదటి పొడవైన నది యాంగ్జీ.ఈజిప్టులో అధికశాతం ప్రజలు నైలునదీ పరివాహక ప్రాంతాల్లో జీవిస్తారు. నైలునదిని "ఈజిప్టు వరప్రసాదం" గా పిలుస్తారు."ఫాదర్ ఆఫ్ ఆఫ్రికన్ రివర్స్"గా పిలవబడే నైలునది 10 దేశాల గుండా ప్రవహిస్తుంది. చైనా దుఃఖదాయని గా హెూయాంగ్ హెూ నది (ఎల్లోనది) పిలవబడుతున్నది. మిస్సోరి,మిసిసిపి,యూకోన్ నదులు అమెరికాలో పొడవైన నదులు. ఓల్గా, నేవా,ఓబ్ నదులు రష్యాలో ప్రముఖ నదులు. ప్రపంచంలో ఒక్క నదికూడా లేని దేశం సౌదీ అరేబియా,ఖతార్ లో కూడా నదులు లేవు.భారత దేశం నదులకు పుట్టినిల్లు. 250 మిలియన్ల హెక్టార్ల ఆయకట్టు 10 కి పైగా ప్రధాన నదులకు చెందుతుంది.భారత దేశ నదీ వ్యవస్థ త్రాగునీటికి, సాగునీటికి,విద్యుత్, రవాణాకు అనుకూల మైనది.భారత దేశంలో గంగ, సింధు,గోదావరి,కృష్ణానదులు ప్రసిద్ధి చెందినవి.సింధునది అత్యంత పొడవైన నదిగా పేరొందినా, ఈ నదీ ప్రవాహం ఎక్కువగా పాకిస్తాన్ లో ఉంది. భారత దేశంలో గంగానది ఎక్కువ పరిధిని కలిగి ఉంది.పాక్ జీవనాడి సింధు నది.సింధునది వలన పాకిస్తాన్ సశ్యశ్యామలంగా మనగలుగుతున్నది. పాక్ ప్రజల త్రాగు నీటికి,సాగునీటికి,విద్యుత్ అవసరాలకు సింధు నది ఆయువు పట్టు.సంవత్సవం పొడవునా ప్రవహించే నదులను జీవనదులు లేదా శాశ్వత నదులుఅంటారు. గంగ, యమున, తపతి, బ్రహ్మపుత్ర, నర్మద తదితర నదులన్నీ జీవనదులు.ఏ సముద్రం లోను కలవని నదిగా రాజస్థాన్ లోని లూనీ,బనాస్,రోపెన్ నదులు సముద్రంలో కలవని నదులుగా పేరుగాంచాయి. ఈ నదుల లోని నీరు ఇసుకలోనే ఇంకి పోతుంది.

"నదీనాం సాగరో గతిః" అనేది వాస్తవం. అయితే అది గతం. విజ్ఞానం వికసించని రోజుల్లో నదులకు ఆనకట్టలు కట్టి,నీటిని రక్షించడం కష్టతరంగా ఉండేది. ఆర్థర్ కాటన్,మోక్షగుండం విశ్వేశ్వరయ్య వంటి ఎంతో మంది మహనీయులు నీటి ప్రాజెక్టుల విషయంలో ఎంతగానో శ్రమించి లక్షలాది ఎకరాల భూమిని సశ్యశ్యామలం చేశారు. అయితే అప్పటి మేథావుల కృషి,పట్టుదల వర్తమానంలో కానరావడం లేదు. అప్పటి కంటే ఇప్పుడు సాంకేతికంగా ప్రపంచం ఎంతో ముందంజలో ఉంది.అయినా ప్రతీ చోట జలవివాదాలు తలెత్తుతున్నాయి.అపారమైన జలసంపద కడలి పాలౌతున్నది. పంటలకు,త్రాగునీటి అవసరాలకు వినియోగించవలసిన జలరాశులను సముద్రాల పాలు చేయడం బాధాకరం.మానవ విజ్ఞానం స్వార్థంతో పెనవేసుకుని నదులను,జలరాశులను పూర్తి వినియోగం లోకి తీసుకు రావడంలో అడ్డుపడుతున్నది. ఒక వైపు త్రాగడానికి గుక్కెడు నీరైనా లేని ప్రాంతాలెన్నో ఉన్నాయి. బంగరు భూములన్నీ నీరు లేక నెరలు తీస్తున్నాయి. కరువు ప్రాంతాలుగా కటిక దరిద్రంలో కొట్టుమిట్టాడుతున్న ప్రాంతాల ప్రజల జీవన దైన్య స్థితి ఒకవైపు, మరో వైపు అతి వృష్టితో అపారమైన జలవనరులు వృథాగా పోతున్నాయి.ఇజ్రాయెల్, సైప్రస్,స్పెయిన్ ఇటలీ,ఒమన్,సౌదీ అరేబియా వంటి 100 దేశాలకు పైగా "డిశాలినేషన్" ప్రక్రియను విజయవంతంగా అమలు చేస్తున్నాయి.సముద్ర జలాలనుండి ఉప్పు నీటిని వేరు చేసి, మంచి నీటిగా మార్చే "నిర్లవణీకరణ" ప్రక్రియను విస్తృతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. డిసాలినేషన్ ప్లాంట్ల నిర్వహణా వ్యయం కూడా అధికం. అందుచేత ప్రస్తుతానికి భూమిపై నీటి నిల్వలను ముఖ్యంగా నదుల్లోని నీటిని సంరక్షించి,సాగు నీటికి,త్రాగునీటికి వినియోగించాలి.ఈ సకల చరాచర జగత్తులో జీవకోటి మనుగడకు అతిముఖ్యమైన ప్రాణాధారం 'నీరు'. నీరు లేనిదే జీవరాశి మనుగడ దుర్లభం. అలాంటి నీటివనరులను తరిగి పోకుండా చూడడమే కాకుండా నేటి కలుషిత వాతావరణంలో మనకందరికీ పరిశుభ్రమైన నీరు విధిగా అందించవలసిన బాధ్యత ప్రపంచ సమాజంపై ఎంతైనా ఉంది. కలుషిత నీటి స్థానంలో స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలి. కలుషిత నీటివల్ల రోగాల బారిన పడుతున్న ప్రజలను రక్షించవలసిన గురుతరమైన బాధ్యత ప్రపంచ ఆరోగ్యసంస్థపైన, ప్రభుత్వాల పైన ఎంతైనా ఉంది. ఈనాటికీ ప్రపంచ జనాభాలో అత్యధిక శాతం మందికి స్వచ్ఛమైన త్రాగునీరు అందడం లేదు. ఇక ఇతర అవసరాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.ప్రతీ మనిషికీ త్రాగడానికి, ఇతర అవసరాలకు సరిపడా కనీస నీటిని కూడా మనం అందించలేకపోతున్నాం. దాని ఫలితమే ఈ నీటికారక వ్యాధుల విజృంభణ. మరో దశాబ్దం నాటికి నీటి అవసరాలు మరింత పెరుగుతాయి.మనకు నదులు, సరస్సుల రూపంలో నీటి వనరుల లభ్యత ఉంది. కాని అనేక రకాల కారణాల వల్ల మనం నీటివనరులను సరిగ్గా వినియోగించుకోలేక పోతున్నాం. నీరంతా వృథాగా సముద్రం పాలవుతుండడం బాధాకరం. సరైన అవగాహన, చైతన్యం లేకపోవడమే దీనికంతటికీ ముఖ్య కారణం. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడమే కాకుండా సమీప భవిష్యత్తులో అందరికీ పరిశుభ్రమైన మంచినీటిని అందించి ప్రజలను రోగాల బారిన పడకుండా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించే దిశగా మన అడుగులు ముందుకు పడాలి.

ప్రజల త్రాగునీటి అవసరాలను సాకుగా తీసుకుని కొంతమంది రక్షిత మంచినీటి సరఫరాను పెద్ద వ్యాపారంగా మార్చేస్తున్నారు. ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా పుంఖానుపుంఖాలుగా, పుట్టగొడుగుల్లా వ్యాపిస్తున్న రక్షితనీటి సరఫరా విభాగాలపై ప్రభుత్వాలు కొరడా ఝుళిపించాలి.శుద్ధ జలాల సరఫరా ప్రమాణాల ప్రకారం సక్రమంగా జరుగుతుందా లేదా పర్యవేక్షించేందుకు తగిన యంత్రాంగం నెలకొల్పాలి.

జీవకోటి మనుగడ నీటిపైనే ఆధారపడి వుంది కనుక ఇలాంటి ప్రాణాధారమైన నీటిని కలుషితం కాకుండా కాపాడుకోవాలి. విషరసాయనాలు, ఇతర కలుషిత పదార్థాలు నీటిలో కలవకుండా తగు జాగ్రత్తలు తీసుకుని మానవాళి మనుగడను పదికాలాల పాటు భద్రంగా కాపాడుకోవలసిన తరుణం ఆసన్నమైంది. ప్రజల్లో పరిశుభ్రమైన నీటి వినియోగంపై అవగావన కలిగించడానికి శిక్షణా శిబిరాలు నిర్వహించాలి.ప్రజల్లో చైతన్యంకలిగించాలి.నీటిప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యం తగదు. నదుల్లో ఏర్పడుతున్న కాలుష్యాన్ని అరికట్టాలి. ప్రపంచ నదుల పరిరక్షణకు పటిష్ఠమైన అంతర్జాతీయ కార్యాచరణ ప్రణాళిక అవసరం. నదీజలాల్లోకి ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తూసుకోవాలి.నదులను కాలుష్య రహితంగా మార్చాలి.

- సుంకవల్లి సత్తిరాజు.
(సామాజిక విశ్లేషకులు,మోటివేషనల్ స్పీకర్)
మొ: 9704903463
చిరునామా:
**సుంకవల్లి సత్తిరాజు

ఆరోగ్య మంత్రి ఇలాకాలో అధ్వానంగా ఆరోగ్య సేవలు

- ప్రభుత్వ ఆసుపత్రిలో అందని ద్రాక్షగా ఆరోగ్యం
- ఇష్టా రీతిగా వైద్యుల విధులు

న్యాల్ కల్, సెప్టెంబర్ 22, (జనం సాక్షి) :

ఆరోగ్య మంత్రి డాక్టర్ దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి మెదక్, సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, మిర్జాపూర్ (బి) లోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీ హెచ్ సీ) ప్రభుత్వ ఆసుపత్రి అది. ఓ వైపు ప్రభుత్వం, మరో వైపు జిల్లా అధికార యంత్రాంగం.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు కొనసాగించాల్సిందే..? ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్న.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రం పేదలకు ఆరోగ్యం అందని ద్రాక్షగా మారుతోంది. జిల్లా వైద్యాధికారుల అలసత్వంతో ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారుల సిబ్బంది ఇష్టారీతిగా విధులు నిర్వహించడంతో రోగులకు అనునిత్యం అవస్థలు తప్పడం లేదు.

వైద్య సిబ్బంది ఫుల్.. సేవలు మాత్రం నిల్..!

న్యాల్ కల్ మండలం, మిర్జాపూర్ (బి) గ్రామంలో 24 గంటల పాటు సేవలు అందించేందుకు సామాజిక ఆరోగ్య కేంద్రం (కమ్యూనిటీ హెల్త్ సెంటర్, సీ హెచ్ సీ)ను ఏర్పాటు చేశారు. ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ ప్రియాంక, మరో ముగ్గురు వైద్యాధికారులతో పాటు 17 గురు సిబ్బంది ఆసుపత్రిలో సేవలందించేందుకు అందుబాటులో లేక పోవడంతో ఈనెల 22న, ఆదివారం కేవలం ఒక స్టాఫ్ నర్స్ మాత్రమే రోగులకు సేవలందించే పరిస్థితి నెలకొంది. 12 గంటల పాటు సేవలందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరూ వైద్యాధికారులతో పాటు మరో 18 గురు సిబ్బందిలో ఒక్కరు అందుబాటులో లేకపోవడంతో సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్స్, తాత్కాలికంగా వాచ్మెన్ విధులు నిర్వహిస్తున్న యువకుడు రాజు రోగులకు సేవలు అందించారు.

మహిళా రైతు మృతి..!

శనివారం సాయంత్రం మండలంలోని న్యామతాబాద్ గ్రామానికి చెందిన మహిళా రైతు బూచనేల్లి నాగమ్మ (41) వ్యవసాయ పొలం నుండి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో పిడుగు పాటుకు గురైంది. స్థానికులు మహిళను మిర్జాపూర్ (బి) ఆసుపత్రికి తీసుకురాగా అందుబాటులో వైద్యాధికారులు లేకపోవడంతో జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు వెళుతుండగా నారింజ ప్రాజెక్టు వద్ద ప్రధాన రోడ్డుపై భారీ వృక్షాలు కూలిపోవడంతో గంటల తరబడి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మరో మార్గం లేక పిడుగుపాటుకు గురైన మహిళను బీదర్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆదివారం మధ్యాహ్నం తాజాగా మండలంలోని ఖలీల్ పుర్ గ్రామానికి చెందిన యువకుడు స్వామిదాస్ తీవ్ర అస్వస్థతో ఆసుపత్రికి తరలించగా వైద్యాధికారులు ఒక్కరూ లేకపోవడంతో స్టాఫ్ నర్స్, వాచ్మెన్ చికిత్సలు చేశారు. ఇదే తరుణంలో గంగ్వార్ గ్రామానికి చెందిన అంజన్న ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై పడి గాయపడడంతో ఆసుపత్రికి తరలించారు. అటు సామాజిక ఆరోగ్య కేంద్రం, ఇటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్, ఓ తాత్కాలిక యువకుడు రోగులకు సేవలందించారు. రూ: కోట్లు వెచ్చించి ఆసుపత్రి నిర్మాణం చేపట్టిన స్థానికంగా సిబ్బంది లేకపోవడంతో తరచుగా ఆసుపత్రిలో ఇలాంటి దుస్థితి ఏర్పడిందని స్థానిక యువకులు అధికారుల తీరుపై ఆసహనం వ్యక్తం చేశారు.

ఫతుల్లాగూడ చెరువును సమగ్ర సర్వే చేయండి

ఎల్బీనగర్, సెప్టెంబర్ 22 (జనం సాక్షి)

ఉప్పల్ మండలం నాగోల్ పరిధి ఫతుల్లాగూడ చెరువు అబ్దుల్లాపూర్మెట్ మండలం తట్టి అన్నారం సర్వే నంబర్ 125లోని ప్లాట్లు ఫతుల్లా గూడ చెరువు ఎఫ్‌టిఎల్ పరిధికి సంబంధం లేదని ప్లాట్ల బాధితులు తెలిపారు. సదరు సర్వే నంబర్లోని 36ప్లాట్స్‌కు ఫతుల్లాగూడ చెరువు 25 ఎఫ్ టీఎల్ పరిధిలోకి వస్తాయని హైడ్రాకు కొంతమంది తప్పుడు సమాచారం ఇచ్చారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ప్లాట్ల బాధితులు మీడియాతో మాట్లాడారు. ఉప్పల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 36లో ఫతుల్లాగూడ చెరువు ఉంటుందని, దాని పక్కనే అబ్దుల్లాపూర్ మెట్ మండలం తట్టిఅన్నారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 125 ఉంటుందన్నారు. అయితే, 30 ఏళ్ల కిందటే సుమారు 1 ఎకరాల 36 గుంటల్లో తామంతా ప్లాట్లు కోనుగోలు చేశామని తెలిపారు. ఫతుల్లాగూడకు చెందిన కొందరు కావాలనే అబ్దుల్లాపూర్మెట్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ ప్లాట్లు కూడా చెరువు ఎఫ్టీఎల్ పరిధిలోని వస్తాయని తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. అధికారులు ఇచ్చిన రిపోర్టును చూపిస్తున్న ప్లాట్ల యజమానులు వాపోతున్నారు.ఇది ముమ్మాటికీ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్య పూరిత దోరణితో తప్పుడు ప్రచారం జరుగుతోందని ఇప్పటికైన అధికారులు మా గోడు విని చెరువు సమగ్ర సర్వే చేయించాలని అధికారులను కోరారు. ఫతుల్లాగూడ చెరువు పరిధిలోకి 125 సర్వే నంబర్ రాదని అబ్దుల్లాపూర్మెట్ రెవెన్యూ అధికారులు స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. హైడ్రా అధికారులు సమగ్రంగా సర్వే నిర్వహించి ఏదైనా నిర్ణయం తీసుకోవాలని కోరారు. తప్పుడు ఫిర్యాదులను నమ్మవద్దని తెలిపారు. తమ పిల్లల భవిష్యత్ కోసం 30 ఏళ్ల క్రితం ప్లాట్లను కొనుగోలు చేశామని ఆవేదన దన వ్యక్తం చేశారు. మరో సారి సర్వే నిర్వహించిన 30 కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

కీమ్స్ సన్ షైన్ ఆసుపత్రి వైద్యులు విమలాకర్ రెడ్డి

చేవెళ్ల,సెప్టెంబర్ 22 (జనంసాక్షి)

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతోనే వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు కీమ్స్ సన్ షైన్ ఆసుపత్రి వైద్యులు విమలాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని దేవునిఎర్రవల్లి గ్రామ శివారులోని ఎస్ఎల్ వి ఫంక్షన్ హాల్లో టీం విమలకర్ ఫౌండేషన్ వారు కీమ్స్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీర్ణ వ్యవస్థ, క్యాన్సర్ స్క్రీనింగ్, అల్ట్రాసౌండ్, ఎండోస్కోపీ, లివర్ ఫంక్షన్ టెస్ట్, సిబిపి, లిపిడ్ ప్రొఫైల్, హెపటైటిస్ బి అండ్ సి, వైరల్ స్క్రీనింగ్, ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు జీర్ణ వ్యవస్థకు సంబంధించిన 300 పైగా వ్యక్తులకు వివిధ రకాల పరీక్షలు



నిర్వహించి దానికి తగ్గట్టుగా మందులు మరియు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు విమలాకర్ రెడ్డి మాట్లాడుతూ....ప్రతి ఒక్కరూ తమ ఆహారపు అలవాట్లు జీవన శైలిలో మార్పులు చేసుకుని తరచుగా స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవడం వలన క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చని అన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందని అన్నారు. చాలా మందికి వారి ఆరోగ్యం ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుకు సహకరించిన వాలంటరిస్ ను ఆయన అభినందించారు. గ్రామాలలో ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉచిత వైద్య శిబిరం తమ మండలంలో ఏర్పాటు చేసినందుకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దినేష్ రెడ్డి, రోహన్ రెడ్డి, గౌరంగ్, మహేష్ సిబ్బంది, మరియు చింపుల బుచ్చి రెడ్డి, పైండ్ల వెంకట్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమీన్పూర్‌లో హైడ్రా కూల్చివేతలు

అమీన్పూర్ సెప్టెంబర్ 22 (జనంసాక్షి)

అమీన్పూర్ మండల పరిధిలో హైడ్రా కూల్చివేతల పరంపర కొనసాగుతుంది. ఆదివారం ఉదయం మండలంలోని పటేల్ గూడా, కిష్టారెడ్డిపేటలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. పటేల్గూడ ప్రభుత్వ సర్వేనెంబర్ 12లో నూతనంగా నిర్మించిన సుమారు 20 ఇళ్ళను కూల్చివేశారు. కిష్టారెడ్డిపేట గ్రామంలోని సర్వే నంబర్ 164 లో అక్రమంగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలను అధికారులు కూల్చివేశారు. ఈ కూల్చివేతల్లో ఎలాంటి దుర్ఘటనలు చోటు చేసుకోకుండా

ముందస్తుగానే భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానికంగా ఎవరైనా అడ్డు చెబితే వారిని అదుపులోకి తీసుకొని కూల్చివేతల కొనసాగించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేస్తే ఎంతటి వారని అయినా వదిలిపెట్టే ప్రసక్తి లేదని తాసిల్దారు రాధా హెచ్చరించారు. మండల పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు నిరంతరంగా కొనసాగుతాయని ఆమె తెలిపారు. ఈ కూల్చివేతల కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, రెవెన్యూ, మున్సిపల్ , హైడ్రా సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ వసతిగృహాల విద్యార్థుల గోస పట్టదా

ఉప్పునుంతల్లో శిథిలావస్థకు చేరుకున్న బీసీ వసతి గృహం

ధర్మ సమాజ్ వాద్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీధర్ మహారాజ్

ఉప్పునుంతల (జనం సాక్షి):

బీసీ వసతి గృహంలో నివసిస్తున్న విద్యార్థుల గోసా ప్రభుత్వానికి పట్టదా అని ధర్మ సమాజ్వాద్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీధర్ మహారాజు అన్నారు. మండల కేంద్రంలోని ఉప్పునుంతల ప్రభుత్వ బీసీ బాయ్స్ హాస్టల్ ను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంను పరిశీలించడం జరిగిందని హాస్టల్ పూర్తిగా శిధిలావస్థలో చేరుకున్నది, కంపౌన్డ్ లేక పాములు వచ్చి విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రాణ భయం గడుపుతున్నారాని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ లో విద్యార్తులు చదువు కోవాలి అంటే ఆ విద్యార్తులకి చక్కటి నివాస గృహాలు, పౌష్టిక ఆహారాన్ని అందించాలి కానీ.. ఈ ప్రభుత్వాలకి బీసీ,ఎస్సీ,ఎస్టీ హాస్టల్స్ అంటేనే చిన్నచూపు ఎందుకంటె ఈ ప్రభుత్వా హాస్టల్స్‌లో వారి పిల్లలు ఉండరు కాబట్టి. అందుకే ధర్మ సమాజ్ పార్టీ ఒక్కటే హెచ్చరిస్తున్నాం మా పేద బీసీ,ఎస్సీ,ఎస్టీ ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వెంటనే వసతి గృహ నిర్మాణ పనులు చేపట్టి మా పిల్లల బంగారు భవిషత్ కాపాడాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్ విద్యని ప్రోత్సహిస్తూ పేదలు చదివే హాస్టల్స్ క్రమ క్రమంగా నీరుగరుస్తూ పేద పిల్లలని విద్యకి దూరం చేస్తున్నరన్నారు. ఈ సమస్యన్ని సంబధిత అధికారులకు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పునుంతల మండల నాయకులు పరమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

తాడిబోయిన రామస్వామి యాదవ్

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :

మారుతున్న కాలానుగును పరిస్థితులకు అనుకూలంగా తమ ఆహారపు అలవాట్లను మార్చుకోవడం ద్వారా వ్యక్తిగతంగా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు. ఈ మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్ పరిధి దీప్తి శ్రీనగర్ పార్కులో గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన ఒమేగా హాస్పిటల్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఆదివారం ఉదయం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై తన చేతుల మీదుగా ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. వైద్య శిబిరంలో ప్రధానంగా ఎత్తు, బరువు, రక్తపోటు, ఈసిజి, షుగర్, పల్స్, నేత్ర, 2డి ఎకో, ఈసిజి పరీక్షలతోపాటు మహిళలకు ఫ్యాప్సిమియర్, మోమోగ్రఫి తదితర క్యాన్సర్ సంబంధ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారిన జీవనశైలితో పర్యావరణంలో వస్తున్న అనేక మార్పులవల్ల మానవులు అనేక

వ్యాధులకు గురవుతున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం కావున కొన్ని జాగ్రత్తలు పాటిస్తూ ఆధునిక యుగంలో ఆరోగ్య పరిరక్షణకై ముందుకు సాగితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ప్రతిఒక్కరు నిత్యవ్యాయామం, మెడిటేషన్, యోగ, ధ్యానము, నడక, కనీసం 40 నిమిషాలు చేయాలని, సాధ్యమైనంత వరకు తాజా ఆకుకూరలు, సీజనల్ ఫ్రూట్స్, పాలు, పాలఉత్పత్తులు, చేపలు, గ్రుడ్లు, తృణధాన్యాలు, డ్రై ఫ్రూట్స్ వంటి పౌష్టికాహారం తీసుకొని, ఆరోగ్యం కాపాడుకోవాలని తెలిపారు. సాధ్యమైనంత మేరకు ఆల్కహాల్, పొగాకు, పొగాకు ఉత్పత్తులు, ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని సమగ్రంగా పరిరక్షించుకోవాలని తెలిపారు. ఆరోగ్య విషయంలో ఏమాత్రం తేడా అనిపించినా ఏమరపాటుగా ఉండకుండా వెంటనే వైద్యులను సంప్రదించి, వారి సూచనలు, సలహాలు పాటించి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని సూచించారు. మనం తీసుకొనే ఆహారం విషయంలో సమయపాలన పాటించాలని తెలిపారు. 30 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళ కూడా రెండు సంవత్సరాలకు ఒకసారి ఫ్యాప్సిమియర్, మోమోగ్రఫి వంటి క్యాన్సర్ సంబంధిత పరీక్షలను చేయించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో దీప్తి శ్రీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సీతారామయ్య, సుమన్ రెడ్డి, మంగపతి, సురేష్, శేఖర్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జనార్దన్, వాణి సాంబశివరావు, అమయ్య చౌదరి, మల్లేశ్వరి, నూతక్కి పూర్ణచంద్రరావు, హాస్పిటల్ ప్రతినిధులు అనురాగ్, వెంకటేష్, కౌండిన్య శ్రీ, నండూరి వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు 175 మంది రోగులు పాల్గొని చికిత్సలు అందుకున్నారు.

శివాలయం నిర్మాణానికి రూ.1.20 లక్షలు విరాళం

కుల్కచర్ల,సెప్టెంబర్ 22(జనం సాక్షి):

కుల్కచర్ల మండల కేంద్రంలో నూతన శివాలయం నిర్మాణం కోసం వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బొలసని భీంరెడ్డి దంపతులు రూ. 1.20 లక్షలు చెక్కు ద్వారా విరాళంగా ఆలయం కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా భీంరెడ్డి మాట్లాడుతూ..భక్తి భావం ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు.గ్రామ అభివృద్ధి కోసం నా వంతు సాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని చెప్పారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భీంరెడ్డి దంపతులను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చెలిమిళ్ల ఆనందం, ఉడికే మంతయ్య,కాశీనాధం, వీరసేవ సంఘం అధ్యక్షులు ఉడికే ప్రకాష్, ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్, సభ్యులు పూజారి మణి, వినోద్ కుమార్, ఈశ్వరయ్య, పంతుల శివ, భోగం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

గోమతిని సన్మానించిన మాజీ మంత్రి

వనపర్తి,సెప్టెంబర్22(జనంసాక్షి):

వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని నాగవరంకు చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సాయిలీల శ్రీను కూతురు గోమతి గారు ఇటీవల జరిగిన అల్ ఇండియా ఎన్‌సిసి మ్యాప్ రీడింగ్ నందు సెకండ్ ర్యాంక్ సాధించి సిల్వర్ మెడల్ సాధించినందున మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదివారం ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు తమకు నచ్చిన అంశాల ను విద్యార్థులు అభ్యసించాలని కోరారు .ఎన్ సీసీలో ప్రవేశించి సామాజిక సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్ , నందిమల్ల అశోక్, రఘువర్ధన్ రెడ్డి, ప్రేమ్ నాథ్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గౌడ నాయక్ ,పరంజ్యోతి, ఇమ్రాన్, సయ్యద్ జమీల్, సూర్యవంశం గిరి, జోహాబ్, ఆరిఫ్, సునీల్ వాల్మీకి, చిట్యాల రాము, కార్తీక్ తోటశీను తదితరులు పాల్గొన్నారు.

నరేంద్ర మోడీతోనే దేశ అభివృద్ధి..!

జోరుగా కొనసాగుతున్న భాజపా సభ్యత్వ నమోదు

బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి

వనపర్తి బ్యూరో సెప్టెంబర్ 22 (జనంసాక్షి)

భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తోనే దేశం అభివృద్ధి చెందుతుందని వనపర్తి జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. వనపర్తి మండల పరిధిలోని సవాయిగూడెం గ్రామంలో ఆదివారం గ్రామ బూత్ అధ్యక్షులు గువ్వల శివ ,ఎస్ విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉపాధ్యక్షులు రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కల రామన్ గౌడు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరే విధంగా కృషి చేస్తున్నారని,గత పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు

మోడీ వైపు ఉన్నారని అందుకు నిదర్శనం అవినీతి రహిత పరిపాలన అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతు న్నారని, దేశ ప్రజలు ఆయనను మూడోసారి ప్రధానమంత్రిగా ఆశీర్వదించారని తెలిపారు. నేడు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా నిలబడిందని అందుకు కారణం నిక్కసైన నిజాయితీపరుడైన ప్రధానమంత్రినని గుర్తు చేశారు, ప్రపంచ దేశాలు సైతం భారత్ వైపు చూస్తున్నాయని మోదీ ప్రజలకు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలే అందుకు నిదర్శనమని అన్నారు. భారత ప్రజల కోసం నిత్యం తపించే ప్రధానమంత్రి దొరకడం ప్రజల అదృష్టంగా భావించాలని వివరించారు. గ్రామంలో ప్రజలు పూర్తి విశ్వాసంతో సభ్యత్వం చేస్తూ స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని, ఉచిత బియ్యం కిసాన్ సన్మానిది రైతులకు ఫర్టిలైజర్ గ్రామాల్లో సిసి రోడ్లు ట్రైన్లు లైట్లు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే చేపడుతున్నారని తెలిపారు. బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కొత్త మధు సింహారెడ్డి, చింతకుంట ప్రశాంత్, మహేష్, వెంకట్ రెడ్డి దాసర్ల మహేష్ దాసరి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
23 సెప్టెంబర్ 2024

ఎట్టకేలకు కొత్తకార్డుల జారీకి శ్రీకారం

- ప్రజాపాలన దరఖాస్తులు పనికిరావా..!
- దరఖాస్తులతోనే సరి పెడతారా.?

వనపర్తి,సెప్టెంబర్22(జనంసాక్షి):

రేషన్ కార్డు ఆశావాహులకు తెలంగాణ సర్కార్ తీపి కబురు చెప్పింది. అక్టోబర్ 2వ తేదీ నుంచి నుంచి కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించాలని తాజాగా కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. దీంతో కొత్త రేషన్ కార్డుల కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పేద కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. కాని అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త రేషన్ కార్డులిస్తామని ప్రజాపాలన సభల్లో దరఖాస్తులు తీసుకొని 9 నెలల పాటు వాటిని ప్రభుత్వం పరిశీలించ లేదు. అందుకే ఈ సారి కూడా ఎన్ని అవాంతరాలు ఏర్పడుతాయో, ఇంకెంత కాలం జాప్య చేస్తారో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి . పేదల అవసరాలైన కూడు, గూడు, గుడ్డ సమకూర్చాల్సిన రాజ్యాంగపరమైన బాధ్యత అయినా, తమకు ఓట్లను రాల్చే తాయిలాలను ఆశ చూపి గద్దె నెక్కడానికి అన్ని పార్టీలు కుయుక్తులు పన్నడం పరిపాటిగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల లబ్ది కోసమే కోసమే మళ్ళీ కొత్త రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం శ్రీకారం చుడుతున్నదని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

కొత్త రేషన్ కార్డుల అర్హతపై సస్పెన్స్

తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. కుటుంబాల నుంచి వేరు పడిన వారు, పెళ్లిళ్లు చేసుకున్నవారు కొత్త రేషన్ కార్డుల కోసం ఆశగా చూస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరించాలని శుక్రవారం సమావేశమైన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంది.అయితే కొత్త రేషన్ కార్డుల అర్హతపై సస్పెన్స్ కొనసాగుతోంది. కార్డుల జారీకి లబ్ధిదారుల ఆదాయ పరిమితి, అర్హతలపై నిబంధనలను పున:సమీక్షిస్తామని చెప్పడంతో ప్రజల్లో సందేహాలు నెలకొన్నాయి. బియ్యం అవసరం లేని వారికి స్మార్ట్ హెల్త్ కార్డులు ఇస్తామని చెప్పడంపైనా అనుమానాలున్నాయి. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులకు వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50లక్షల్లోపు, పట్టణాల్లో రూ. 2లక్షల్లోపు ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.అలాగే 3.5 ఎకరాలలోపు తరి, 7.5 ఎకరాలలోపు మెట్ట భూమి ఉన్నవారికి మాత్రమే ఇవ్వనున్నట్లు తెలిసింది.

కొత్త రేషన్ కార్డులకు కొర్రీలెన్నో..!

గత కొంత కాలంగా ఊరిస్తూ వచ్చిన కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఎంత కాలం పడుతుందో అన్న సందేహాలు వ్యక్తం చేస్తున్నారు దరఖాస్తు దారులు. ప్రజా పాలన సందర్భంగా కార్డుల కోసం అన్ని వివరాలు ఇచ్చినప్పటికీ మళ్ళీ ఎందుకు అర్జీలు అడుగుతున్నారో తెలియడం లేదని, ఇప్పటికే ఆన్ లైన్ లో వివరాలు ఉన్నందున ఈ పాటికే వాటిని పరిశీలించి అర్హుల జాబితా సిద్ధం చేసి కొత్త కార్డులు ఇవ్వాల్సింది. కాని విధి విధానాలు ఖరారు చేస్తామని చెప్పడంతో ఆ మేరకు దరఖాస్తు చేసుకోవాలని నిర్ణయిస్తే తిరిగి ఎన్ని వ్యయ ప్రయాసలకు గురి కావాల్సి వస్తుందో నని ఆందోళన వ్యక్తం అవుతున్నది. ఆదాయ ధృవ పత్రాల కోసం ఎమ్మార్వో కార్యాలయాలు, రెవిన్యూ సిబ్బంది చుట్టూ తిరగాల్సి వస్తుందని వాపోతున్నారు.గతంలో ఉమ్మడి కుటుంబం కార్డుల్లో పేర్లున్న వారిలో చాలా మందికి వివాహాలై పిల్లలు కూడా ఉన్నారు. మరి అలాంటి వారికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు పాత, కొత్త కార్డు దరఖాస్తుదారులతో పాటు పాత కార్డులున్న వారు కూడా మార్పులు, చేర్పులు చేసుకోనున్నందున గ్రామాల్లో జనజాతరలా సందడి నెలకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

సవాలక్ష సందేహాలు

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఇందుకు సంబంధించి అనేక సందేహాలపై స్పష్టత ఇవ్వలేదు. దరఖాస్తులు తీసుకోవాలన్న ప్రభుత్వ ప్రకటనపై ప్రజలు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తులకు చివరి గడువుపై ఎలాంటి స్పష్టత లేదు. దరఖాస్తు ఎక్కడ, ఎలా చేయాలి? అనే అంశంపై కూడా సరైన విధి విధానాలు లేవు. మీ-సేవలో చేసుకోవాలా..? లేక ప్రజాపాలన మాదిరిగా దరఖాస్తులు స్వీకరిస్తారా..? దరఖాస్తు ఎవరు చేసుకోవాలి, డిజిటల్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో ఇప్పటికే రేషన్‌కార్డులు ఉన్నవాళ్లు కూడా దరఖాస్తు చేసుకోవాలా..? లేక రేషన్‌కార్డు లేనివాళ్లు మాత్రమే దరఖాస్తు చేయాలా..? ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వాళ్లు మళ్లీ దరఖాస్తు చేయాలా..? అవసరం లేదా..? అనే దానిపై క్లారిటీ లేదు.

ముఖ్యమంత్రి సహాయ నిధికి కోటి విరాళం..!

గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్

పటాన్చెరువు సెప్టెంబర్22(జనంసాక్షి)

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు, విశాఖపట్నం పార్లమెంటు (లోక్ సభ) సభ్యుడు శ్రీభరత్ మతుకుమిల్లి తెలంగాణ వరద సహాయక చర్యలకు మద్దతుగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)కి ఆదివారం కోటి రూపాయల చెక్కును అందజేశారు. గీతం ఉద్యోగుల ఒకరోజు వేతనాన్ని, తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి ని ఆయన జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి ఈ చెక్కును స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీభరత్ పాటు పూర్వ ఐఏఎస్ అధికారి-గీతం ముఖ్య పరిపాలనాధికారి (సీఏవో) బీ.ఆర్, మీనా, గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ డీన్ సయ్యద్ అక్బరుద్దీన్, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ తదితరులున్నారు.కొద్ది రోజుల క్రితం, ఆంధ్రప్రదేశ్ లోని వరద బాధితుల సహాయక చర్యలకు మద్దతుగా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడును స్వయంగా కలిసి కోటి రూపాయల చెక్కును విరాళంగా అందజేసిన విషయం విదితమే.సామాజిక బాధ్యత, మానవతా సాయం పట్ల తను అంకితభావాన్ని ప్రతిబింబిస్తూ, క్లిష్టమైన సమయాలలో సహాయ చర్యలకు మద్దతు ఇవ్వడానికి గీతం యొక్క నిబద్ధతను ఈ ఉదార విరాళాలు చాటిచెబుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు.

రైతు రుణమాఫీపై మాట్లాడే

నైతిక అర్హత బిఆర్ఎస్‌కి లేదు

ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

వనపర్తి బ్యూరో సెప్టెంబర్ 22 (జనంసాక్షి)

ఎన్నికల ముందు ఎకరానికి 10వేల రూపాయల పరిహారం ఇస్తామని చెప్పి మోసం చేసిన మీలాంటి వాళ్ళు రైతు శ్రేయస్సు గురించి మాట్లాడడం హాస్యాస్పదం వనపర్తి ఎమ్మెల్యే తూడి. మేఘా రెడ్డి విమర్శించారు. రైతులకు ఎనిమిదిన్నర వేల కోట్ల రుణమాఫీ డబ్బులు ఎగ్గొట్టి ఇంకా నిర్లజ్జగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. బిఆరెస్ ప్రభుత్వ పాలనలో రుణమాఫీ ఎందుకు సరిగ్గా చేయలేదో దానికి సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిమాండ్ చేశారు. మాట ఇచ్చి తప్పినందుకు అన్నదాతల కాళ్లు పట్టుకొని నువ్వు మీ నాయకుడు క్షమాపణ చెప్పాలన్నారు.ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసిన ఘనత తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దక్కుతుందన్నారు.రైతు రుణమాఫీ కోసం 31 వేల కోట్లు ఖర్చు చేసేందుకు నిర్ణయం తీసుకొని కేవలం 25 రోజుల్లో 18 వేల కోట్ల రూపాయలు 22 లక్షల మంది రైతుల ఖాతాలో జమ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని గుర్తు చేశారు.అన్నదాతల పూర్వాపరాలు పరిశీలించి రెండు లక్షల రుణమాఫీ చేయడం ఖాయమని, కుంటి సాకులు చూపిస్తూ రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు ఇకనైనా మానుకోవాలని హెచ్చరించారు.10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో రెండు లక్షల రుణమాఫీ అయిన ఒక్క రైతు నైన మీరు చూపించండని ప్రశ్నించారు. ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ ఉదర గొట్టే ఓ మాజీ మంత్రి మీ ఊర్లో అడుగు ఎంతమందికి రెండు లక్షల రుణమాఫీ అవుతుందో తెలుస్తుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అతి త్వరలోనే అన్నదాతలందరికీ క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇవ్వబోతోందన్నారు. కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వం అన్నదాతల కోసం అహర్నిశలు పనిచేసే ప్రభుత్వం,రైతు బీమా గురించి మాట్లాడే హక్కు మీరు ఎన్నడో కోల్పోయారు. దేశం మొత్తంలో పంటల భీమా లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రంగా మార్చింది మీరు కాదా అని,విజయ డైరీ నష్టాల్లో ఉందని మాట్లాడే ఓ మాజీ మంత్రి పదేళ్లపాటు అధికారంలో ఉండి ఎందుకు లాభాల బాటలో నడపలేదని ప్రశ్నించారు.వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన నువ్వు దానిని ఎందుకు గాడిలో పెట్టలేకపోయావని,నిస్సిగ్గుగా ఇప్పుడు హెరిటేజ్ కంపెనీ గురించి ఎందుకు మాట్లాడుతున్నారు ,మీ హయాంలో తెలంగాణలో హెరిటేజ్ కంపెనీ లేదా..? దానిని మీరు ఏమైనా నిషేదించారా, విజయ డైరీ అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేటు పాల కంపెనీలను మీరు ఎందుకు బ్యాన్ చేయలేదు, ఇప్పుడేదో హెరిటేజ్ కంపెనీని తెలంగాణకు తీసుకు వస్తున్నట్లు మీరు చేసే తప్పుడు ప్రచారం మంచిది కాదని హితవుపలికారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉందాం

సమస్యలపై పోరాడితేనే ప్రజాదరణ

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

వనపర్తి,సెప్టెంబర్22(జనంసాక్షి):

బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ తగ్గలేదని,రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు మనదేనని, అందుకు పార్టీ శ్రేణులందరు సిద్ధంగా ఉండాలని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన నివాసంలో వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ నాయకుల, ప్రజాప్రతినిధుల ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి ప్రజాసమస్యలపై పోరాడే నాయకులే ప్రజాదరణ పొందుతారని,నిరంతరం వారి మధ్య ఉంటూ అవసరాలు తీర్చడానికి కృషి చేస్తే ప్రజలు మరువరని అన్నారు.నాయకులు,కార్యకర్తలు స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదని, 60లక్షల మంది రైతులు రుణాలు తీసుకుంటే 40లక్షల మంది మాత్రమే రైతులు రుణాలు తీసుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, రైతు రుణమాఫీకి క్యాబినెట్లో రూ.27లక్షల కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి కేవలం 17లక్షల కోట్లు విడుదల చేసిందని దుయ్యబట్టారు. యాసంగి, వానాకాలం పంట కాలం ముగుస్తున్న నేటికీ పంట పెట్టుబడి సాయం చేయకుండా రైతులను నట్టేట ముంచారని అన్నారు. కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం,కెసిఆర్ కిట్టు,అమ్మ ఓడి, మహిళలకు రూ.2500, నిరుద్యోగభృతి వంటి ముఖ్యమైన హామీలకు మంగళం పాడిందని,రూ విషయాలను ప్రజలోకి తీసుకెళ్ళి కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను వివరించాలని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశ్రిత పక్షపాతం పాటిస్తూ బంధువులకు, అనుయాయులకు పెద్ద పీట వేస్తున్నారని, 9నెలల కాలములో ఒక్క కొత్త జిఓ ఇవ్వకుండా ప్రగల్భాలు పలుకుతున్నారని అన్నారు. ప్రతిపక్ష పాత్ర సమర్థవంతంగా పోషించి మన హయాములో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హనీమూన్ పిరియడ్ ముగిసిందని, ప్రజల సమస్యలపై ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత విమర్శలకు తావు ఇవ్వకుండా విధానాలపై మాట్లాడి ప్రజల మన్ననలు పొందాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షులు గట్టు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ బి.లక్షమయ్య, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వక్ఫ్ కమిటీ మాజీ చైర్మెన్ సర్దార్ ఖాన్,మీడియా కన్వీనర్ నంది మల్ల.అశోక్,పార్టీ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి, మాజీ ఎం.పి.పిలు కృష్ణనాయక్, పృథ్వీరాజ్, సంద్య తిరుపతయ్య, సేనాపతి, జెడ్పీటీసీలు లు రఘుపతి రెడ్డి, పద్మవెంకటేశ్, మాజీ మార్కు ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్,సింగిల్ విండో అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి,జగన్నాథం నాయుడు, మున్సిపల్ చైర్మన్ కరుణశ్రీ, సాయికుమార్, వైస్ చైర్మన్ కర్రే స్వామి, మండల పార్టీ అధ్యక్షులు వనం రాములు, వెంకటస్వామి, వేణు, రాళ్ళకృష్ణయ్య, రఘురామరావు, బి.బాలరాజు, కౌన్సిలర్స్ బండారు కృష్ణ, నాగన్న యాదవ్, కంచె రవి,ఎల్లా రెడ్డి, మేకల ఎల్లయ్య,ఎస్టీ సెల్ నాయకులు జాతృనాయక్, చంద్రశేఖర్ నాయక్, మాజీ జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఉస్మాన్,మత్స్య సంఘం డైరెక్టర్ పుట్ట బాలరాజు, నాగేంద్రమ్, నాయకులు ఉంగ్లమ్ తిరుమల్, ప్రేమ్ నాథ్ రెడ్డి, స్టార్ రహీమ్,కో ఆప్షన్ సభ్యులు ఇమ్రాన్, సయ్యద్ జమీల్, నందిమల్ల రమేష్,ఎం.డి గౌస్, మైనారిటీ సెల్ అధ్యక్షులు జోహెబ్ హుస్సేన్, వహీద్, యువత అధ్యక్షులు సూర్యవంశపు గిరి,మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ సునీల్ వాల్మీకి, పెబ్బేరు మండల మైనారిటీ నాయకులు మాజిద్, మండల యువత అధ్యక్షులు చిట్యాల రాము, వడ్డేమాన్ రవి, నాగరాజు, కార్తీక్, బలీదుపల్లి అంజి, వజ్రాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నగలు దొంగతనం చేసిన వ్యక్తి అరెస్ట్

సిద్దిపేట బ్యూరో సెప్టెంబర్ 22 (జనం సాక్షి)

జల్సాలకు అలవాటు పడి సిద్దిపేట పట్టణంలోని ఓ బంగారం దుకాణంలో చోరికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఏసీపీ మధు తెలిపారు. ఆదివారం ఏసీపీ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ పట్నం మద్దిలపాలెంకు చెందిన వేపంచ షణ్ముఖ రెడ్డి జల్సాలు చేయడానికి డబ్బుల కోసం బంగారం దుకాణంలో దొంగతనం చేసి అమ్ముకుంటే ఎక్కువ డబ్బులు వస్తాయని నిర్ణయించుకున్నాడు. హైదరాబాద్ నుంచి స్నేహితుడి మోటారు సైకిల్ పై ఈ 18న సిద్దిపేట కు .వచ్చి లాల్ కమాన్ సమీపంలోని నయీం మియా బంగారం షాపులోకి వెళ్లి అధిక బరువు గల బంగారు చైన్లు చూపించాలని కోరాడు. ఒక ట్రేలో 5 బంగారు చైన్లు చూపించగా ట్రేతో సహ బంగారు చైన్లు తీసుకొని పరిగెత్తి పక్క సంధిలో పెట్టిన మోటారు సైకిల్ పై హైదరాబాద్ వైపు వెళ్లుతున్న క్రమంలో దుద్దెడ టోల్ గేట్ వద్ద బైక్ నుంచి పడి పోయ్యాడు. ప్రథమ చికిత్స అనంతరం ప్రజ్ఞాపూర్ వద్ద పార్కింగ్ సెంటర్ లో బైక్ పెట్టి బస్సులో హైదరాబాద్ వెళ్లి పోయ్యాడు. ఈనెల 21న దొంగలించిన బంగారం కరీంనగర్ లో అమ్మడం కోసం ప్రజ్ఞాపూర్‌లో పార్కింగ్ చేసిన బైక్ తీసుకొని వెళ్లుతున్న క్రమంలో రంగీలా దాబా చౌరస్తా వద్ద పోలీసులను చూసి నిందితుడు పారి పోవడానికి యత్నించగా పోలీసులు వెంబడించి పట్టుకొని విచారించగా బంగారం చైన్ల దొంగతం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద 5 బంగారు చైన్లు (8 తులాలు) బైక్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న టూ టౌన్ ఇన్ స్పెక్టర్ ఉపేందర్, ఎస్ఐ వెంకట్ రెడ్డి, సిబ్బంది సుధాకర్ రెడ్డి, ప్రశాంత్, యాదగిరి, ప్రవీణ్ లను పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ అభినందించి రివార్డు అందజేస్తానని తెలిపినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

నిరుపేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్చెరు సెప్టెంబర్ 22 (జనంసాక్షి)

ఆపద కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఆపన్న హస్తం అందిస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, డివిజన్లు, మున్సిపాలిటీలకు చెందిన 118 మంది లబ్ధిదారులకు మంజూరైన 43 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా పాలన అందిస్తున్నామని తెలిపారు. వచ్చే నెలలో అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డులు అందించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నగేష్ యాదవ్, నరసింహారెడ్డి, వెంకటేష్, రాము, రాజు, సంజీవరెడ్డి, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలి

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)

మహబూబ్ బ్ నగర్ జిల్లా నుంచి భవిష్యత్తులో మంచి క్రీడాకారులను తయారు చేయాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా క్రీడా మైదానంలోని ఇండోర్ స్టేడియం వేదికగా జరిగిన ఒలింపిక్ సంఘం ఎన్నికలు మరియు సర్వసభ్య సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎందరినో మంచి క్రీడాకారులను తయారు చేసిన చరిత్ర మహబూబ్ నగర్ కు ఉందని, మహబూబ్ నగర్ జిల్లా లో క్రీడాకారులకు కొదవ లేదని, గ్రామీణ ప్రాంతాల్లో నుంచి క్రీడాకారులను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా క్రీడాకారులను తయారు చేయాల్సిన బాధ్యత నూతనంగా ఎంపికైన ఒలింపిక్ సంఘం పై ఉందని ఆయన చెప్పారు. వచ్చే 5 సంవత్సరాలు మన మహబూబ్ నగర్ జిల్లాకు గొల్డెన్ పిరియడ్ అని ఇలాంటి మంచి అవకాశం మళ్ళీ రాదని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకే నూతన అధ్యక్షులుగా ఎన్నికైన ఎన్‌పి వెంకటేష్ మిగతా సభ్యులతో చర్చించి మహబూబ్ నగర్ జిల్లాను క్రీడల్లో అగ్రగామిగా నిలపడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన కోరారు. మహబూబ్ నగర్ జిల్లాకు మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం అవసరం ఉందని ఎంవిఎస్ కళాశాల మైదానం లో ఏర్పాటు చేస్తే బాగుంటుందని , అలాగే రైఫిల్ షూటింగ్ శిక్షణకు ఎక్కువ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కూడా అవసరం ఉండదని, ఎక్కువ మంది క్రీడాకారులకు కూడా అవకాశం ఉంటుందని, అందువల్ల రైఫిల్ షూటింగ్ శిక్షణ కోసం కృషి చేయాలని, పాలిటెక్నిక్ కళాశాల, పాలమూరు యూనివర్సిటీ వద్ద శిక్షణ కోసం కావాల్సినంత అనువైన స్థలం కూడా ఉందని జిల్లా ఒలింపిక్ సంఘం చైర్మన్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఎపి. జితేందర్ రెడ్డి నీ ఆయన కోరారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఎపి.జితేందర్ రెడ్డి మాట్లాడుతూ మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి , కల్వకుర్తి ఎమ్మెల్యే కస్సిరెడ్డి నారాయణ రెడ్డి ల కోరిక మేరకు క్రీడాభివృద్ధికి కృషి చేస్తానన్నారు . జిల్లాలో క్రీడాకారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ముఖ్యమంత్రి సహకారంతో క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు తమ వంతు ప్రయత్నిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, డిఎస్ఓ శ్రీనివాస్, ఒలింపిక్స్ అసోసియేషన్ ఎన్నికల అబ్జర్వర్ సతీష్, ఎన్ పి. వెంకటేశ్, వి.మనోహర్ రెడ్డి, మహబూబ్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, అమరేందర్ రాజు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో వరుస చోరీలు

తాళం వేసిన ఇంట్లో చోరి

బంగారం, నగదు దొంగతనం

సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 22 (జనం సాక్షి)

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని రెడ్డి కాలనీ, ఆదర్శనగర్ కాలనీలలో, కాకతీయ నగర్ కాలనీలలో దొంగతనం జరిగింది. తాళం వేసిన ఇళ్లే టార్గెట్ చేస్తూ ఈనెల 21 తెల్లవారుజాము పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని కాకతీయ నగర్ కాలనీలోని జానీ మియా, కాజా మియా అన్నదమ్ములు పక్కపక్క ఇంట్లో నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం బంధువుల వద్ద ఫంక్షన్ ఉండడంతో వెళ్లి తిరిగి తెల్లవారుజామున నాలుగున్నర ప్రాంతంలో ఇల్లు చేరుకున్నారు. తెలుగు తాళం లేకపోవడంతో లోనికి వెళ్లి గమనించగా కాజామీయా ఇంట్లో 3 తులాల బంగారం, లక్ష రూపాయల నగదు అలాగేజానీ మియా ఇంట్లో 3 తులాల బంగారం, రూ. 50 వేలు చోరీ అయినట్లు బాధితులు తెలిపారు. చోరీ అనంతరం దుండగులు రెడ్డి కాలనీలోని ఓ బైకును చోరీ చేసి వెళ్లిపోయినట్లు బాధితులు తెలిపారు. అలాగే జాతీయ రహదారికి దగ్గరలో గల ఆదర్శనగర్ కాలనీలోని సమోసా తయారుచేసే ఇంట్లోకి వెళ్లి అప్రోచ్, జఫూర్, భరత్, పరమేశ్వర్, మల్లేష్ లకు సంబంధించిన 5 సెల్ ఫోన్ లను చోరీ చేశారు. దుండగుడు చోరీ చేస్తున్న సమయంలో సీసీ కెమెరాలు పడ్డారు. ఇద్దరు దుండగులు చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరాలు లోని ఫుటేజీలను చూస్తే అర్థమవుతుంది. చోరీ అనంతరం బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగతనం జరిగిన తీరును పరిశీలించి సీసీ ఫుటేజీలను గమనించారు. ఈ సందర్భంగాఆయా కాలనీలకు సంబంధించిన ప్రజలు మాట్లాడుతూ రాత్రిపూట కాలనీలలో గస్తీ ఏర్పాటు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో1267 సవరించాలి

మెదక్ జిల్లా పిఆర్‌టియుఎస్ ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ

మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 22 (జనం సాక్షి):

ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 1267 సవరించాలని మెదక్ జిల్లా పిఆర్ టియుఎస్ ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ..వర్క్ అడ్జస్ట్మెంట్ చేసినట్లయితే పాఠశాలల్లో నమోదు తగ్గే అవకాశం ఉందని, సమీప భవిష్యత్తులో పాఠశాలలు మూతపడే పరిస్థితి ఉందన్నారు. రాబోయే రోజులలో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టే అవకాశం ఉండదని అన్నారు. వర్క్ అడ్జస్ట్మెంట్ పేరుతో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులలో విద్యాభ్యాసం పూర్తిగా కుంటుపడే అవకాశం ఉన్నదని మరియు 1 నుండి 10 తరగతి విద్యార్థుల వరకు ఏకోపాధ్యాయుడు పాఠశాలను నడిపించడం సాధ్యం కాదని, ఇందులో ఏ శాస్త్రీయత ఉన్నదని ప్రశ్నించారు. ఇలా అయితే విద్యార్థులలో సామర్థ్యాల అభివృద్ధి కుంటూ పడే అవకాశం ఉందన్నారు. ప్రాథమిక పాఠశాల సజావుగా పనిచేయాలంటే తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని, కాబట్టి ఇచ్చినటువంటి జీవో 1267 ను వెంటనే సవరించాలని ఆయన కోరారు. 60 పైన ఉన్నటువంటి ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, తరగతికి ఒక ఉపాధ్యాయుడిని తప్పనిసరిగా నియామకం చేయాలని మరియు వర్క్ అడ్జస్ట్ పై విడుదల చేసిన జీవో నిరుద్యోగ యువత కూడా తీవ్ర అన్యాయం చేసే అవకాశం కూడా ఉందని కాబట్టి వెంటనే జీ

అడుగడుగునా తిరుగుబాటు..



ఐఐటీలో చేరే అవకాశం ఇస్తానన్నా సరే, కచ్చితంగా వద్దని చెప్పేసేదాన్నే! ఒకరకంగా నా జీవిత లక్ష్యం ఏమిటో, గమనం ఎటో స్పష్టత వచ్చింది. ఓ పెను కెరటంలా ప్రపంచం మొత్తాన్ని చుట్టబెట్టేస్తున్న నూతన, రాడికల్ ఉద్యమాలతో కలిసి కదం తొక్కుతున్న తరంలో నేనూ ఒక భాగస్వామిని. ఎక్కడెక్కడో పురుడుపోసుకుంటున్న ఆ తిరుగుబాట్లన్నీ సంఘటితమై, కలిసి కదిలితే.. దోపిడి, అణచివేత పునాదిగా ఉన్న మన సమాజాన్ని సమూలంగా తల్లకిందులు చేయటం సాధ్యమేనని అనిపించిన అద్భుత కాలమది. అమెరికాలో వియత్నాం యుద్ధ వ్యతిరేక ఉద్యమం నడుస్తోంది. ఆఫ్రికా, ఆసియాల్లో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు ఉధృతంగా సాగుతున్నాయి. బ్లాక్ పాంథర్ ఉద్యమం, ఐరోపాలో విద్యార్థి ఉద్యమాలు, అప్పుడప్పుడే అంకురిస్తున్న స్త్రీ విముక్తి పోరాటాలు, చైనాలో సాంస్కృతిక విప్లవం.. ఇలా ప్రపంచంలో ఎటు చూసినా ఉద్యమాలే. చరిత్రాత్మకమైన ఈ ఉద్యమాలను అన్నిచోట్లా ముందుండి నడిపిస్తున్నది యువతరం ప్రతినిధులు, అట్టడుగు వర్గాలవారే కావటం విశేషం. ఇక మన దేశంలో చూస్తే' ఎన్నో ఆశలు పెట్టుకున్న స్వాతంత్ర్యం విఫలమవుతున్న దాఖలాలు ప్రస్ఫుటమవుతుండటంతో ప్రజల్లో క్రమేపీ అసహనం గూడుకట్టుకుపోతోంది, దీనిలోంచి ఆవిర్భవించిందే నక్సల్‌బరీ ఉద్యమం. అప్పుడు మాకు' విప్లవం కనుచూపుమేరలోనే వుందనీ, దానికి మేమే సారథులమనీ అనిపించేది.

ఇక ఇంట్లో నా గొంతు బలంగా వినిపించటం మొదలుపెట్టాను. ఇదివరకటిలా ఏదో ప్రశ్నించి ఊరుకోవడం, ఉత్సుకతతో వాదించటం కాదు, అసలు నా ఆలోచనలేమిటో, నేనెలా జీవించాలనుకుంటున్నానో దృఢంగా చెప్పటం మొదలుపెట్టాను. ఎప్పటిలా వేసవిలో మా కుటుంబమంతా కలసి యాత్రలకు వెళ్లినప్పుడు నేను గుడి లోపల అడుగుపెట్టేందుకు నిరాకరించేదాన్ని. ఏమన్నా అంటే బహిష్టు అయ్యాననే దాన్ని. మెల్లగా ఇంట్లో నా వాదనలు అమ్మతో కాదు, నేరుగా నాన్నతోనే మొదలయ్యాయి. ఆయన నన్ను విపరీతంగా భయపెట్టే వాళ్లు. నేనేదైనా మీటింగుకు వెళ్లి ఇంటికి ఆలస్యంగా వస్తే గేటుకు అడ్డంగా నిలబడి, నన్ను ఇంట్లోకి రానిచ్చేవాళ్లు కాదు. ఇరుగు పొరుగు అందరికీ వినిపించేలా గట్టిగా తిడుతుండేవారు. నాకలా వీధిలో గొడవపడటం అంటే అసహ్యం. ఆయన నన్నలా నడిరోడ్డున నిలబెట్టి, బిగ్గరగా అరుస్తుండటం చూసి నాలోనేనే బిక్కచచ్చిపోయేదాన్ని. ఈ బాధ భరించలేక ఒక్కోసారి నా కార్యక్రమాలన్నీ కట్టిపెట్టేసి, ఆయన చెప్పినట్టు ఇంటికే పరిమితమవుదామా అని కూడా కాస్త మెత్తబడేదాన్ని. కానీ చటుక్కున దాని పర్యవసానం ఏమిటో నా కళ్ల ముందు విశ్వరూపంలా కనిపించేది' బుర్ర లేకుండా ఒంటికి రౌండ్లు రౌండ్లు చుట్టుకునే ఆ బట్టలు, దిగేసుకునే నగలు, పూజలు, గుళ్ల చుట్టూ ప్రదక్షిణాలు, పనికిమాలిన వాళ్లతో పోచికోలు కబుర్లు, ఎవడో ఓ నిరంకుశుడితో మెడలో తాళి కట్టించుకోవటం.. చాలుచాలు, నా సంకల్పం మళ్లీ వెంటనే దృఢమైపోయేది. మా అక్కయ్యకు పట్టిన గతి గుర్తుకొచ్చి.. దానికంటే ఎలాంటి జీవితమైనా మెరుగేననిపించేది!

నేను ఉస్మానియా యూనివర్సిటీలో చేరిన ఏడాదికి, అంటే 1973లో ముగ్గురు యువతులు పీజీ చేసేందుకు మా క్యాంపస్‌కు వచ్చారు. వాళ్లు నాకంటే ఓ ఏడాది సీనియర్లు, డిగ్రీ వేరే ఎక్కడో చేసి వచ్చారు. వాళ్లలో ఒకరైన లలిత మా మాథ్స్ డిపార్ట్‌మెంట్‌లోనే చేరింది. ఆమెను అందరూ నందూ అనేవాళ్లు. ఆమె విమలా రామచంద్రన్ సోదరే కాబట్టి నాకు ముందర నుంచే పరిచయం. మిగతా ఇద్దరూ' రుక్మిణి, లలిత. వీళ్లు ఆర్ట్స్ విద్యార్థులు. రుక్మిణి మేనన్‌ని అంతా మిన్నీ అని, కొందరు మీనా మేనన్ అని కూడా పిలిచే వాళ్లు. ఆమె కాలేజీలో మా అక్కయ్య క్లాస్‌మేట్ కాబట్టి తను కూడా నాకు ముందే తెలుసు. పైగా ఆమె అప్పటికే పీడీఎస్‌యూ శ్రీకృష్ణకు మంచి స్నేహితురాలు కావటంతో క్యాంపస్‌కు వస్తూనే మాతో కలిసిపోయింది. ఇక లలిత ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో మిన్నీతో కలిసి చదివేది. మేం నలుగురం చాలా సన్నిహితంగా, సరదాగా వుండేవాళ్లం. మిన్నీ మంచి అందగత్తె, ఎవరినైనా భలే అనుకరించేది, ఎప్పుడూ రంగురంగుల బట్టలేసుకుని, చెలాకీగా ఉండేది. తర్వాతి కాలంలో ఆమె బొంబాయిలో కార్మిక సంఘ నాయకురాలైంది. 1980లలో గిర్ని కామ్‌గార్ సంఘర్ష్ సమితి (మిల్లు కార్మికుల కార్యాచరణ కమిటీ) నిర్వాహకుల్లో ఒకరిగా, తర్వాత 2000లలో ఎన్‌జీవోలలో కన్సల్టెంట్‌గా పని చేసింది. లలిత స్త్రీల అధ్యయన సంస్థ 'అన్వేషి' వ్యవస్థాపక సభ్యురాలు, యుగాంతర్ అనే ఎన్‌జీవోలో కూడా పనిచేస్తుంది. చాలా నిదానంగా, ఉత్సాహంగా ఉండే నందు బ్యాంకు ఉద్యోగంలో చేరింది, కానీ చేరిన పదేళ్లలోపే, తన కూతురికి ఇంకా ఏడాది కూడా నిండక ముందే.. ఉన్నట్టుండి గుండె పోటుతో చనిపోయింది. మేం నలుగురం ఒక జట్టులా తయారై, కలిసి చదువుకుంటూ రకరకాల కార్యక్రమాలు నిర్వహించటం మొదలుపెట్టాం. అప్పటి వరకూ కోపంతో మాలో మేమే ఉడికిపోతూ, ఏం చెయ్యాలో పాలుపోక నిస్సహాయంగా ఉండిపోయే యువతలా వున్న మేం' ఈ క్రమంలో పూర్తిగా మారిపోయాం. మాలో హక్కుల గురించిన చైతన్యం పెరిగింది. ఈ దేశ పౌరులుగా మనకున్న హక్కులేమిటో, మనకు దక్కాల్సినవేమిటో స్పష్టమవుతూ వచ్చింది. అంతే కాదు, ఆచరణలోకి వచ్చేసరికి ఆ హక్కులేవీ కూడా నిలబడుతున్నట్టు, వాటికి అసలు ప్రాధాన్యం ఇస్తున్నట్టే కనిపించటం లేదన్న విషయాన్నీ అర్థం చేసుకున్నాం.

కోఠీ వుమెన్స్ కాలేజీలో చదువుకుంటున్నప్పుడే చూశాను' చాలామంది ఆడపిల్లల్ని వాళ్ల తల్లిదండ్రులు చటుక్కున చదువు మాన్పించి తీసుకెళ్లిపోతుండే వాళ్లు. ఒక దశ దాటిన తర్వాత ఆడపిల్లలకు ఇంక చదువులెందుకు, అనవసరమని భావించేవాళ్లు. అంటే మనకు 'చదువుకునే హక్కు' ఉందిగానీ, అది అత్యంత బలహీనమైనదన్న మాట. మమ్మల్ని ఎప్పుడైనా, ఎవరో ముక్కూమొహం తెలియని వాడికిచ్చి పెళ్లిచేసి పంపించెయ్యొచ్చు.. దాని పర్యవసానం ఇంక జీవితంలో మిగిలేది దు:ఖమే కావొచ్చు. మా తల్లిదండ్రులు వరకట్నం పేరిట భారీ మొత్తాలను సమర్పించుకుని, మాక్కాబోయే అత్తమామలను శాంతింపజేసి, మమ్మల్ని వారింటి బానిసలుగా ఉంచేందుకు అనుమతించమని వేడుకోవాలి! ఇక బయటకు వెళితే మేం సౌకర్యంగా ఉండే, మమ్మల్ని ప్రశాంతంగా ఉండనిచ్చే ప్రదేశమే ఉండదు' రోడ్ల మీదా, క్లాస్‌రూముల్లో, హోటళ్లలో.. ఎక్కడ చూసినా మాపై లైంగిక వేధింపులే. ప్రతిచోటా మా శరీరాలను వాణిజ్య సరుకుగా మార్చేసే అసహ్య ప్రకటనలే. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ చిట్టాకు అంతే ఉండదు.

గత ఏడాది కాలంగా నేను చదువుతున్న పుస్తకాలు, మా రాజకీయ చర్చలన్నింటి వల్లా.. మనం హక్కులున్న పౌరులమనీ, పౌరులుగా మనకున్న హక్కుల మాటేమిటన్న స్పృహ నాలో బాగా బలపడిరది. దాదాపు ఇవే భావాలున్న మిత్రబృందం కూడా తోడవటంతో ఇక చిన్నగా ఏదైనా కార్యాచరణకు పూనుకోవటం అవసరమని నిర్ణయించుకున్నాం. మొదటగా క్యాంపస్‌లో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఓ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాం. కొద్దిగా బయటకు వచ్చి, నగరంలో అశ్లీల వ్యతిరేక ప్రచారం చేపట్టాం. దీనిలో భాగంగా నగరమంతా విచ్చలవిడిగా ఉన్న అసభ్య, అశ్లీల పోస్టర్ల మీద, ప్రకటనల మీద నల్లరంగు పూశాం. మాకు దొరికిన, మమ్మల్ని పిలిచిన ప్రతి వేదిక మీదా మా గొంతు బలంగా వినిపించాం. ఆ రోజుల్లో ప్రగతిశీల భావాలుగల స్త్రీవాది బి.లక్ష్మీబాయిని తరచూ కలుస్తుండేవాళ్లం. ఆమె ఓయూ క్యాంపస్‌లో భాషాశాస్త్రం బోధించేది, ఆమెకు జార్జి కూడా బాగా తెలుసు. చదవటం, ఆలోచించటం, చర్చించటం చాలా అవసరమని ఆమె మమ్మల్ని ఎంతో ప్రోత్సహించేది. కానీ అంతలోనే' ఊహించినట్లుగానే, వామపక్ష వాదుల్లో అంతర్గత విభేదాలు పెరిగిపోయాయి. ఆమె మార్క్సిస్టు'లెనినిస్టు పార్టీల్లోనే మరో వర్గానికి చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకోవటంతో, గ్రూపు రాజకీయాల కారణంగా దురదృష్టవశాత్తూ మేమే ఆమెకు దూరంగా వుండాల్సి వచ్చింది.

ఆ రోజుల్లో మాకు కొత్త ఉత్తేజాన్నీ, ఉత్సాహాన్నీ ఇచ్చినవేమిటో తెలుసుకుంటే నేటితరం అమ్మాయిలకు ఆశ్చర్యంగా అనిపించొచ్చు. ఉదాహరణకు వనజా అయ్యంగార్ అని, అప్పట్లో మాకు ఓయూలో గణితశాస్త్రం బోధించే టీచర్ ఉండేది. ఆమె అంటే మాకు వల్లమాలిన అభిమానం. ఒక సనాతన తమిళ బ్రాహ్మణ కుటుంబం నుంచి వచ్చిన ఆమె కేంబ్రిడ్జిలో చదువుకుంది, వామపక్ష విద్యార్థి బృందాల్లో చేరింది, మోహిత్ సేన్‌ను పెళ్లి చేసుకుంది, (తర్వాతి కాలంలో ఆయనే భారత కమ్యూనిస్ట్ పార్టీ'సీపీఐలో పూర్తి కాలం పనిచేశారు), అధ్యాపకురాలిగా పనిచేసేందుకు హైదరాబాద్‌కు తిరిగొచ్చింది. చాలా అందంగా, హుందాగా వుండే ఆమె ఉపాధ్యాయుల గదిలో కూర్చుని సిగరెట్లు తాగేది. నేను పనిగట్టుకుని తరచూ అటుపోయి, ఆ గదిలోకి తొంగి చూస్తుండేదాన్ని. ఆమె సిగరెట్ కాలుస్తున్న దృశ్యం కనిపించిందంటే చాలు, ఇంక ఆ రోజు నాకు పట్టరాని సంతోషమే. ఆ రోజుల్లో ఒక మహిళ అలా ధీమాగా కూర్చుని సిగరెట్టు తాగడం చిన్న విషయమేం కాదు. అలాగే సత్యమ్మ శ్రీనాథ్ అని, రెడ్డి కాలేజీలో లెక్చరర్. ఆమె తన స్కూటరేసుకుని మా క్యాంపస్‌లో రయ్యిన తిరుగుతుండేది' ఒక మహిళ అలా స్కూటర్ మీద వెళుతుండటం చూస్తుంటే మా కళ్లు అబ్బురంతో విప్పారేవి. ఫెమినిస్టు, డాక్టరు అయిన వీణా శతృఘ్న కూడా స్కూటర్ మీదే వచ్చేది. అంతే కాదు, ఆ రోజుల్లోనే ఆమె స్లీవ్ లెస్ జాకెట్లు కూడా వేసుకునేది! ఎం.శాంత (తర్వాతి కాలంలో ఆమే శాంతా సిన్హా) ఇంట్లోంచి పారిపోయి పెళ్లి చేసుకున్న ఉదంతాన్ని కూడా ఇక్కడ ప్రస్తావించాలి. శాంత ఎంతో సహృదయశీలి, నాకున్న ఆత్మీయ మిత్రుల్లో ముఖ్యురాలు. హైదరాబాద్ సెంట్రల్ యునివర్సిటీలో రాజకీయ శాస్త్రం బోధించేది, మామిడిపూడి వెంకటరంగయ్య ఫౌండేషన్‌ను స్థాపించింది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ఎంతో కృషి చేసింది, బాలల హక్కుల పరిరక్షణ కోసం జాతీయ కమిషన్ ఏర్పాటు చేసినప్పుడు దానికి తొలి అధ్యక్షురాలిగా వ్యవహరించింది. కాలేజీ రోజుల్లో ఆమె తన క్లాస్‌మేట్ అజయ్ సిన్హాను ప్రేమించింది. కానీ ఆమె తల్లిదండ్రులు దాన్ని అంగీకరించలేదు. తమ సంప్రదాయ పుదుర్ ద్రావిడ కుటుంబానికి చెందిన మరో వ్యక్తితో ఆమెకు పెళ్లి ఖాయం చేసి, ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా కట్టడి చేసేశారు. ఆమెను బయటకు తేవటమెలాగా అన్నది మా అందరికీ పెద్ద సమస్యగా తయారైంది. అప్పుడు మా పీడీఎస్‌యూ మిత్రులంతా కలసి ఓ వ్యూహం పన్నారు. మరో మిత్రుడు మహిపాల్ రెడ్డి పోస్ట్‌మ్యాన్ వేషం వేసుకుని సైకిల్ మీద మారేడ్‌పల్లిలోని వాళ్లింటికి వెళ్లాడు. పథకం ప్రకారం అతని వెనకాలే నెమ్మదిగా ఒక కారు కూడా వెళ్లింది. అతను వాళ్ల ఇంటి గుమ్మం ముందు నిలబడి 'శాంతకు టెలిగ్రాం' అని బిగ్గరగా కేకేశాడు. కుటుంబ సభ్యులెవరో తలుపు తీసి టెలిగ్రాం కోసం చేయి చాస్తే 'దీని మీద శాంత గారే సంతకం పెట్టాలి' అని చెప్పాడు. కొద్దిసేపట్లో శాంత బయటికి వచ్చింది. అంతే, ఒక్క ఉదుటన ఆమె బయట ఎదురుచూస్తున్న కారు ఎక్కేయటం, ఇంటి నుంచి వచ్చేయటం.. అంతా క్షణాల్లో జరిగిపోయింది!

ఇలాంటిదే ఇంట్లోంచి పారిపోయి పెళ్లిచేసుకున్న మరో సంఘటన వుంది. అతని పేరు విజయ్ కులకర్ణి. జార్జి రెడ్డికి చాలా సన్నిహిత మిత్రుడు, పీడీఎస్‌యూ వ్యవస్థాపకుల్లో ముఖ్యుడు. అయితే జార్జి రెడ్డి చనిపోయిన తర్వాత తనే ఎందుకో ఆ గ్రూపుకు దూరమయ్యాడు. తను ఆర్ట్స్ కాలేజీలో ఎంఏ చదువుతున్న, అప్పటికే పెళ్లయిన ఓ విద్యార్థితో ప్రేమలో పడ్డాడు. వాళ్లిద్దరూ ఢిల్లీ?కి పారిపోయారు. ఇలాంటి సంఘటనల పట్ల పెద్ద వాళ్లంతా (వారిలో వామపక్షాల వారూ ఉన్నారు, ఇతరులూ ఉన్నారు) కన్నెర్ర చేస్తుండే వాళ్లు. అయినాసరే, మేం మాత్రం వీటిని' సంప్రదాయ ఛాందసవాదానికి, మహిళలపై కర్కశంగా సాగుతున్న అణిచివేతకు మేం ఎలుగెత్తి విసురుతున్న సవాల్‌గానే చూశాం!

వక్ఫ్ భూములపై పెగద్దల కన్ను

- అక్రమించుకుంటున్న బడా భూస్వామి, కోఆప్షన్, వ్యాపారవేత్త
- రాజకీయ, అధికారుల అండదండలతో కోట్లకు పడగలెత్తుతున్న వైనం
- లావాదేవీలు భారీగా జరుగుతున్నా పట్టని అధికారయంత్రాంగం
- ఆక్రమణదారుల నుంచి భూములను కాపాడాలని కోరుతున్న ప్రజలు

కామారెడ్డి బిచ్కుంద సెప్టెంబర్ (జనంసాక్షి)

వక్ఫ్ బోర్డు భూములను అమ్మినా కొనుగోలు చేసినా చట్టార్థ్య నేరమే. ఈ భూములు అనుభవించడానికి తప్పితే అమ్మడానికి వీల్లేని ఈ భూముల లావాదేవీలు భారీగా జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తోంది. మండల వ్యాప్తంగా వక్ఫ్ బోర్డు భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ఒక్కటి కాదు రెండు కాదు వందల ఎకరాల భూములు కబ్జాకు గురవుతున్నాయి. వక్ఫ్ బోర్డు భూముల వివరాలు ధరణి పోర్టల్‌లో కనపడకపోవడంతో ఎంతో విలువైన భూములను కొంతమంది ఆక్రమించేస్తున్నారు. రాజకీయ బలం, అధికారుల వత్తాసుతో కబ్జాదారులు ఈ భూములను విక్రయిస్తూ రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. వక్ఫ్ బోర్డు పరిధిలో దర్గా, మసీదు, ఈద్గా, అశుర్ ఖానా, ఖజాయత్, ఖబరస్తాన్ భూములు ఉన్నాయి. వక్ఫ్ చట్టం 1951 అమల్లోకి రావడంతో బోర్డు పరిధిలోని భూములను 1953లో ఖాస్రా పహనీలో అప్పట్లో నమోదు చేశారు. రికార్డుల్లో నమోదైనప్పటికీ కొంతమంది ఆ భూములను విక్రయించుకున్నారు. గతంలో అధికారం అడ్డం పెట్టుకొని తాజా మాజీ కొఆప్షన్ వక్ఫ్ బోర్డు ఆస్తులకు తన పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని శాంతాపూర్ గ్రామ ప్రజలు మరియు మండల ప్రజలు ఆరోపించారు. కాగా మండలకేంద్రంలో సైతం ఓ బడా భూ.స్వామి మరియు ఓ బడా వ్యాపారవేత్త వక్ఫ్ బోర్డు భూములను రిజర్వేషన్లు చేసుకొని పట్టా పాస్ బుక్ తో రైతు బంధును కూడా పొందుతున్నట్లు కీలక సమాచారం. ఓ బడా స్వామి అయితే దేవాదాయ శాఖ భూములు కూడా అమ్ముకుంటున్నారని జనాలు ఆరోపిస్తున్నారు. భూములను ఎలాగైనా కాపాడాలంటున్నారు. దీనిపై ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

వక్ఫ్‌భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన దృశ్యం

గర్భిణులకు సంపూర్ణ వైద్య సేవలు

- అన్ని రకాల సదుపాయాలు సమర్థవంతంగా అందించాలి
- వారిని 102 వాహనాల ద్వారా పరీక్షలకు తరలించాలి
- జ్వరాలు అధికంగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేక హెల్త్ క్యాంప్ నిర్వహణ
- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,సెప్టెంబర్ 21(జనంసాక్షి) : జిల్లాలో ఉన్న ప్రతి గర్భిణి మహిళకు సంపూర్ణమైన వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రులలో సమర్థవంతంగా అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో గర్భిణీ మహిళలకు అందే వైద్య సేవల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,జిల్లాలోని కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భిణీల నమోదు తక్కువగా ఉందని, వారు పరిశీలించుకుని ప్రతి గర్భిణీ స్త్రీ 100% రిజిస్టర్ అయ్యేలా చూడాలని, గర్భిణీ స్త్రీలు నమోదు కొరకు ఎల్.ఎం.పి లిస్ట్, నవ దంపతుల లిస్ట్ ప్రిపేర్ చేసి వారిని ట్రాక్ చేయాలని కలెక్టర్ సూచించారు. గర్భిణీ మహిళల జాబితా ప్రతి సూపర్వైజర్ వద్ద ఉండాలని, గర్భిణీ స్త్రీలను సూపర్ వైజర్ మానిటరింగ్ చేయాలని, బర్త్‌ప్లాన్ రూపొందించుకొని ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 102 వాహనాలను ఉపయోగించుకొని గర్భిణీ స్త్రీలను పరీక్షలకు పంపాలని, ఏ రోజు ఏ గర్భిణి మహిళలను పరీక్షలకు తీసుకు రావాలో జాబితా తయారు చేసుకోవాలని, ఆ జాబితా ప్రకారం గర్భిణీ స్త్రీలకు తగు పరీక్షలు నిర్వహించుటకు మాత శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం నందు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. హైరిస్క్ గర్భిణి కేసులను నెల ముందుగానే ఫాలో అప్ చేస్తుండాలన్నారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీ డెలివరీ అయిన వారికి ప్రత్యేక ఏసీ రూములు ఉన్నా యని, అవసరమైన వారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. విధి నిర్వహణలో సూపర్వైజర్లు సమయపాలన పాటించాలని, ఫీల్డ్ యందు డ్యూటీ సమయం ముగిసే వరకు ఉండాలని, సీనియర్ సూపర్వైజర్లు కూడా మెడికల్ అధికారి సూచనలు పాటించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఆరోగ్య కేంద్రం నందు అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రణాళిక రూపొందించి అవసరమైన పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఫీవర్ సర్వేలో ఎక్కువ జ్వరాలు నమోదైన గ్రామాలలో పంచాయతీ కార్యదర్శి సహకారంతో ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, వైరల్ జ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఎడిపిహెచ్ఓ డాక్టర్ అన్న ప్రసన్న, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వాణిశ్రీ, సూపర్వైజర్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎటూ తేలని ఫలితాన్ని భాజపా కోరుకుంటోంది

కుదుర్చుకున్నాం" అని ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు. భాజపా మాత్రం హంగ్ అసెంబ్లీనే కోరుకుంటోందని.. లెఫ్టినెంట్ గవర్నర్ పాలనను పొడిగించేందుకు దీన్ని సాకుగా చూపుతుందని ఆరోపించారు. అయితే, ఓటర్లు దీనికి అవకాశం ఇవ్వరని తెలిపారు. జమ్మూతో పోలిస్తే కశ్మీర్ లోయలో భాజపా నేతలు అంతగా ప్రచారం చేయడం లేదనే వాదనలపై స్పందిస్తూ.. ఇక్కడ వారికి ఆశించిన ఫలితాలు రావని చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో తమ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే మూడు కుటుంబాల (గాంధీ, ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా కుటుంబం) ప్రస్తావన తెస్తున్నారని విమర్శించారు. ఇదిలా ఉండగా.. జమ్మూకశ్మీర్‌లో ఇప్పటికే తొలి దశ పోలింగ్ ముగిసింది. సెప్టెంబరు 25, అక్టోబరు 1న మిగతా రెండు దశలకు పోలింగ్.. 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

సహకార బ్యాంకు సేవలు ప్రశంసనీయం

వాటిని సద్వినియోగం చేసుకోవాలి
జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి) : సహకార బ్యాంకులు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గంగాధర మండల కేంద్రంలో కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు శాఖను ఆదివారం శాసన సభ్యులు మేడిపల్లి సత్యం, బ్యాంక్ సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సహకార బ్యాంకుల వల్ల స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. రైతులు, చిరు వ్యాపారులు, స్థానిక ప్రజలు సహకార బ్యాంకు సేవలను ఉపయోగించుకోవాలని అన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ... తక్కువ వడ్డీరేట్లకు రుణాలు అందించే సహకార బ్యాంకు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గ్రామాలకు సహకార బ్యాంకు సేవలను విస్తరించాలని కోరారు. కరీంనగర్ జిల్లాలో రెండవ బ్రాంచ్ గా గంగాధరలో కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు సేవలు అందించనున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా సహకార అధికారి రామానుజాచార్య, కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు. అర్బన్ బ్యాంక్ అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ముదుపు మోహన్, ముక్క భాస్కర్, బీరం ఆంజనేయులు, రేగొండ సందీప్, మూల లక్ష్మి విద్యాసాగర్, లక్ష్మణ్ రాజు, సంయుద్దీన్, మంగి రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏలోటూ రాకూడదు

సిబ్బందిని ఆదేశించిన సబ్ కలెక్టర్ కిరణ్మయి

నిజాంసాగర్ సెప్టెంబర్ 22(జనంసాక్షి)

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాన్ని ఆదివారం నాడు సబ్ కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు ఈ సందర్భంగా ఆమె వసతి గృహంలో విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని అందించాలని సూచించారు. అనంతరం నిజంసాగర్ ప్రాజెక్టు ను సందర్శించారు. ప్రాజెక్టులో నీటి నిలువ వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తాసిల్దార్ బిక్షపతి, ఆర్ ఐ నారాయణ, ఉన్నారు.

భారీ వర్షానికి కూలిన ఇళ్ల పరిశీలన

నిజాంసాగర్ (జనంసాక్షి): ఇటీవల కురిసిన భారీ వర్షానికి నిజంసాగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇల్లు కూలిపోవడంతో బాన్సాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి దెబ్బతిన్న ఇళ్లను ఆదివారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె నిజాంసాగర్ మండలంలోని సుల్తాన్ నగర్, వడ్డేపల్లి గ్రామాల్లో కూలిన ఇళ్లను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. బాధితులు తమ కూలిన ఇళ్లకు పరిహారం అందేలా చూడాలని సబ్ కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బిక్షపతి, ఆర్ఐ అంజయ్య, పంచాయతీ కార్యదర్శి రాము రాథోడ్, తదితరులు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
23 సెప్టెంబర్ 2024
తెలంగాణ

రైతులను రాజును చేయడమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యం

వ్యవసాయ మార్కెట్ నూతన చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పచ్చిమట్ల మధార్ గౌడ్ ల పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి ప్రభుత్వ బీర్ల, ఎంపి చామల..

కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది..

అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి..

విజయవంతంగా సేవలు అందించి రైతు సంక్షేమానికి కృషి చేయాలి..

ప్రభుత్వం రైతు పక్షపాతి నూతన పాలకవర్గాని కి అభినందనలు..

రాజపేట (ఆలేరు) ,సెప్టెంబర్ 22 (జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని, రైతులను రాజును చేయడమే సర్కారు లక్ష్యం అని రాష్ట్ర మంత్రులు వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనల చైతన్య మహేందర్ రెడ్డి వైస్ చైర్మన్ పచ్చిమట్ల మాధార్ గౌడ్ తో పాటు 13 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం కార్యక్రమం అట్టహాసంగా జరిగింది . పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ సహకార, చేనేత శాఖల జిల్లా ఇంచార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రోడ్లు భవనాల,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిలు హాజరయ్యారు. అంతకు ముందు ఆలేరు పట్టణంలోని ప్రధాన రహదారిలో నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ లో పాల్గొన్నారు. సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూనూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ పాలకవర్గం, అధికారులు, రైతులతో సమన్వయంతో ముందుకు సాగి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం చేసే అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త అధికారులతో సమన్వయాన్ని పాటించి ప్రజలకు ఉన్న ఇబ్బందులను పరిష్కరించే విధంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు.సందర్భంగా నూతన పాలక వర్గానికి అభినందనలు తెలిపారు. విజయవంతంగా సేవలు అందించి రైతుల సంక్షేమానికి కృషి చెయాలి అన్నారు. కార్యక్రమం లోనల్గొండ,రంగారెడ్డి జిల్లాల మదర్ డైరి చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి,భువనగిరి జిల్లా డీసీసీ అధ్యక్షులు అందెం సంజీవ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి,ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్లు కౌన్సిలర్లు స్థానిక నాయకులు, ముఖ్య నాయకులు మార్కెటింగ్, అగ్రికల్చర్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): ఉమ్మడి ఖమ్మంజిల్లాలో సోమ, మంగళ వారాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 08.00 గంటల నుంచి ఇల్లందు నియోజకవర్గంలోని ఇల్లందు పట్టణం, ఇల్లందు మండలంలోని ముకుందాపురం, మెడికుంట, ఎల్లందుళ్లపాడు, బుగ్గవాగు, బొజ్జాయిగూడెం తదితర గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. సాయంత్రం నాలుగున్నర గంటలకు నేలకొండపల్లి మార్కెట్ యార్డులో జరిగే నేలకొండపల్లి మార్కెట్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. మంగళవారం ఉదయం 10గంటలకు ఖమ్మం నగరం ఒకటవ డివిజన్ లోని రైస్ మిల్లు రోడ్డులో, ఉదయం 10.30గంటలకు 59వ డివిజన్ దానవాయిగూడెం రోడ్డు నెంబర్ 8 లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కూసుమంచి మండలంలో నూతన జూనియర్ కళాశాలను ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే కూసుమంచి జెడ్ పి ఎస్ ఎస్ స్కూల్ అదనపు తరగతులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో పాలేరు నియోజకవర్గ స్థానిక ప్రజాప్రతినిధులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అభిమానులకు మంత్రి పొంగులేటి అందుబాటులో ఉంటారని దయాకర్ రెడ్డి తెలిపారు.

జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం

సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

రామన్నపేట, సెప్టెంబర్ 22 (జనంసాక్షి): జమిలి ఎన్నికల పేరుతో భారత ప్రజాస్వామిక,రాజ్యాంగ విలువల్ని ధ్వంసం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం యత్నిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి యం.డి జహంగీర్ అన్నారు. సీపీఎం పట్టణ 17వ మహాసభను స్థానిక మత్స్యగిరి నరసింహ స్వామి ఫంక్షన్ హాల్ లో ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిధిగా ఆయన హాజరై మాట్లాడుతూ ఒకే దేశం –ఒకే ఎన్నిక పేరుతో ప్రజలను గందరగోళ పరిచే కుట్ర చేస్తుందన్నారు. భారత దేశం అనేక విభిన్న సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీకగా ఉన్నది . ఆయా రాష్ట్రాల ప్రత్యేక పరిస్థితుల రీత్యా ఎన్నికలు జరుగుతాయి.మధ్యలో ప్రభుత్వాలు రద్దవుతాయి ఉప ఎన్నికలు వస్తుంటాయి కానీ ప్రభుత్వ అనాలోచిత చర్యతో ప్రజాస్వామిక విలువలు ధ్వంసం అవుతాయన్నారు. ఆర్.ఎస్.ఎస్ వ్యక్తిగత ఏజండాను దేశం మీద రుద్దే ప్రయత్నం చేస్తుందనన్నారు.అధ్యక్ష తరహా పాలనను తీసుకొచ్చేందుకు యత్నిస్తుం దన్నారు. జమిలీ ఎన్నికల కుట్రను దేశ ప్రజలు తిరస్కరించాలని అన్నారు. రామన్నపేట సీపీఎం పట్టణ మహాసభ సందర్భంగా సీనియర్ నాయకుడు పాల్వంచ శంకరయ్య ఆ పార్టీ జెండా ఆవిష్కరించారు.అనంతరం సీపీఎం పట్టణ నూతన శాఖ కార్యదర్శిగా మునికుంట్ల లెనిన్,సహాయ కార్యదర్శగా కందుల హనుమంతుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేక అశోక్ రెడ్డి,జిల్లా కమిటీ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం,గాదె నరేందర్,మండల కమిటీ సభ్యులు మామిడి వెంకట్ రెడ్డి,కందుల హనుమంతు, బావాండ్లపల్లి బాలరాజు,నాయకులు గొరిగే సోములు,పాల్వంచ జగతయ్య, ఆముద ఆంజనేయులు,పాల్వంచ లక్ష్మీ, బావాండ్లపల్లి సత్యం,లలిత,రూపవతి,గంజి అశోక్,దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి, ఎమ్మెల్యే, ఎంపీలు

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో సెప్టెంబర్ 22 జనంసాక్షి: ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని ఆదివారం తెలంగాణ వ్యవసాయ సహకార, చేనేత శాఖల, జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రోడ్లు భవనాల, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిలు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదగిరిగుట్ట దేవాలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం యాదాద్రి ఆలయ అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేసి స్వామివారికి భక్తులను దూరం చేసిందని ఆరోపించారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లోని రాష్ట్ర ప్రభుత్వం గత సాంప్రదాయాలను కొనసాగించేందుకు ఇప్పటికే అనేక చర్యలను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నేతృత్వంలో తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు.

రానున్న రోజులలో యాదగిరిగుట్ట ఆలయాన్ని మరింత ఆధునికరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం దేశంతో పాటు ప్రపంచానికే ఆదర్శంగా నిలవాలని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అధికారులు, వేద పండితులు ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం కోసం యాదగిరిగుట్టకు చేరుకున్నా మంత్రులకు, ఎంపీకి బీర్ల ఐలయ్య నాయకత్వంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులను దేశానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులధి కీలక పాత్ర

కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి

చిట్యాల సెప్టెంబర్ 22(జనంసాక్షి), విద్యార్థులను దేశానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం జరిగిన ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంత ఉన్నత పదవుల్లో ఉన్నటువంటి వ్యక్తి అయినా ఉపాధ్యాయుడు నేర్పించిన విద్యతోనే అది సాధించగలుగుతాడని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు దీటుగా ప్రైవేటు పాఠశాలల్లో అతి తక్కువ ఫీజుతో విద్యను నేర్పిస్తూ విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలపడానికి ప్రైవేట్ పాఠశాలలు కృషి చేయడం అభినందనీయమని అన్నారు. కార్పోరేట్ పాఠశాలల పేరుతో లక్షల రూపాయల్లో ఫీజులను వసూలు చేస్తూ వ్యాపార పరంగా మారిన నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలలో ప్రైవేట్ పాఠశాలలు నాణ్యమైన విద్యను అందించడం అభినందనీయమని అన్నారు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు తమ విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలపడానికి కృషి చేయాలని వెంకట్ రెడ్డి అన్నారు. ట్రస్మా జిల్లా అధ్యక్షులు మక్కాముల రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటుగా ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులకు కూడా ఉపాధ్యాయ దినోత్సవం రోజు గుర్తింపునివ్వాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి గాదే రవీందర్ రెడ్డి, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఎండి జమీరుద్దీన్, వలిగొండ శంకర్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరం ఉత్తమ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులను ముఖ్య అతిథులు మెమెంటోలు శాలువాలతో సత్కరించారు.

కలుషితమైన రాజకీయాల ప్రక్షాళన కోసం టీజెఎస్ ను బలోపేతం చేయాలి

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి): ప్రజాస్వామ్య ప్రక్రియను పరిహాసం చేస్తూ డబ్బులు, మద్యం పంపిణీతో ఎన్నికల జాతరలు నిర్వహిస్తున్నారని, ఈ అవినీతితో కూడుకున్న ఎన్నికల రాజకీయాలను ప్రక్షాళన చేసేందుకు జన సమితి పార్టీని స్థాపించడం జరిగిందని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సూర్యాపేట నియోజకవర్గ ఇన్చార్జ్ ధర్మార్జున్ అన్నారు. ఆదివారం చివ్వెంల మండల కేంద్రంలో జరిగిన మండల స్థాయి పార్టీ ప్లీనరీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.అక్రమ మార్గాల్లో డబ్బులు సంపాదించి ఎన్నికల్లో ఖర్చు చేస్తూ మళ్లీ డబ్బులు సంపాదనే లక్ష్యంగా పనిచేస్తున్నటువంటి ఈ రాజకీయ నాయకత్వాన్ని పక్కకు తప్పించి, స్వచ్ఛమైన రాజకీయాల కొరకు పారదర్శకతతో కూడిన పరిపాలన కొరకు యువతను ప్రోత్సహించి గ్రామస్థాయి నుండి అన్ని చట్టసభలలో యువత క్రియాశీలకంగా ఉండేటట్టుగా ప్రయత్నం చేయాలని కోరారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో చివ్వెంల మండలంలో అన్ని గ్రామ పంచాయతీలో చదువుకున్న యువకులను, తటస్తులను ప్రోత్సహించి గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసిటట్లుగా సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.మండల పార్టీ అధ్యక్షులుగా ధరావత్ సుమన్ నాయక్, ఉపాధ్యక్షులుగా బలుగురు గోపి, కార్యదర్శిగా

జగన్ యాదవ్, రైతు జన సమితి మండల అధ్యక్షులుగా మన్సూర్ నాయక్, యువజన సమితి మండల అధ్యక్షునిగా రెడ్యానాయక్ ను ఎన్నుకున్నారు.మండల పార్టీ అధ్యక్షులు సుమన్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ ప్లీనరీలో పార్టీ జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్, యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, సహాయ కార్యదర్శి ఎర్ర వీరన్న, విద్యార్థి జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరాల ప్రశాంత్, రాష్ట్ర నాయకులు డప్పు గోపి, లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ కుంచం చంద్రకాంత్, కో కన్వీనర్ వీరేష్ నాయక్, రైతు జన సమితి జిల్లా ఉపాధ్యక్షులు పానుగోటి సూర్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బచ్చలకూరి గోపి, నాయకులు యాకూబ్ రెడ్డి, సైదా నాయక్, నాగు,గోపి, మదుసూధన్ రెడ్డి, వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గస్థాయి సీడ్స్ పెస్టిసైడ్ అండ్ ఫెర్టిలైజర్ డివిజన్ కమిటీ ఎన్నిక..

తుంగతుర్తి సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి సీడ్స్ పెస్టిసైడ్ అండ్ ఫెర్టిలైజర్ నూతన డివిజన్ కమిటీని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షులుగా తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన పూసపెల్లి యాదగిరి. ప్రధాన కార్యదర్శిగా తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన సోమ వెంకన్న. కోశాధికారిగా నూతనకల్ మండల కేంద్రానికి చెందిన సామా నాగిరెడ్డి. ఉపాధ్యక్షులుగా నాగారం మండల కేంద్రానికి చెందిన కల్లెట్లపల్లి శ్రీనివాస్. మహంకాళి సూరయ్య (మద్దిరాల) జాయింట్ సెక్రెటరీగా కళాబత్తుల శ్రీనివాస్ (జాజిరెడ్డి గూడెం) గౌరవ అధ్యక్షులుగా(గుండా ఈశ్వరయ్య) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ మేరకు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ తమ ఎన్నిక కోసం కృషిచేసిన మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు పెస్టిసైడ్ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

పాలేరు కాల్వ నీరు వెంటనే విడుదల చేయాలి

• ఆమ్ఆద్మీపార్టీ ఖమ్మం జిల్లా పరిశీలక బృందం డిమాండ్..

ఖమ్మం, సెప్టెంబర్ 22 (జనం సాక్షి)

కూసుమంచి: పాలేరు సాగర్ కాల్వకు నీరు విడుదల చేయడం ద్వారా ఖమ్మం జిల్లా లో ఎండిపోతున్న వరిపోలాలను సంరక్షించాలని ఆమ్ఆద్మీపార్టీ తెలంగాణా కోర్కమిటీ సభ్యులు నల్లమోతు తిరుమల రావు డిమాండ్ చేశారు.ఆదివారం ఆమ్ఆద్మీపార్టీ పాలేరు రిజర్వాయర్ గండి పూడ్చివేత పనులు పరిశీలన అనంతరం కూసుమంచి లో విలేకరుల నుద్దేశించి ఆయన మాట్లాడారు.గత పక్షం రోజుల క్రితం కురిసిన అతివృష్టి వలన ఖమ్మం జిల్లా రైతులు మెట్ట పంటలు దెబ్బతింటే, ప్రస్తుతం పదిరోజులు గా సాగర్ కాల్వలకుపాలేరువద్ద పడ్డ గండివలన రైతులు వేలాది ఎకరాల్లో సేద్యం చేసిన వరి పంటలు, పొలాలు ఎండలు మూలంగా ఎండి బీటలు వారు తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వాలు ఆదునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినప్పటికీ ప్రకృతి విపత్తులను ఉండి ప్రజలను కాపాడడంలో వైఫల్యం చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అందుకు పాలేరు రిజర్వాయర్ ఎడమ కాల్వకు గండిపడి గత ఇరవైరోజులుగా మరమ్మత్తులు చేసినప్పటకీ తిరిగి పడినకాడనే నీరు వదలగానే గండిపడడం నాసిరకం పని విధానం, పర్యవేక్షణ లోపం కు నిదర్శనంగా వారు ఆరోపించారు.శాశ్వతంగా పాలేరు కాల్వ మరమ్మత్తులు చేయాలంటే, కూలిన అండర్ టన్నెల్ నిర్మించాలంటే మూడు నెలల కాలం కనీసం పడుతుందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారని,కానీ, తాత్కాలిక ప్రాతిపదికన పైపులు ద్వారా రెండు రోజులలో కాల్వకు నీరు అందిస్తామని పని ప్రదేశంలో సిబ్బంది చెబుతున్నప్పటికీ,అక్కడ పనులను పరిశీలిస్తే ,అలాకనిపించడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్న ప్పటికీ,రైతులు ఎండిపోతున్న పొలాలకు భరోసా ఇచ్చే పరిస్థితి ప్రభుత్వం నుండి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కనీసం పెద్ద స్థాయి ఇంజనీరింగ్ అధికారులు కూడా పని ప్రదేశంలో కనిపించలేదని ఆమ్ఆద్మీపార్టీ పరిశీలక బృందం ఆరోపించింది.ఆమ్ఆద్మీ పార్టీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వర్ణ సుబ్బారావు మాట్లాడుతూ పాలేరు కాల్వ నీరు సరఫరా లో వైఫల్యం కు బాధ్యత వహిస్తూ మండలాల వారీగా సర్వే చేసి ఖమ్మం జిల్లా లో ఎండీపోయిన రైతుల వరి పొలాలకు ఎక్స్గ్రేషియా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.ఒకవైపు పరిపూర్ణం గా రుణమాఫీ కాలేదు,రైతుభరోసా ఒక్క పైసా ఇవ్వలేదు, ఇటీవల తుపాను కు మెట్టపంటలు దెబ్బతిన్నాయి.సాగర్ కాల్వ గండి మూలంగా మాగాణి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పాలేర కాల్వ పై గండిని ప్రభుత్వం ప్రత్యక్ష పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి ఎండిపోతున్న పంట పొలాలు కు నీరందించాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు.ప్రకృతి విపత్తులు తర్వాత చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకునే కంటే,ముందు జాగ్రత్త చర్యలు పాటిస్తే సమస్య తీవ్రతను తగ్గించవచ్చని ఆమ్ఆద్మీపార్టీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ పేర్కొన్నారు.విలేకర్ల సమావేశం లో ఆమ్ఆద్మీపార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి గుత్తా నాగేశ్వరరావు, మీడియా ఇన్చార్జి సూర్య దేవర సంగమేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.ఆమ్ఆద్మీపార్టీ

తెలంగాణా కోర్ కమిటీ సభ్యులు నల్లమోతు తిరుమల రావు నేతృత్వంలో పాలేరు రిజర్వాయర్ పరిశీలించిన బృందం లో ఆమ్ఆద్మీపార్టీ తెలంగాణా రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వర్ణ సుబ్బారావు, ఆమ్ఆద్మీపార్టీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్, కార్యదర్శి గుత్తా నాగేశ్వరరావు, మీడియా ఇన్చార్జి సూర్య దేవర సంగమేశ్వర ప్రసాద్ తదితరులు ఉన్నారు.

మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు

కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : కొండమల్లేపల్లి మండల కేంద్రంలో మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఊరే జనార్ధన్ అన్నారు. ఆదివారం వాసవి మాత ఆలయంలో జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అహింసా పద్ధతిలో భారతదేశానికి స్వాతంత్ర్యం రావడంలో ప్రాణ త్యాగాలు చేసిన ఆర్యవైశ్యుల ముద్దుబిడ్డ జాతిపిత మహాత్మా గాంధీజీ విగ్రహాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేసుకోవడం ఎంతో అవసరం అన్నారు. మహాత్మా గాంధీజీ భారతదేశానికి చేసిన విశిష్ట సేవలను కొనియాడారు. ఆర్యవైశ్యులు సంఘం సేవతో పాటు, సమాజ సేవలో ముందుండాలని ఆర్యవైశ్యులకు సూచించారు ఈ సమావేశంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి మిర్యాల శ్రీనివాస్, కోశాధికారి ముచ్చర్ల కరుణాకర్, గౌరవ అధ్యక్షులు రాచమళ్ల నర్సింహా, పట్టణ ప్రధాన కార్యదర్శి దాచేపల్లి నరేందర్, కోశాధికారి కర్నాటి శ్రీనివాస్, బూరుగు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆపిల్ ఉత్పత్తులతో ముప్పు

హెచ్చరించిన కేంద్రం..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : ఆపిల్ ఐ-ఫోన్‌లు, ఇతర ఉత్పత్తుల యూజర్లను కేంద్రం హెచ్చరించింది. వాటితో హై రిస్క్ ముప్పు ఉందని, అప్రమత్తంగా ఉండాలని ఆపిల్ ఉత్పత్తుల యూజర్లను కేంద్ర ప్రభుత్వ అనుబంధ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్) అలర్ట్ జారీ చేసింది. పలు ఆపిల్ ఉత్పత్తుల్లో పలు భద్రతా పరమైన లోపాలు ఉన్నాయని, దీంతో హై రిస్క్ ముప్పు పొంచి ఉందని పేర్కొంటూ సెర్ట్ -ఇన్ ఈ నెల 19న అడ్వైజరీ జారీ చేసింది. ఐఓఎస్, ఐపాడ్ ఓఎస్, మాక్ ఓఎస్, వాచ్ ఓఎస్, విజన్ ఓఎస్ వర్షన్లలో లోపాలు ఉన్నాయని తెలిపింది. కనుక ఆపిల్ ఉత్పత్తుల యూజర్లు ముప్పును తప్పించుకునేందుకు తాజా ఓఎస్ వర్షన్లతో అప్ డేట్ చేసుకోవాలని సెర్ట్-ఇన్ సూచించింది. తమ డివైజ్ లపై అన్ యూజువల్ యాక్టివిటీని పర్యవేక్షించాలని పేర్కొంది.

లోపాలతో సెక్యూరిటీ ముప్పు ఉన్న ఉత్పత్తులు ఇవే..

ఐఓఎస్: 18, 17.7లకు ముందు ఐఓఎస్ వర్షన్లు
ఐపాడ్ ఓఎస్ : 18, 17.7లకు ముందు ఐఓఎస్ వర్షన్లు
మాక్ ఓఎస్ సొనోమా : 14.7కి ముందు వర్షన్లు
మాక్ ఓఎస్ వెంచురా: 13.7 కి ముందు వర్షన్లు
మాక్ ఓఎస్ సీక్యూయా : 15కి ముందు వర్షన్లు
టీవీ ఓఎస్: 18కి ముందు వర్షన్లు
వాచ్ ఓఎస్ : 11కి ముందు వర్షన్లు
సఫారీ : 16కి ముందు వర్షన్లు
ఎక్స్ కోడ్ - 16కి ముందు వర్షన్లు
విజన్ ఓఎస్ : 12కి ముందు వర్షన్లు

ముప్పు ప్రభావం ఇలా

యూజర్ల సున్నిత సమాచారాన్ని సైబర్ మోసగాళ్లు అనధికారికంగా యాక్సెస్ చేసుకునే అవకాశం, డివైజ్ మీద ఆర్బిటరీ కోడ్ అమలు, కీలక భద్రతా ఆంక్షలను బైపాస్ చేసే అవకాశం, క్రాస్ సైట్ స్క్రిప్టింగ్ దాడుల్లో నిమగ్నం, స్పూఫింగ్ దాడుల నిర్వహణ, సిస్టమ్ మీద నియంత్రణకు ప్రివిలేజెస్ ఎలివేట్ చేయడం

ప్రభావం పడే ఉత్పత్తులు

18, 17.7 కి ముందు ఐఓఎస్, ఐపాడ్ ఓఎస్ వర్షన్లపై 'డినైల్ ఆఫ్ సర్వీస్ కండీషన్ (డీఓఎస్)' దాడులు, సమాచారం బహిర్గతం, సెక్యూరిటీ ఆంక్షల బైపాసింగ్.

మాక్ ఓఎస్ (సొనోమా, వెంచురా, సీక్యూయా) : మాక్ ఓఎస్ పాత వర్షన్లు వాడే యూజర్లకు క్రాస్ సైట్ స్క్రిప్టింగ్, ప్రివిలేజ్ ఎలివేషన్, డీఓఎస్, డేటా మానిప్యూలేషన్ జరిగే ముప్పు.

టీవీఓఎస్ అండ్ వాచ్ ఓఎస్: డీహోఎస్ దాడులు క్రాస్ సైట్ స్క్రిప్టింగ్ (ఎక్స్ఎస్ఎస్) దాడులు, సమాచారం బహిర్గతం చాన్స్.

సఫారీ, ఎక్స్ కోడ్: పాత వర్షన్లపై స్పూఫింగ్, సెక్యూరిటీ ఆంక్షల బైపాసింగ్ ముప్పు.

20 రోజుల్లోనే రూ.33,700 కోట్ల ఎఫ్‌పీఐ పెట్టుబడులు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : ఈ నెలలో ఇప్పటి వరకూ దేశీయ స్టాక్ మార్కెట్లలో విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) రూ,33,700 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టారు. కీలక వడ్డీరేట్లు తగ్గిస్తూ యూఎస్ ఫెడ్ రిజర్వ్ నిర్ణయం తీసుకోవడం, భారత్ మార్కెట్లో వృద్ధి నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్లలో ఎఫ్‌పీఐ పెట్టుబడులు పెరగడానికి కారణమైంది. ఈ ఏడాదిలో ఎఫ్‌పీఐలు పెట్టుబడులు పెట్టడం రెండో నెల. ఇంతకుముందు గత మార్చిలో రూ.35,100 కోట్ల విలువైన పెట్టుబడులు ఇన్వెస్టర్లు దేశీయ ఈక్విటీ మార్కెట్లలో మదుపు చేశారు. ఇదే ధోరణి ఇక ముందు కూడా కొనసాగుతుందని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్ మెంట్ స్ట్రాటర్జిస్ట్ వీకే విజయ్ కుమార్ అంచనా వేశారు. డిపాజిటరీల నుంచి వచ్చిన డేటా ప్రకారం విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్లు ఈ నెల 20 వరకు నికరంగా రూ.33,691 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ రూ.76,572 కోట్ల పెట్టుబడులను ఈక్విటీ మార్కెట్లలో ఎఫ్‌పీఐలు మదుపు చేశారు. జూన్ నుంచి నికరంగా ఈక్విటీ మార్కెట్లలో ఎఫ్ పీఐలు షేర్ల కొనుగోళ్లు నికరంగా కొనసాగుతూ వచ్చాయి. ఏప్రిల్, మే నెలల్లో రూ.34,252 కోట్ల విలువైన షేర్లను ఎఫ్ పీఐలు కొనుగోలు చేశారు.



లక్షల్లో జీతమిచ్చే కంపెనీల చూపు హైదరాబాద్ వైపు..



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : ఒకప్పుడు అనేక పెద్ద కంపెనీలు తమ సంస్థల కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు బెంగళూరును ఎంచుకునేవి. అయితే ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోతున్నాయి. చాలా సంస్థలు ఇప్పుడు హైదరాబాదును తమ బెస్ట్ డెస్టినేషన్ కింద ఎంపిక చేసుకోవటం హైదరాబాదీ యువతకు పెద్ద సదవకాశాన్ని అందిస్తోంది. ఫైనాన్స్ అండ్ బ్యాంకింగ్ రంగంలోని కంపెనీలు ప్రధానంగా మహానగరంపై మనసు పారేసుకుంటున్నాయి.

గ్లోబల్ బ్యాంకింగ్ , ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ దిగ్గజ సంస్థలు భారతదేశంపై దృష్టి సారిస్తున్నాయి. బెంగుళూరు, హైదరాబాద్ వంటి నగరాలతో 2030 నాటికి బిఎఫ్ఎస్ఐ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్‌ల సంఖ్య 120 నుండి 250కి రెట్టింపు అవుతోంది. ఈ క్రమంలో బెంగళూరులో ఇప్పటికే బీఎఫ్ఎస్ఐ జీసీసీలలో దాదాపు 35% వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నాయి. 26% చురుకైన ఉద్యోగార్థులకు డిమాండ్ ఉన్న నైపుణ్యాలు ఉన్నాయి. ఇక 16 జీసీసీలతో హైదరాబాద్, 22 జీసీసీలతో దిల్లీ ఎన్సీఆర్ టాప్ స్థానాల్లో కొనసాగుతున్నాయి. అయితే హైదరాబాద్ నగరంలో 19 శాతం మంది యాక్టివ్ జాబ్ సీకర్స్ కలిగి ఉన్నట్లు కెరీర్‌నెట్ తాజా నివేదిక పేర్కొంది. దేశంలో బీఎఫ్ఎస్ఐ జీసీసీలకు డిమాండ్ ఉన్న నైపుణ్యాలతో కూడిన చురుకైన టాలెంట్ పూల్ ప్రకృతి దృశ్యం' అనే నివేదికలో హైదరాబాద్ కేవలం జీసీసీల షాప్‌ను ఏర్పాటు చేయడానికి మాత్రమే కాకుండా, విస్తరణను నమోదు చేసుకునే వారికి కూడా ప్రాధాన్యత కలిగిన కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొంది. ఈ క్రమంలో హైదరాబాద్ అనేక ప్రయోజనాలను అందిస్తోంది. ఇక్కడ సహాయక వ్యాపార వాతావరణంతో పాటు, టాలెంట్ పూల్ అందుబాటులో ఉండటం హైదరాబాదుకు జీసీసీల ప్రవాహాన్ని పెంచుతోంది. బెంగళూరు ఈ విషయంలో మాత్రం వెనుకబడి రెండవ స్థానంలో నిలిచింది.

ఉద్యోగ అవకాశాల కోసం చురుకుగా వెతుకుతున్న 2,41,623 మంది అభ్యర్థుల నమూనా పరిమాణాన్ని సర్వే చేసింది. బీఎఫ్ఎస్ఐ జీసీసీలలో డిమాండ్‌లో ఉన్న నైపుణ్యాలకు అనుగుణంగా ప్రతిభ సరఫరాను మ్యాప్ చేసింది. 2030 నాటికి 250 బీఎఫ్ఎస్ఐ జీసీసీలు, సుమారు మిలియన్ల బీఎఫ్ఎస్ఐ నిపుణులు భారతదేశాన్ని ప్రపంచ టాలెంట్ హబ్‌గా ఎదగడానికి ముందుకు సాగాలని భావిస్తున్నట్లు కెరీర్‌నెట్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్, నీలభ్ శుక్లా పేర్కొన్నారు. గ్లోబల్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్‌లపై అధిక నియంత్రణ ఆదేశాలు మరియు పరిశీలనలు భారతదేశం వంటి అత్యంత నైపుణ్యం కలిగిన దేశాలలో జీసీసీ సెటప్‌లను ఎక్కువగా ఇష్టపడటానికి ప్రధాన కారణం సరైన నైపుణ్యాలతో టాలెంట్ పూల్ ఉండటమేనని జీసీసీ అడ్వైజరీ అండ్ ఎనేబుల్‌మెంట్ ప్లేయర్ గ్లోప్లాక్స్ సహ-వ్యవస్థాపకుడు అవీక్ ముఖర్జీ పేర్కొన్నారు.

వాట్సాప్‌లో నచ్చిన థీమ్‌తో చాటింగ్..!

హైదరాబాద్, సెప్టెంబర్22 (జనంసాక్షి) : ప్రముఖ ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ వాట్సాప్.. తన యూజర్ల కోసం రోజుకో కొత్త ఫీచర్ పరిచయం చేస్తోంది. తద్వారా వాట్సాప్ ను ఆల్-ఇన్-వన్‌గా రూపొందించడానికి కసరత్తు చేస్తున్నది. యూజర్ల భద్రత కోసం ఇప్పటికే పలు ఫీచర్లు తెచ్చిన వాట్సాప్.. తాజాగా 'థీమ్ చాట్' అనే ఫీచర్ తెచ్చే పనిలో పడింది. ఈ ఫీచర్ సాయంతో యూజర్లు తమ చాటింగ్‌కు వారికి నచ్చిన థీమ్‌లు జోడించవచ్చు. రంగులతోపాటు నచ్చినట్లు వాట్సాప్ యూజర్లు తమ చాట్ పేజీ రూపొందించుకోవచ్చు. యూజర్ల అనుభవం మెరుగు పర్చడంతోపాటు చాటింగ్ మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు ఈ ఫెసిలిటీ తీసుకొస్తోంది వాట్సాప్. అయితే ప్రస్తుతం ఈ ఫీచర్ డెవలపింగ్ దశలోనే ఉందని ఎప్పటిక ప్పుడు వాట్సాప్ అప్ డేట్స్ అందించే వాబీటా ఇన్ఫో తన బ్లాగ్ లో తెలిపింది. త్వరలోనే బీటా యూజర్లకు ఈ ఫీచర్ అందుబాటులోకి వస్తుందని పేర్కొంటూ సంబంధిత స్క్రీన్ షాట్ కూడా షేర్ చేసింది.

వాట్సాప్‌తోపాటు మెటా అనుబంధంగా పని చేసే మరో సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఇన్‌స్టాలో స్టోరీ పోస్టు చేస్తున్నప్పుడు తమకు నచ్చిన వ్యక్తులకు 'ఏ' సాయంతో ట్యాగ్ చేస్తాం. దీనివల్ల అలా ట్యాగ్ చేసిన వ్యక్తులకు మనం స్టోరీ పోస్ట్ చేసినట్లు నోటిఫికేషన్ వెళడం ద్వారా వారంతా ఈ పోస్ట్ చూస్తారు.

శ్రీలంక అధ్యక్షుడిగా డిస్సనాయకే..

- **జాతి ఐక్యతకు పిలుపు..**

కోలంబో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన మార్క్సిస్టు నేత అనురా కుమార డిస్సనాయకే జాతి ఐక్యతకు పిలుపునిచ్చారు. శ్రీలంక నూతన శకం ప్రారంభంలో సింహళులు, తమిళులు, ముస్లింలతో కూడి శ్రీలంకన్ల ఐక్యత ఉంటుందని పేర్కొన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలను సాకారం చేసేందుకు నూతన శకం ప్రారంభం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'నూతన పునర్జీవనం కోసం కృషి చేస్తా' అని పేర్కొన్నారు. శనివారం జరిగిన శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో డిస్సనాయకే (55)కు 42.31 శాతం ఓట్లు వచ్చాయి. రెండో స్థానంలో ప్రతిపక్ష నేత సాజిత్ ప్రేమదాస నిలిస్తే, ప్రస్తుత అధ్యక్షుడు విక్రమసింఘే మూడో స్థానానికి పరిమితం కావడం గమనార్హం. డిస్సనాయకే ఎన్నికను శ్రీలంక ఎన్నికల సంఘం ధృవీకరించింది. సోమవారం శ్రీలంక దేశాధ్యక్షుడిగా డిస్సనాయకే ప్రమాణ స్వీకారం చేస్తారు. శనివారం జరిగిన ఎన్నికల్లో 22 జిల్లాల పరిధిలోని 13,400కి పైగా పోలింగ్ కేంద్రాల్లో 1.70 కోట్ల మంది ఓటర్లలో 75 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొత్తగా దేశాధ్యక్షుడిగా ఎన్నికైన డిస్సనాయకే ప్రభుత్వం.. శ్రీలంకకు ఐఎంఎఫ్ ఇచ్చిన 2.9 బిలియన్ డాలర్ల బెయిలవుట్ ప్యాకేజీ నిబంధనల్లో మార్పులు చేర్పులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ చీఫ్‌గా శుభాంకర్ సర్కార్



కోల్‌కతా, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శుభాంకర్ సర్కార్‌ను ఆ పార్టీ నియమించింది. గతంలో ఈశాన్య రాష్ట్రాలకు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కార్యదర్శిగా ఉన్న ఆయన ప్రస్తుత అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి స్థానాన్ని భర్తీ చేశారు. సర్కార్ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలోని ఆ పార్టీ శనివారం ప్రకటించింది. అలాగే అధిర్ రంజన్ చౌదరి సహకారాన్ని ప్రశంసించింది. బెంగాల్‌లో పార్టీని పునర్నిర్మించడం తన మొదటి ప్రాధాన్యత అని పార్టీ కొత్త చీఫ్ అన్నారు.

కాగా, బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శుభాంకర్ సర్కార్‌ను పార్టీ నియమించడంపై అధిర్ రంజన్ చౌదరి ఆదివారం స్పందించారు. పార్టీ నిర్ణయంపై తనకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. 'దీని గురించి నేను ఏమీ చెప్పదలచుకోలేదు. ఎవరైనా అధ్యక్షుడు కావచ్చు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడ్ని ఎన్నుకునే హక్కు పార్టీ హైకమాండ్‌కు ఉంది. పార్టీ అధ్యక్షుడ్ని హైకమాండ్ ఎంపిక చేస్తే సమస్య ఎందుకు వస్తుంది? నాకేమీ అభ్యంతరం లేదు' అని అన్నారు.

మరోవైపు 2024 లోక్‌సభ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అభ్యర్థి యూసుఫ్ పఠాన్ చేతిలో సొంత స్థానమైన బహరంపూర్‌లో అధిర్ రంజన్ ఓడిపోయారు. ఈ నేపథ్యంలో బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతల నుంచి తనను తప్పించాలని పార్టీ అధిష్టానాన్ని ఆయన కోరారు.

గాజాలో స్కూల్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడి.. ఏడుగురు దుర్మరణం

గాజా, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : గాజా నగరంలోని ఓ స్కూల్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్ సైన్యం దాడుల నేపథ్యంలో మృతులంతా తమ ప్రాణాలను కాపాడుకునేందుకు పాఠశాలలో ఆశ్రయం పొందుతున్నారు. అయితే, పాఠశాల ఆవరణలో ఉగ్రవాదులను ఇజ్రాయెల్ సైన్యం లక్ష్యంగా చేసుకుంది. ఆదివారం ఉదయం సమయంలో కాఫర్ ఖాస్సెమ్ పాఠశాలపై దాడి జరిగిందని పాలస్తీన అధికారులు తెలిపారు. మరణించిన వారిలో హమాస్ పబ్లిక్ వర్క్స్ అండ్ హౌసింగ్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మాజెద్ సలీహ్ సైతం ఉన్నారు. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ ప్రకారం.. దాడి హమాస్ మిలిటెంట్లను లక్ష్యంగా చేసుకున్నామని.. పౌర ప్రాణనష్టాన్ని తగ్గించడానికి వైమానిక నిఘా, ఇతర చర్యలను ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు.

అయితే, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ భవనాలను సైనిక ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నట్లు ఇజ్రాయెల్ చేసిన వాదనలను హమాస్ తిరస్కరించింది. అదే సమయంలో తమ యోధులు ఇజ్రాయెల్ దళాలపై అనేక దాడులు చేశారని హమాస్ సాయుధ విభాగం తెలిపింది. ప్రస్తుతం అవసరమైన విడి భాగాలు, ఇంధనం కొరత కారణంగా అన్ని ఆసుపత్రుల్లో సేవలు పది రోజుల్లో ఆగిపోవచ్చని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. సెంట్రల్ గాజా స్ట్రిప్ నగరమైన డెయిర్ అల్-బలాలో నిర్వాసిత మహిళ మాట్లాడుతూ భారీ వర్షాలు తాత్కాలిక శిబిరాలను కూడా ముంచెత్తాయని ఆవేదన వ్యక్తం చేసింది. రోజంతా వర్షం పడితే పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదని.. కొత్తగా గుడారాలు ఏమీ వద్దని.. యుద్ధం ముగియాలని కోరుకుంటున్నామన్నారు. దాదాపు పది లక్షల మంది ప్రజలు దీర్ అల్-బలాహ్‌లో ఆశ్రయం పొందుతున్నారు.

భూమి వైపుగా దూసుకొస్తున్న ఆస్టరాయిడ్ అపోఫిస్..!

- **దిశ మారితే విధ్వంసం తప్పదంటూ శాస్త్రవేత్తల ఆందోళన..!**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : విశ్వంలో గ్రహశకలం దూసుకెళ్తుంటాయి. వీటికి స్థిరమైన మార్గం, గమ్యం లేకుండా సంచరిస్తుంటాయి. వీటి నుంచి భూమికి ముప్పు పెంచి ఉన్నది. ఇప్పటికే గ్రహశకలాలు భూమి దిశగా దూసుకువచ్చి మండిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. చిన్న చిన్న గ్రహశకలాలు కావడంతో ప్రమాదం తప్పినట్లయ్యింది. అయితే, భారీ గ్రహశకలాలు భూమిని ఢీకొడితే విధ్వంసం తప్పదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. తాజాగా భారీ గ్రహశకలం భూమికి దగ్గరగా రాబోతున్నది. ఈ గ్రహశలం పేరు అపోఫిస్. దీనికి 'గాడ్ ఆఫ్ డిస్ట్రాక్షన్' పేరు కూడా ఉన్నది. ఈ గ్రహశకలానికి ఈజిప్ట్‌కు చెందిన అపెప్ దేవుడి పేరు పెట్టారు. అయితే, ఈ ఆస్టరాయిడ్ 2029లో భూమికి అత్యంత సమీపంలోకి రానున్నది.

కేవలం 30,600 కిలోమీటర్ల దూరం నుంచి వెళ్తుందని పేర్కొన్నారు. ఈ గ్రహశకలాన్ని నేరుగా కంటితో చూడవచ్చని చెప్పారు. అపోఫిస్ ఆస్టరాయిడ్ మరికొన్ని చిన్న గ్రహశకలాలను ఢీకొట్టుకుంటూ వెళ్తే తన మార్గాన్ని మార్చుకునేందుకు అవకాశం ఉందని తాజాగా పరిశోధనల్లో తేలిందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో భూమి వాతావరణంలోకి ప్రవేశించే అవకాశాలు లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆస్టరాయిడ్ 1230 అడుగుల వెడెల్పు.. దాదాపు మూడున్నర ఫుట్‌బాల్ మైదానాల విస్తీర్ణానికి సమానంగా ఉంటుందని పేర్కొన్నారు. దాంతో ఈ గ్రహశకలం భూమిని ఢీకొంటే భారీ విధ్వంసం ఏర్పడుతుందని.. అయితే, ఇలా జరిగేందుకు చాలా తక్కువ అవకాశాలు మాత్రమే ఉన్నాయన్నారు. ఇందులో ఏమాత్రం భయపడాల్సిన అవసరం లేదన్నారు. గ్రహశకలం భూమిని తాకే అవకాశాలు చాలా తక్కువ అని అధ్యయనం రచయిత యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్రన్ అంటారియో ఖగోళశాస్త్రవేత్త పాల్ వీగెర్ట్ పేర్కొన్నారు.

2029లో.. ఆ తర్వాత భవిష్యత్‌లో భూమిని ఢీకొట్టే మార్గంలో మరో గ్రహశకలం అపోఫిస్‌ను ఢీకొట్టే అవకాశం మిలియన్‌లో ఒకటి మాత్రమేనని.. చిన్న గ్రహశకలమైనా అపోఫిస్ మార్గాన్ని ప్రమాదకరంగా మారుస్తుందని పేర్కొన్నారు. ఈ గ్రహశకలం 2029లో భూమికి దగ్గరగా వస్తుందని.. ఈ క్రమంలో చిన్న గ్రహశకలాలను ఢీకొట్టే అవకాశం ఉందన్నారు. ఈ గ్రహశకలాన్ని 2004లో గుర్తించారు. ఈ ఆస్టరాయిడ్ భూమిని ఢీకొట్టేందుకు అవకాశం ఉందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. తాకే అవకాశాలు తక్కువగానే ఉన్నా.. ఢీకొట్టే అవకాశాలను తోసిపుచ్చేందుకు అవకాశం లేదన్నారు. ఆస్ట్రాయిడ్ పేరు అపోఫిస్ 99942. ఇది ప్రమాదకరమైన ఆస్టరాయిడ్స్‌లో అగ్రస్థానంలో ఉన్నది.

భోజనం ప్యాకెట్లో చిట్టెలుక..

- **విమానం అత్యవసర ల్యాండింగ్..!**

నార్వే, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : బాంబు బెదిరింపు కారణంగానో, విమానంలో ఎవరైనా అస్వస్థతకు గురైతేనో, విమానాన్ని పక్షి ఢీకొడితేనో పలు విమానాలను అత్యవసరంగా ల్యాండ్ చేస్తారన్న విషయం అందరికీ తెలుసు. ఒక చిన్న ఎలుక కారణంగా విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేయడం గురించి ఎప్పుడైనా విన్నారా..? కానీ నార్వేలో అదే జరిగింది. చిట్టెలుక కారణంగా విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది.

నార్వేలోని ఓస్లో నుంచి స్పెయిన్‌లోని మాలాగాకు స్కాండినేవియన్ ఎయిర్‌లైన్స్ సంస్థకు చెందిన విమానం బయలుదేరింది. ప్రయాణికులకు విమాన సిబ్బంది భోజనం ప్యాకెట్లు అందించారు. ఓ ప్రయాణికురాలు తన భోజనం ప్యాకెట్ విప్పి షాక్‌కు గురైంది. ఎందుకంటే ఆ ప్యాకెట్‌లో నుంచి ఓ చిట్టి ఎలుక బయటకు దూకింది. కళ్లు తెరిచి మూసేలోగా ఆ చిట్టెలుక పారిపోయింది.

అంతే విమానంలోని ప్రయాణికులతోపాటు సిబ్బంది సైతం నానా హైరానా పడ్డారు. ఆ చిట్టెలుక విమానంలోని వైర్లను కొరికితే తమ ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయేవని వారంతా ఆందోళన వ్యక్తంచేశారు. విమాన సిబ్బంది ఓస్లో ఎయిర్‌పోర్ట్ ఉన్నతాధికారులకు జరిగిన ఘటనను గురించి వివరించారు. వారి సూచన మేరకు కోపెన్‌హాగన్‌కు విమానాన్ని మళ్లించారు. అక్కడి ఎయిర్‌పోర్ట్‌లో విమానాన్ని ల్యాండ్ చేశారు.

అనంతరం విమానంలోని ప్రయాణికులను మరో విమానంలో గమ్యస్థానానికి పంపినట్లు స్కాండినేవియన్ ఎయిర్‌లైన్స్ సంస్థకు చెందిన ఉన్నతాధికారి వెల్లడించారు. ప్రయాణికులతో పాటు సిబ్బంది భద్రత తమకు అత్యంత ముఖ్యమని ఆ ఉన్నతాధికారి స్పష్టం చేశారు. అదే విధంగా ఇటువంటి ఘటనలు చాలా అరుదుగా చోటు చేసుకుంటాయని చెప్పారు. విమానంలో ఎలుక కోసం ముమ్మరంగా గాలించినట్లు తెలిపారు. ఆహారం సరఫరా చేసిన సంస్థను విచారిస్తామన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
23 సెప్టెంబర్ 2024
తెలంగాణ

కాంట్రాక్టు కార్మికులను గుర్తించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది

• సుమారు 25 వేల మందికి రు. 5 వేలు ప్రకటన : ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి, సెప్టెంబర్ 22 (జనంసాక్షి):
ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వారిని ఎవరూ పట్టించుకోలేదని, సింగరేణి సంస్థలో సుమారు 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి 5 వేల రూపాయలను ఈ వార్షిక సంవత్సరానికి ప్రకటించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యఅన్నారు.రాష్ట్ర ప్రభుత్వం 2023 వార్షిక సంవత్సరం లాభాల వాట సింగరేణి ఉద్యోగస్తులకు, కాంట్రాక్ట్ ఉద్యోగస్తులకు బోనస్ ప్రకటించిన సందర్భముగా కే ఓసి లో కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఐ ఎన్ టి యు సి కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐ ఎన్ టి యు సి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 వార్షిక సంవత్సరం లాభాల వాటా సింగరేణి ఉద్యోగస్తులకు, కాంట్రాక్ట్ కార్మికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, సింగరేణి చైర్మన్ ఎన్. బలరాం ప్రకటించడం, ఐఎన్టియుసి యూనియన్ సెక్రటరీ జనరల్, మినిమం వేజ్ కమిటీ చైర్మన్ జనక్ ప్రసాద్ కృషి ఫలితమేనన్నారు. 2023-24 సంవత్సరానికి గాను కంపెనీకి వచ్చిన లాభాల వాటా నుండి పర్మినెంట్ కార్మికులకు 33% లాభాల వాటాను సింగరేణి సంస్థ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం ప్రకటించడం జరిగిందన్నారు. ప్రజాపాలనలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం కోల్బెల్టు ఎమ్మెల్యేలతో పాటు సింగరేణి కార్మికుల హక్కుల కోసం వారికి న్యాయపరంగా రావాల్సిన ప్రతి హక్కును వచ్చే విధంగా చూస్తామని వారి భావాలను దృష్టిలో పెట్టుకొని వారికి రావలసిన ప్రతి హక్కును నెరవేరుస్తామని తెలిపారు. సింగరేణి ఉద్యోగస్తులకు కూడా సొంత ఇంటి పథకం, పెరిక్స్ మీద ఇన్కమ్ టాక్స్, రియంబర్స్మెంట్ తదితర అంశాలపై యూనియన్ నాయకులతో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, సింగరేణి మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చైర్మన్ ఎన్ బలరాం చర్చలు జరుగుతున్నాయనిఎమ్మెల్యే తెలిపారు. సింగరేణిలో ఉన్నటువంటి మైన్స్ పర్మిషన్స్ కోసం నైని బ్లాక్ మైన్ పర్మిషన్ కోసం డిప్యూటీ సీఎం సింగరేణి చైర్మన్ లతోపాటు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రంలో ఉన్నటువంటి కోల్ మంత్రులు ప్రధానమంత్రిని కూడా కలిసి సింగరేణిలో ఉన్నటువంటి అన్ని మైన్స్ కు పరిమిషన్స్ ఇవ్వాలని కోరడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఇల్లందు ఏరియాలో ఉన్న పూసపల్లి మైన్ కు ఫారెస్ట్ క్లియరెన్స్ కూడా వారు స్వయంగా వెళ్లి కేంద్ర మంత్రులను కలిసిన ఫలితంగా ఈనెల లో 23 వ తారీఖున పూసపల్లి మైన్స్ కు క్లియరెన్స్ కూడా రాబోతుందని తెలిపారు ఐ ఎన్ టి యు సి యూనియన్, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ ఫలాలను అనుభవిస్తున్న కొంతమంది కార్మికులు ఐ ఎన్ టి యు సి యూనియన్ లోకి కే ఓసి నుండి పెద్ద ఎత్తున ఈ నెలలో జరిగిన మీటింగ్లో చేరిన వారిని ఈ సందర్భంగా పరిచయం చేశారు. వారిలో బిక్షపతి బద్రు దేవ్ జి రామారావు శివ బాలాజీ రమేష్ లను ఎమ్మెల్యే సమక్షంలో ఐ ఎన్ టి సి లో చేరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఏరియా వైస్ ప్రెసిడెంట్ జె వెంకటేశ్వర్లు, ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మహబూబ్, ఇల్లందు ఏరియా బ్రాంచ్

సెక్రటరీ భూక్య నాగేశ్వరరావు, ఈరియా,సందీప్ , జీవరత్నం , రాకేష్ , జంపయ్య , సంతోష్, ఐఎన్టియుసి చీప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కంకిపాటి రామారావు, కే ఓ సి అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ రాములు, బాసు, జీకే ఓసి ఫిట్ సెక్రటరీ నవీన్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ బాబురావు, వర్క్ మేన్ ఇన్స్పెక్టర్ మేకల శంకర్,వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ మైనింగ్ సత్యనారాయణ,షిఫ్ట్ ఇన్చార్జిలు, క్లబ్ సెక్రటరీ, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు , సేఫ్టీ కమిటీ సభ్యులు, మైన్స్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐఎన్టియుసి యూనియన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం..

- లాభాల వాట చెల్లింపులో అన్యాయం..
- రామగుండం మాజీ శాసనసభ్యులు, జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్..

గోదావరిఖని, జనం సాక్షి:
సింగరేణి కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి నట్టేట ముంచారని రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలోని ప్రజలందరినీ మోసం చేస్తూ వస్తున్న కాంగ్రెస్ సర్కారు సింగరేణి కార్మికుల చెమట కష్టాన్ని దోచుకుందనని మండిపడ్డారు. 2023-24 సంవత్సరానికి సింగరేణి సంస్థకు 24,701 కోట్ల నికర లాభం వస్తే అందులో కేవలం రూ.796 కోట్లు కార్మికులకు ఇచ్చి 33 శాతం ఇచ్చామని అబద్దాలు చెబుతోందని విమర్శించారు. సింగరేణి సంస్థ 2022-23 వార్షిక సంవత్సరంలో 72,222 కోట్లు లాభాలు ఆర్జిం చిందని చెప్పారు. అదే 2023-24 వార్షిక సంవత్స రానికి 74,701 కోట్లు నికర లాభం వచ్చినట్లు ప్రభు త్వం పేర్కొన్నదని, అందులో కార్మికులకు 33శాతం వాటా అంటే ?1,550 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంద న్నారు. కానీ కేవలం 796 కోట్లు మాత్రమే ఇవ్వడం ఎమిటని ప్రశ్నించారు. ప్రతి కార్మి కుడికి లాభాల్లో వాటా కింద ?4లక్షలు రావాల్సి ఉం దని, కానీ ప్రభుత్వం చేసిన మోసానికి ఒక్కొక్కరికి ?2ల క్షలు లాభాలు తగ్గించబడ్డాయని ఆరోపించారు. గత 15 ఏళ్లలో ఈసారే అత్యంత తక్కువ మొత్తంలో (కేవలం 16.9%) లాభాలు కార్మికులకు అందాయని తెలిపారు. 2023-2024వచ్చిన లాభాలు - రూ. 4,701 కోట్లు కాగా కార్మికులకు పంచిన వాటా రూ. 796 కోట్లని వాటా 16.90 శాతం , 2022-23 వచ్చిన లాభాలు - రూ. 2,222 కోట్లు కాగా కార్మికులకు పంచిన వాటా 700 కోట్లు వాటా 32 శాతం 2021-2022వచ్చిన లాభాలు 1227 కోట్లు కాగా కార్మికులకు పంచిన వాటా 368 కోట్ల వాటా 30 శాతం 2020-21 వచ్చిన లాభాలు 272.64 కోట్లు కాగా కార్మికులకు పంచిన వాటా 79.07 కోట్లు వాటా 29శాతం 2019-20 వచ్చిన లాభాలు - రూ. 993 కోట్లు కాగా కార్మికులకు పంచిన వాటా 278 కోట్ల వాటా 28 శాతం, 2018-19 వచ్చిన లాభాలు 1765 కోట్లు కాగా కార్మికులకు పంచిన వాటా 494 కోట్ల వాటా 28 శాతం, 2017-18 వచ్చిన లాభాలు - రూ. 1212 కోట్లు కార్మికులకు పంచిన వాటా 327 కోట్లు కాగా వాటా 27 శాతం 2016-17వచ్చిన లాభాలు - రూ. 395 కోట్లు కాగా కార్మికులకు పంచిన వాటా 99 కోట్లు వాటా శాతం - 25 %2015-16 వచ్చిన లాభాలు - రూ. 1066 కోట్లు కార్మికులకు పంచిన వాటా 245 కోట్లు వాటా 23 శాతం 2014-15 వచ్చిన లాభాలు - రూ. 490కోట్లని కార్మికులకు పంచిన వాటా 103 కోట్లువాటా 21 శాతం మని పెర్కొన్నారు. ప్రభుత్వ మోసంతో ఒక్కో కార్మికుడికి రూ.2లక్షల మోసం జరుగుతుందని కార్మికులకు న్యాయంగా రావాల్సిన రూ.1,550 కోట్ల లాభాలను పంచాలని డిమాండ్ చేశారు.

కార్యదర్శి ప్రమోద్ కుమార్ సేవలు ఆదర్శనీయం..

మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నేత బండారి రమేష్
- కార్యదర్శి ప్రమోద్ కు ఘన సన్మానం

సుల్తానాబాద్,సెప్టెంబర్ 22(జనంసాక్షి) :
మండలంలోని గొల్లపల్లి గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహించిన కార్యదర్శి ప్రమోద్ కుమార్ సేవలు ఆదర్శనీయమని మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బండారి రమేష్ కొనియాడారు. బదిలీపై వెళ్లిన కార్యదర్శి ప్రమోద్ కుమార్ ను గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బండారి రమేష్ తో పాటు పాలకవర్గ సభ్యులు ప్రమోద్ కుమార్ సేవలను కొనియాడుతూ ఆదివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నేత బండారి రమేష్ మాట్లాడుతూ విధి నిర్వహణలో గొల్లపల్లి కార్యదర్శిగా ప్రమోద్ కుమార్ గ్రామ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో ముందుండి రాత్రి పగలనక తన సేవలు చేశారన్నారు. కార్యదర్శిగా ప్రమోద్ కుమార్ పనిచేసిన సమయంలో గొల్లపల్లి గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బండారి రమేష్ స్పష్టం చేశారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని కూడా కార్యదర్శి తనదైన శైలిలో పట్టుదలతో విధులు నిర్వహించి ఆదర్శంగా నిలిచారని, బదిలీలు సహజమని బదిలీపై వెళ్లిన ప్రమోద్ కుమార్ చేసిన సేవలు ఎప్పటికీ మరువలేవని తిరిగి మంచి హోదాలో ప్రమోషన్ పొందాలని బండారి రమేష్ కోరారు. అనంతరం పాలకవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంపత్, రమేష్ ,రాజు, అంజి ,కుమార్, లక్ష్మయ్య ,శంకర్ ,రజిత ,సంపత్ రావు ,రవి తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

కరీంనగర్ సైక్లిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టేడియంలో హాఫ్ మారథాన్ కార్యక్రమం

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :
ఆధునిక జీవితంలో ఆరోగ్యంగా ఉండేందుకు రోజుకో గంట తప్పనిసరిగా వ్యాయామం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.కరీంనగర్ సైక్లిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రోజు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో హాఫ్ మారథాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నిత్యం రన్నింగ్ చేస్తే శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతామని ప్రతి ఒక్కరూ కనీసం నిత్యం 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని పేర్కొన్నారు. నగరవాసులకు ఫిట్ నెస్ పై అవగాహన కల్పించేందుకు మారథాన్ కార్యక్రమాన్ని 3కె, 5కె, 10కె, 21కె విడతలుగా నిర్వహించినట్లు సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఐవీ స్కూల్ విద్యాసంస్థల అధినేత పసుల మహేష్ పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు, విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో నగర ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ చహత్ బాజ్ పాయ్, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కేడెట్లు, ఎన్ సీ సీ తో పాటు ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ, శ్రీ చైతన్య డిఫెన్స్ అకాడమీ, వివిధ పాఠశాలల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

మహిపాల్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన దాసరి ఉష

సుల్తానాబాద్,సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :
మండలంలోని రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు అన్నాడి మహిపాల్ రెడ్డి గుండెపోటుతో మరణించడంతో ఆదివారం బిఆర్ఎస్ పెద్దపల్లి నియోజక వర్గ నాయకురాలు దాసరి ఉష మహిపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్ల మనోహర్ రెడ్డి ,సింగిల్ విండో చైర్మన్ గడ్డం మహిపాల్ రెడ్డి ,నిశాంత్ రెడ్డి ,గుర్రం మల్లారెడ్డి ,మోహన్ రెడ్డి ,మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్ ,తడిగొప్పుల శ్రీనివాస్ ,మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి ,తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి సహకరించిన పాలక వర్గానికి ప్రజలకు కృతజ్ఞతలు

- మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నేత బండారి రమేష్

సుల్తానాబాద్,సెప్టెంబర్ 22(జనంసాక్షి) :
గడచిన ఐదు సంవత్సరాల కాలంలో సర్పంచ్ గా తనతో పాటు సహకరించి గొల్లపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయుటకు సహకరించిన గొల్లపల్లి గ్రామ పంచాయతీ పాలక వర్గానికి మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ నేత బండారి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులను బండారి రమేష్ శాలువాతో ఘనంగా సన్మానించారు.

నాణ్యమైన, విలువలతో కూడిన విద్య కోసం కృషి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కడారి అనంతరెడ్డి

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి 2025 మార్చిలో జరిగే శాసనమండలి ఎన్నికలకు పోటీ చేస్తున్నట్లు మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంత రెడ్డి ప్రకటించారు. ఆదివారం ఓ హోటల్ లో విలేఖరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ట్రాస్మా తెలంగాణ జూనియర్, డిగ్రీ కళాశాలల సంఘాలతో పాటు కేంద్రమంత్రులు బండి సంజయ్‌కుమార్, జి.కిషన్‌రెడ్డిలను కలిసానని మండలి ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్ తనకు వస్తుందని బీజేపీ మద్దతుతో వచ్చే ఎన్నికల్లో గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి టికెట్టు రాకపోతే ఇండిపెండెంట్ గా కూడా సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సభ్యత్వం నమోదును చేపట్టి, వారు తమ ఫ్రాంచైజీని వినియోగించుకునేలా చూసుకోవాలని అన్నారు. సెప్టెంబర్ 30 నుంచి ఉపాధ్యాయ నియోజకవర్గానికి ప్రైవేట్ ఉపాధ్యాయులను ఓటర్లుగా చేర్పించేందుకు ఫారం 19ని పంపిణీ చేసి నింపుతామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి తన దార్శనికత గురించి చెబుతూ.. తాను ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని చెప్పారు. గత కొంతకాలంగా ప్రభుత్వ పాఠశాలలు మౌలిక సదుపాయాల కొరత, సరిపడా సబ్జెక్ట్ టీచర్లు వంటి అనేక సమస్యలతో సతమతమవుతున్నాయని, మంచి మౌలిక సదుపాయాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, మంచి అర్హత కలిగిన ఉపాధ్యాయులు అందుబాటులో ఉండటం వల్ల విద్యార్థులను మార్చగలవని అన్నారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలకు విద్యుత్ సరఫరా, ఆస్తిపన్ను ఇవ్వడం ద్వారా ప్రభుత్వం బడ్జెట్‌లో కొన్ని రాయితీలు కల్పించాలని, జీఓ 317 సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, శాసన మండలిలో ఈ అంశాన్ని లేవనెత్తడం ద్వారా ఎమ్మెల్సీగా ఎన్నికైతే నాణ్యమైన, విలువలతో కూడిన విద్య కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. అనిల్‌కుమార్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ట్రాస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, జిల్లా నాయకులు సుధాకర్ రెడ్డి, ఎ. రామచంద్రారెడ్డి, బి.మధుసూధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్ బీ పార్టీలో సురేందర్ సన్నీ చేరిక

పెద్దపల్లి,సెప్టెంబర్ 22(జనంసాక్షి) :
ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో దళిత, ప్రాజా సంఘాల నాయకుడు బొంకూరి సురేందర్ సన్నీ చేరారు. కరీంనగర్ లో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బండ శేఖర్ ఆద్వర్యంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్ రెడ్డి సన్నీకి ఆదివారం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా సన్నీ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీలోకి ఆహ్వానించిన బండ సురేందర్ రెడ్డి, బండారి శేఖర్ లకు సురేందర్ సన్నీ కృతజ్ఞతలు తెలిపారు.

అఖిలపక్ష కుల సంఘాల రాష్ట్ర సదస్సులో పాల్గొన్న తాళ్లపల్లి మనోజ్ గౌడ్

సుల్తానాబాద్,సెప్టెంబర్ 22(జనంసాక్షి) :
జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాదు లో ఏర్పాటుచేసిన అఖిలపక్ష కుల సంఘాల రాష్ట్ర సదస్సు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించగా వి హనుమంతరావు మధుసూదనా చారి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ తదితరులు హాజరైన సదస్సుకు పెద్దపల్లి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ హాజరయ్యారు. భవిష్యత్ కార్యాచరణ బిసి సంఘాల హక్కుల సాధన తదితర అంశాలపై కార్యాచరణ ప్రణాళిక పై సమావేశంలో చర్చించినట్లు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ తెలిపారు.

ప్రజ్ఞా వికాస్ వారి రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థినికి ప్రశంసా పత్రం

పెద్దపల్లి,సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :
ప్రజ్ఞా వికాస్ - ట్రస్మా ఆధ్వర్యంలో శనివారం ముచ్చింతల్ లోని చినజీయర్ స్వామి వారి ఆశ్రమంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ కి చెందిన 9వ తరగతి విద్యార్థిని చంద్రకారి లయవర్ధిని పాల్గొని చిన జీయర్ స్వామి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్లు గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మా పాఠశాలలో విద్యార్థులలో దాగి ఉన్న లేఖన, చిత్ర కళలు, ఆటలు తదితర కళలను వెలికి తీసే ప్రయత్నంలో భాగంగా పలు రకాల పోటీలకు విద్యార్థినీ విద్యార్థులను సమాయత్తం చేయడం వల్లనే ఈ విధంగా మా పాఠశాల పిల్లలు పలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటి మా పాఠశాలకు,వారి తల్లిదండ్రులకు గొప్ప పేరును తీసుకొనిరావడం ఆనందంగా ఉందన్నారు. ప్రశంసా పత్రం సాధించిన విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ- శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందించిన నారాయణపూర్ గ్రామ ప్రజలు

సుల్తానాబాద్,సెప్టెంబర్ 22(జనంసాక్షి) :
ఇటీవల కాలంలో నారాయణపూర్ గ్రామానికి చెందిన చీకటి ఓదెలు అనారోగ్యంతో మృతిచెందగా, ఓదెలు భార్య నరసమ్మ తీవ్ర అనారోగ్యానికి గురై పని చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండడంతో వారి దీన పరిస్థితిని గమనించిన నారాయణ పూర్ గ్రామ ప్రజలు మాజీ ఎంపీటీసీ సభ్యులు మండల రమేష్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని అందించి తమ సేవా భావాన్ని చాటి చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యులు మండల రమేష్ మాట్లాడుతూ నారాయణపూర్ గ్రామ ప్రజలు అనారోగ్యానికి గురై పనిచేసే స్థితిలో లేకుంటే గ్రామస్తులు అందరూ ఏకమై ఆదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మంగళంపల్లి భానుచందర్ మారేడుగొండ సాది కాల్వ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏగోలపు సదయ్య గౌడ్ కు జీవిత సాఫల్య పురస్కారం

సుల్తానాబాద్,సెప్టెంబర్ 22(జనంసాక్షి) :
ఏగోలపు కుమార్ గౌడ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాల నుండి చేస్తున్న సేవాకార్యక్రమాలకు గాను కరోన విపత్కర సమయంలో చేసిన సేవలను గుర్తించి ఆదివారం హైదరాబాద్ తిలక్ రోడ్డు లోని డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు కళామదిరం, తెలంగాణ సారస్వత పరిషత్ భవనంలో ఆదర్శ కళానిలయం 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదర్శ కళానిలయం అధ్యక్షులు చర్ల ప్రకాష్ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భూక్య రాంరెడ్డి ఐపీఎస్ ఎస్పీ సిఐడి,సినిమా అండ్ టీవీ ఆర్టిస్ట్ రాజేంద్ర కుమార్,జబర్దస్త్ నవిన్, జబర్దస్త్ అప్పారావు, జబర్దస్త్ వినోద్,సింగర్ ఉష,సినిమా టీవీ ఆర్టిస్టు గణేష్ రెడ్డి చేతుల మీదుగా ఏగోలపు కుమార్ గౌడ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు ఏగోలపు సదయ్య గౌడ్ కు ఆదర్శ జీవిత సాఫల్య పురస్కారం, ప్రశంస పత్రం ఇచ్చి శాలువా ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు ఏగోలపు సదయ్య గౌడ్ మాట్లాడుతూ కరోన విపత్కర సమయంలో చేసిన సేవలను గత 20 సంవత్సరాల నుండి చేస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసిన ఆదర్శ కళానిలయం సంస్థ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సింగరేణి లాభాల వాటా అంకెల గారడీలా ఉంది

ఆర్జీ-2 టీబీజీకెఎస్ ఉపాధ్యక్షులు అయిలి శ్రీనివాస్

యైటింక్లయిన్ కాలనీ సెప్టెంబర్ 22 (జనంసాక్షి) :
సింగరేణి లాభాలవాటా అంకెల గారడీగా ఉందని టీబీజీకెఎస్ ఏరియా డివిజన్ ఉపాధ్యాక్షుడు అయిలీ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఓసీపీ-3 ప్రాజెక్టును సందర్శనలో భాగంగా ఆయన కార్మికులను కలుసుకుని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ సంఘాలు కార్మికులను అంకెల గారడీతో మాయమాటలు చెప్పి మోసం చేయాలని చూస్తున్నారన్నారు. అందులో భాగంగానే సింగరేణి వాస్తవ లాభాలు 4701 కోట్లుగా ప్రకటించినప్పటికీ ప్రభుత్వం సింగరేణి మానుగడ కోసమని 2780 కోట్ల రూపాయలు పక్కకు పెట్టి మిగతా డబ్బులను 33 శాతంగా పెంచి ఇస్తున్నామని చెప్పడం సిగ్గుచేటని గతంలో టీబీజీకేఎస్ సంఘం సింగరేణిలో అధికారం సాధించినప్పుడు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒప్పించి వాస్తవ లాభాలను కార్మికులకు అందించడం జరిగిందన్నారు. మా హయాంలో 17వేల రూపాయలు లాభాల వాటా అందుకునే కార్మికుడికి లక్ష డెబ్బై వేల రూపాయల వరకు ప్రతి కార్మికుడికి అందే విధంగా ఇచ్చామని కానీ ఇప్పుడు గెలిచిన సంఘం, ప్రాతినిధ్య సంఘం, సింగరేణి సంస్థ, కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి కార్మికులను అంకెల గారడీతో మోసం చేయాలని చూస్తున్నారని సింగరేణి ప్రాంతంలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించినందుకు కార్మిక లోకానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే బహుమతిలా ఉందని కాంగ్రెస్ ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ సంఘాలు కలిసి సింగరేణిని నష్టాలలోకి నెట్టి ప్రైవేటీకరణ చేయాలని చూసే యోచనల కనబడుతుందోన్నారు. ఇప్పటికైనా కార్మిక లోకం జాతీయ సంఘాలను గనులపై నిలదీయాలని ప్రాంతీయ సంఘంగా ఉన్న తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గెలిస్తేనే మళ్లీ సింగరేణి కార్మికులకు భవిష్యత్ ఉంటుందని రేపటి నుంచి సింగరేణి సంస్థ, గెలిచిన సంఘం, కాంగ్రెస్ ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చే విధంగా కార్యాచరణ మా అధినాయకత్వం

నిర్ణయించిందని రేపు అన్ని గనులపై నల్ల బ్యాడ్జీలతో నిరసన, జిఎం ఆఫీస్ ఎదుట ధర్నా కార్యక్రమాలు మరసటి రోజు జాతీయ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహన కార్యక్రమం చేస్తూ కార్మికుల పక్షాన పోరాటం చేస్తామని, కార్మికులందరూ పార్టీలకు అతీతంగా పాల్గొని నిరసనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

చెపాక్‌లో అద్భుత విజయం..!

రెండో టెస్టుకు స్క్వాడ్ ఇదే..!

చెపాక్ టెస్టులో తొలి రోజు నుంచే పట్టుబిగించిన టీమిండియా నాలుగో రోజే మ్యాచ్ ముగించింది. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తద్వారా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పట్టికలో భారత జట్టు అగ్రస్థానాన్ని కాపాడుకుంది. అదే ఊపులో సెప్టెంబర్ 27న జరుగబోయే రెండో టెస్టులో కూడా విజయంపై రోహిత్ సేన కన్నేసింది. అయితే.. కాన్పూర్ వేదికకానున్న ఈ టెస్టులో టీమిండియా ఏ మార్పులు చేయడం లేదు. తొలి టెస్టుకు ఎంపిక చేసిన బృందాన్ని కొనసాగించాలని సెలెక్టర్లు భావించారు. దాంతో, దులీప్ ట్రోఫీలో ఆడుతున్న శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లకు నిరీక్షణ తప్పలేదు. టీమిండియా స్క్వాడ్ : రోహిత్ శర్మ(కెప్టెన్), యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), అశ్విన్, జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, సిరాజ్, అకాశ్ దీప్, జస్ప్రీత్ బుమ్రా, యశ్ దయాల్.

స్పిన్ ద్వయం జోరు

సుదీర్ఘ విరామం తర్వాత.. అది కూడా స్వదేశంలో టెస్టు సిరీస్ ఆడిన భారత జట్ట అద్భుత విజయం సాధించింది. చెపాక్ స్టేడియంలో రవిచంద్రన్ అశ్విన్(113, 6/88), రవీంద్ర జడేజా(86, 3/58)ల ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టగా.. యువకెరటాలు శుభ్‌మన్ గిల్(119 నాటౌట్), రిషభ్ పంత్(109)లు శతకాలతో విజృంభించారు. 515 పరుగుల ఛేదనలో బంగ్లాదేశ్ రెండు సెషన్లలోనే కుప్పకూలింది. శతక వీరుడు అశ్విన్ ధాటికి నిలువలేక పర్యాటక బ్యాటర్లు చేతులెత్తేశారు. జడేజా కూడా ఓ చేయి వేయడంతో బంగ్లాదేశ్ 234 పరుగులకే ఆలౌటయ్యింది. ఆ జట్టు కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంటో(82) ఒక్కడే అర్ధ శతకంతో రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో చిరస్మరణీయ సెంచరీతో పాటు రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లతో చెలరేగిన అశ్విన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

విడాకుల తర్వాత తొలిసారి కుమారుడితో పాండ్యా సంబురం..!

పొట్టి ప్రపంచ కప్ హీరో, భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పుత్రోత్సాహంలో మునిగిపోయాడు. ఎందుకో తెలుసా..? దాదాపు రెండు నెలల తర్వాత కుమారుడు అగస్త్యను కలిశాడు. నటాషా స్టాంకోవిక్‌తో విడాకుల తర్వాత పాండ్యా తన వారసుడు అగస్త్యతో మొదటిసారి విలువైన సమయం గడిపాడు. ప్రస్తుతం ఆ వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అవుతోంది. రెండు నెలల తర్వాత కన్నకొడుకును చూసిన పాండ్యా సంబురానికి హద్దే లేకుండా పోయింది. మురిపెంగా అగస్త్యను ఎత్తుకున్న పాండ్యా అతడిని ఆడిస్తూ తాను కూడా ఓ పిల్లాడై పోయాడు. అగస్త్యను ఎత్తుకొని మనసారా నవ్వుతూ తండ్రితనాన్ని ఆస్వాదించాడు. ఈ ఏడాది జూలైలో హార్దిక్, నటాషాలు విడాకులు తీసుకున్నారు. అయితే.. విడిపోవడానికి ఫలానా కారణం అంటూ ఏమీ చెప్పకుండానే బ్రేకప్ చెప్పేసుకున్నారు. అలా నాలుగేండ్ల బంధాన్ని అర్థాంతరంగా ముగించారు. ఆ వెంటనే నటాషా కుమారుడు అగస్త్యను తీసుకొని తన స్వదేశం అయిన సెర్బియాకు వెళ్లింది. దాదాపు రెండు నెలల తర్వాత నటాషా మళ్లీ భారత్‌కు వచ్చింది. ముంబైలో బాయ్‌ఫ్రెండ్‌తో షికారు చేస్తున్న ఫొటోలు వైరల్ అయిన విషయం తెలిసిందే. శ్రీలంక పర్యటనలో పెద్దగా రాణించని పాండ్యా ఇక టెస్టుల్లో పునరాగమనంపై కన్నేశాడు. బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ స్క్వాడ్‌కు ఎంపికవ్వక పోవడంతో అతడు రెడ్ బాల్ క్రికెట్‌పై దృష్టి పెట్టాడు. 2018లో ఆఖరి టెస్టు మ్యాచ్ ఆడిన అతడు మళ్లీ తెలుపు జెర్సీ వేసుకోవాలనే కసితో ఉన్నాడు. అందులో భాగంగానే ఈ ఆల్‌రౌండర్ బరోడా జట్టు తరఫున దేశవాళీ క్రికెట్ ఆడేందుకు సిద్ధమవుతున్నాడు.

టీ20లు అస్సలు నచ్చవు..!

నాకు ఇష్టమైన ఫార్మాట్ అదే..!

ఈ కాలపు విధ్వంసక ఓపెనర్లలో ట్రావిస్ హెడ్ ఎంత ప్రమాదకరమో తెలిసిందే. క్రీజులో ఉన్నంతసేపు తుఫాన్‌లా చెలరేగే అతడు స్కోర్‌బోర్డును రాకెట్ వేగంతో ఉరికిస్తాడు. తాజాగా ఇంగ్లండ్‌పై కూడా ఈ డాషింగ్ బ్యాటర్ సుడిగాలి ఇన్నింగ్స్‌లతో అదరగొడుతున్నాడు. అన్నిరకాల షాట్లతో అలరించే హెడ్‌కు ఇష్టమైన ఫార్మాట్ ఏదో తెలుసా.. టెస్టులే. అవును.. ఈ విషయాన్ని అతడే స్వయంగా వెల్లడించాడు. ఇంగ్లండ్ గడ్డపై వన్డేల్లో శతకంతో మెరిసిన హెడ్ మ్యాచ్ అనంతరం.. 'నాకు టీ20ల కంటే టెస్టు ఫార్మాట్ అంటేనే ఇష్టం' అని చెప్పేశాడు. పొట్టి ఫార్మాట్‌లో పెట్రేగిపోయే అతడేనా ఆ మాట అన్నది అని ఆశ్చర్యపోతున్నారా? అయితే.. ఇది చదవాల్సిందే. 'నేను టీ20ల కంటే టెస్టు క్రికెట్ ఆడడాన్ని ఎక్కువగా ఆస్వాదిస్తాను. టెక్నిక్, పరిస్థితులు.. ఇలా ఏ కోణంలో చూసినా సరే అది చాలా కష్టమైన ఫార్మాట్. టీ20 ఫార్మాట్ దాని కంటే జఠిలమైనది. పొట్టి క్రికెట్‌లో అత్యధిక స్ట్రయిక్‌రేటుతో బ్యాటింగ్ చేయాలనే ఒత్తిడి ఉంటుంది. స్ట్రయిక్ రేటు 130, 140, 150.. ఇలా ఉండాలి. కానీ, టెస్టుల్లో అలాకాదు. జాలీగా ఆడొచ్చు. అందుకనే టీ20ల కంటే టెస్టులు ఆడడమే తేలిక' అని 30 ఏండ్ల హెడ్ వెల్లడించాడు. ఇప్పటివరకూ 49 టెస్టులు ఆడిన హెడ్ 16, హాఫ్ సెంచరీలు, ఏడు సెంచరీలు బాదాడు. అది కూడా 64.75 స్ట్రయిక్ రేటుతో. అతడి అత్యధిక స్కోర్.. 175. క్రీజులో హెడ్ కుదురుకున్నాడంటే ఆ రోజు బౌలర్లకు కాళరాత్రే. ఎడాపెడా బౌండరీలతో చెలరేగిపోతాడు. అతడి ఆటకు బలైన జట్లలో భారత్ మొదటిది. అవును.. అన్ని జట్ల మాట ఏమోగానీ టీమిండియా అంటే చాలు హెడ్ శివాలెత్తిపోతాడు. నిరుడు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో సెంచరీతో టీమిండియా ఆశలపై నీళ్లు చల్లాడు. ఆ తర్వాత వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో మరోసారి శతక(137) గర్జనతో ట్రోఫీని అందకుండా చేశాడు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం సాక్షిగా విధ్వంసక శతకంతో కంగారూలకు ఆరో వరల్డ్ కప్ సాధించి పెట్టాడు హెడ్.

టెస్టుల్లో అశ్విన్ మరో ఘనత..!

షాక్‌లో ఆస్ట్రేలియా లెజెండ్

సుదీర్ఘ ఫార్మాట్‌లో మ్యాచ్ విన్నర్‌గా పేరొందిన రవిచంద్రన్ అశ్విన్ మరోసారి తన మ్యాజిక్ చూపించాడు. తనకు అచ్చొచ్చిన చెపాక్ టెస్టులో బంగ్లాదేశ్ బ్యాటర్లకు మూడు చెరువుల నీళ్లు తాగించాడు. మొదట బ్యాటుతో సెంచరీ కొట్టేసిన అతడు.. ఆ తర్వాత ఆరు వికెట్లతో చెలరేగిన తీరు అమోఘం. సంచలన బౌలింగ్‌తో టీమిండియాను విజయ పథాన నడిపిన అశ్విన్ వ్యక్తిగతంగా మరో ఘనత సాధించాడు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2024-25లో అత్యధిక సార్లు ఐదు వికెట్ల ప్రదర్శనతో రికార్డు నెలకొల్పాడు. తన పోటీదారుడు అయిన ఆస్ట్రేలియా లెజెండ్ నాథన్ లియాన్‌కు అశ్విన్ భారీ షాకిచ్చాడు. సొంతమైదానం అయిన చెపాక్‌లో అశ్విన్ తన తడాఖా చూపించాడు. తొలి రోజు సెంచరీతో జట్టును ఆదుకున్న అశూ భాయ్.. రెండో ఇన్నింగ్స్‌లో 688తో బంగ్లాదేశ్‌ను బెంబేలెత్తించాడు. దాంతో, డబ్ల్యూటీసీ 2024-25 సైకిల్‌లో 11వసారి అతడు ఐదు వికెట్ల ప్రదర్శనర చేశాడు. ఆసీస్ దిగ్గజ స్పిన్నర్ లియన్ 10 ప్యాయాలు ఈ ఘనత సాధించాడు.

డబ్ల్యూటీసీలో ఐదు వికెట్ల వీరులు

టెస్టు చాంపియన్‌షిప్ సైకిల్‌లో అశ్విన్ అత్యధికసార్లు ఐదు వికెట్లతో టాప్‌లో కొనసాగుతున్నాడు. అతడి తర్వాతి స్థానం లియాన్‌ది కాగా.. భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా నాలుగో స్థానంలో ఉన్నాడు.

1. రవిచంద్రన్ అశ్విన్ (భారత్)-11 పర్యాయాలు
2. నాథన్ లియాన్ (ఆస్ట్రేలియా)-10 పర్యాయలు
3. ప్యాట్ కమిన్స్ (ఆస్ట్రేలియా)-8 పర్యాయాలు
4. జస్ప్రీత్ బుమ్రా (భారత్)-7 పర్యాయాలు
5. టిమ్ సౌథీ (న్యూజిలాండ్)-6 పర్యాయాలు
6. జోష్ హేజిల్‌వుడ్ (ఆస్ట్రేలియా)-6 పర్యాయాలు

ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో హ్యాట్రిక్ ఫైనల్‌పై కన్నేసిన భారత్ ఆ దిశగా దూసుకెళ్లుతోంది. ఈ ఏడాది ఆరంభంలో ఇంగ్లండ్‌ను చిత్తు చేసిన టీమిండియా తాజాగా బంగ్లాదేశ్‌పై భారీ విక్టరీతో అగ్రస్థానంలో నిలిచింది. సెప్టెంబర్ 27న కాన్పూర్‌లో జరిగే రెండో టెస్టులోనూ విజయంతో సిరీస్ పట్టేయాలని రోహిత్ సేన భావిస్తోంది.

చెలరేగిన పరాగ్, రావత్..!

చాంపియన్‌గా 'ఇండియా ఏ'

ఆద్యంతం ఉత్కంఠగా సాగిన దులీప్ ట్రోఫీలో "ఇండియా ఏ' చాంపియన్‌గా నిలిచింది. ఇండియా సీ పై అద్భుత విజయంతో ట్రోఫీని అందుకుంది. మయాంక్ అగర్వాల్ బృందం నాలుగో రోజు 'ఇండియా సీ'ని 132 పరుగుల ఓడించి అగ్రస్థానంతో విజేతగా అవతరించింది. సాయి సుదర్శన్(111), రుతురాజ్ గైక్వాడ్(44)లు పోరాడినా ఇండియా సీకి గట్టెక్కించలేకపోయారు. బ్యాటింగ్, బౌలింగ్‌లో ప్రత్యర్థిని హడలెత్తించంతో పాటు ఫీల్డింగ్‌లోనూ అదరగొట్టిన మయాంక్ సేన సగర్వంగా ట్రోఫీని ముద్దాడింది. అనంతపూర్ వేదికగా ఇండియా సీ, ఇండియా ఏ జట్లు 'నువ్వానేనా' అన్నట్టు తలపడ్డాయి. తొలుత శశ్వత్ రావత్(124), అవేశ్ ఖాన్(51 నాటౌట్)ల మెరుపులతో ఇండియా ఏ 297 పరుగులు చేయగలిగింది. అనంతరం అకీబ్ ఖాన్(3/43), అవేశ్ ఖాన్(3/63)లు చెలరేగి ఇండియా సీని 234కే నిలువరించారు. వికెట్ కీపర్ అభిషేక్ పొరెల్(82) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో రియన్ పరాగ్(73), శశ్వత్ రావత్(52)లు ఇండియా సీ బౌలర్లపై ఎదురుదాడికి దిగి మెరుపు హాఫ్ సెంచరీలు బాదారు. దాంతో, ప్రత్యర్థికి మయాంక్ సేన 350 పరుగుల భారీ టార్గెట్ నిర్దేశించింది. పేస్ ద్వయం తనుష్ కొతియాన్(3/47), ప్రసిధ్ కృష్ణ(3/50)లు విజృంభణతో ఆ జట్టు 217కే కుప్పకూలింది. దాంతో, అగ్రస్థానానికి దూసుకెళ్లిన ఇండియా ఏ ట్రోఫీ విజేతగా అవతరించింది.

నిప్పులు చెరిగిన అర్ష్‌దీప్

ఇండియా డీ ఘన విజయం

టీ20 వరల్డ్ కప్‌లో అదరగొట్టిన భారత యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ దులీప్ ట్రోఫీలో నిప్పులు చెరిగాడు. తన పేస్, స్వింగ్‌తో ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ 'ఇండియా బీ' బ్యాటర్లకు ముచ్చెమటలు పట్టించాడు. అర్ష్‌దీప్ 9 వికెట్లతో చెలరేగడంతో ఇండియా డీ 257 పరుగుల తేడాతో ఘన విజయం సొంతం చేసుకుంది. ఇండియా బీ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (40 నాటౌట్) చివరిదాకా పోరాడినా లాభం లేకపోయింది. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అర్ష్‌దీప్ సింగ్ అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. దులీప్ ట్రోఫీలో ఇండియా డీ తరఫున ఆడుతున్న ఈ యువ పేసర్ 9/90తో జట్టును గెలిపించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు తీసిన అతడు రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లతో చెలరేగాడు. అతడితో పాటు ఆదిత్య థాక్రే(4/59) ధాటికి 373 పరుగుల ఛేదనలో ఇండియా బీ 115కే ఆలౌటయ్యింది. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అర్ష్‌దీప్ ఐదు వికెట్లు తీయడం ఇది రెండోసారి. దులీప్ ట్రోఫీ రెండో రౌండ్‌లో తొలుత ఆడిన ఇండియా డీ మొదటి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ కొట్టింది. ఇండియా బీ బౌలర్లను ఉతికేసిన సంజూ శాంసన్() శతకంతో గర్జించగా.. రికూ భూయి(56) అర్ధ సెంచరీతో రాణించాడు. అనంతరం కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్(116) సెంచరీతో చెలరేగినా మిగతావాళ్లు చేతులెత్తేయడంతో ఇండియా బీ 282కే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో రికూ భూయి 119 నాటౌట్‌తో ఇండియా డీని పోటీలోకి తెచ్చాడు. అనంతరం భారీ ఛేదనలో అర్ష్‌దీప్ సింగ్, థాక్రేలు ఇండియా బీ బ్యాటర్లను క్రీజులో నిలువనీయలేదు. ఈ ఇద్దరే పది వికెట్లు తీసి ఇండియా డీకి చిరస్మణీయ విజయాన్ని కట్టబెట్టారు. ఒత్తిడిలోనూ ఖతర్నాక్ సెంచరీతో ఇండియా డీని ఒడ్డున పడేసిన రికూ భూయి(119 నాటౌట్) 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

భక్తి శ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రులు జరుపుకోవాలి

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)

భక్తి శ్రద్ధలతో ఘనంగా దేవి శరన్నవరాత్రులు జరుపు కోవాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్య సమాజ్ భవన్ (దయానంద విద్యా మందిరం)లో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా ఉత్సవ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్న జరిగిన వినాయక చవితి పండుగను ఎంత ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందో అదే స్ఫూర్తితో రానున్న దసరా నవరాత్రులను కూడా అంతే ఘనంగా జరుపుకుందామని, ఉత్సవాల యొక్క పవిత్రత కు ఏమాత్రం భంగం కలగకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఏ ధార్మిక కార్యక్రమాల్లో రాజకీయ జోక్యం లేకుండా స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే సంప్రదాయాన్ని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. మన పండుగలు వాటి ప్రాముఖ్యత గురించి భవిష్యత్తు తరాలకు ఈ తరం వారు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉత్సవాలు నిర్వహణ ఖర్చులు నిమిత్తం మున్సిపల్ కౌన్సిల్ నుంచి 3 లక్షల రూపాయలు, తన వంతుగా 50 వేల రూపాయలు అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ఆర్య సమాజ్ పెద్దలు, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు డాక్టర్ మురళీధర్ రావు, రవికుమార్, మోహన్ యాదవ్, కే.రామచంద్రయ్య, బురుజు సుధాకర్ రెడ్డి, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, జి నాగేశ్వర్ రెడ్డి, రామాంజనేయులు, గౌలి వెంకటేష్, బుట్ట వేద వ్రత్, ముత్యం స్వామి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందుగా ఉత్సవ కమిటీ సభ్యులు, ఆర్య సమాజ్ పెద్దలు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డినీ శాలువాతో ఘనంగా సత్కరించారు.

ప్రైవేట్ ఉపాధ్యాయుల సేవలు మరువరానివి

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా జిల్లెల్ల చిన్నారెడ్డి

వనపర్తి బ్యూరో సెప్టెంబర్ 22 (జనంసాక్షి)

ప్రైవేట్ విద్యా సంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలు మరువరానివని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా జిల్లెల్ల చిన్నారెడ్డి అన్నారు.సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ప్రైవేట్ "ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార" ప్రదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేస్తూ ఉత్తమ ఫలితాలు సదిస్తున్నారని,తక్కువ వేతనంతో పనిచేస్తున్నామనే భావన ఏమాత్రం లేకుండా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాంటి వారిని ప్రోత్సహిస్తూ సాహితీ కళా వేదిక ద్వారా ఘనంగా సన్మానిస్తున్న శంకర్ గౌడ్ అభినందనీయులని అన్నారు. పట్టణంలోని రేడియంట్ పాఠశాల డైరెక్టర్ దేశ్ రాములు సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం ప్రశంసనీయమని చిన్నారెడ్డి వివరించారు.మాజీ జడ్పీ చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు అధునాతన సాంకేతిక విజ్ఞానంపై చిన్నప్పటి నుండే విద్యార్థులలో ఆసక్తిని కలిగించాలని, తద్వారా చక్కటి భవిష్యత్తుకు బాటలు వేసిన వారవుతారని అన్నారు.జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలలకు చెందిన 100మంది ఉపాధ్యాయులను నిర్వాహకులు శాలువా జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.ఈనాటి కార్యక్రమంలో సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి కృష్ణ, డిసిఇబి జిల్లా కార్యదర్శి సూర చంద్ర శేఖర్,గణేష్ కుమార్,శుభ లక్ష్మి బైరోజు చంద్ర శేఖర్,కందూరు నారాయణ రెడ్డి, బండారు శ్రీనివాస్,సత్తార్ డివివియన్ నారాయణ,గంధం నాగరాజు, కె.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనకుండానే కాగుతున్న వంట నూనెలు

వినియోగదారుల అవస్థలు

నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):

పండగలు సమీపిస్తున్న వేళ వంట నూనెల ధరలు పెరగడంతో వినియోగదారులు అవస్థలు పడే పరిస్థితులు నెలకొన్నాయి. సామాన్య ప్రజలకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.సన్ ఫ్లవర్, సోయాబీన్, రిఫైన్డ్ పామాయిల్ పై ఇంపోర్ట్ టాక్స్ 12.5శాతం నుంచి 32.5శాతానికి చేరుకుంది. దేశంలో నూనె గింజల ధరలు క్షీణిస్తున్న నేపథ్యంలో రైతులను ఆదుకునేం దుకు ఈ నిర్ణయం తీసుకు న్నట్లు కేంద్రం తెలిపింది. అయితే దిగుమతి సుంకం పెంపుతో వంట నూనెల ధరలు భారీగా పెరిగాయి. మొత్తానికి ముడి నూనెలపై సుంకం 5.5శాతం నుంచి 27.5 శాతానికి రిఫైన్డ్ ఆయిల్స్ పై సుంకం 13.75 శాతం నుంచి 35.75శాతం పెరిగింది. 20శాతం దిగు మతి సుంకం పెరగడంతో అన్ని రకాల నూనెలు 15 నుంచి 20 రూపాయల వరకు ఒక్కసారిగా పెరిగాయి.పామాయిల్ ధరరూ.100 నుంచి 115 వరకు పెరి గింది. సన్ ఫ్లవర్ అయిల్ 115 నుంచి 130 వరకు, పల్లీ నూనె రూ. 155 నుంచి 170 వరకు పెరిగింది. పూజలకు ఉపయోగించే నూనెలను కూడా భారీగా పెంచింది. 110 నుంచి 125 వరకు చేరాయి. ఇక ఇదే అదునుగా భావించిన కొంతమంది వ్యాపారులు బ్లాక్ మార్కెటింగ్ చేస్తు న్నారన్న ఆరోపణలు ఉన్నాయి. స్టాక్ లేదంటూ బోర్డులు పెట్టి అధిక ధర లకు అమ్ముకుంటున్నారు.పాత స్టాక్ ను కూడా అధిక ధరలకు అమ్ముతున్నట్టు సమాచారం. కేవలం వారం రోజుల్లోనే లీటర్ నూనె ధర రూ. 20 పెరగడంతో వినియోగదారులు షాక్ అవుతున్నారు.ప్రభుత్వం స్పందించి ధరలు తగ్గించేం దుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.సామాన్య ప్రజకు వినియోగదారులు కోరుతున్నారు.

పెరిగిన వంట నూనె ధరలు ఇలా

వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని 20 శాతం వరకు పెంచడంతో సన్‌ఫ్లవర్, సోయాబీన్, రిఫైన్డ్ పామాయిల్, వేరుశనగపై ఇంపోర్ట్ టాక్స్ 12.5 శాతం నుంచి 32.5 శాతానికి చేరింది.అన్ని రకాల నూనెల ధరలు లీటర్‌పై ఒక్కసారిగా రూ.15-20 వరకు పెరిగాయి.పామాయిల్ ధర రూ.100 నుంచి రూ.115-120, సన్‌ఫ్లవర్ రూ.115 నుంచి రూ.130-140, వేరుశనగ నూనె రూ.155 నుంచి రూ.165-170కు చేరింది.పండుగలు వచ్చే వరకు అయినా ధరలు తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

పని సర్దుబాటు జీవోను సవరించాలి

మల్దకల్ సెప్టెంబర్ 22 (జనం సాక్షి)

ఉపాధ్యాయుల సర్దుబాటు కొరకై పాఠశాల విద్యాశాఖ విడుదలచేసిన జీవోను సవరించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు యం.పర్వత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. తరగతిలో ఉపాధ్యాయుని కేటాయించి నాణ్యమైన విద్యను అందించాల్సిన ప్రభుత్వం ఈ ఇటువంటి అసం బద్ధ ఉత్తర్వులను జారీ చేయడం హాస్యాస్పదమని వారన్నా రు. ఈ ఉత్తర్వులను వెంటనే సవరించాలని వారు ప్రభు త్వాన్ని కోరారు. ఇటీవల బదిలీ పొంది రిలీవ్ కానీ ఎస్జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని వారు కోరా రు. బదిలీపొందిన ఉపాధ్యాయులకుజులై, ఆగస్టు నేల వేతనాలు వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ డీఏల ను,బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమా ండ్ చేశారు. ఆదివారం జోగులాంబ జిల్లా గద్వాల కేంద్ర ంలో కార్యకర్తలకు ఉపాధ్యాయులకు నిర్వహించిన ఒక రోజు శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మెరుగైన ఫిట్ మెంట్‌తో పిఆర్సీ ప్రకటిం చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు పాండు, రంగారెడ్డి,నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్ రావు,జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యూనుస్ పాష, పులిపాటి లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య.

మఖ్తల్ సెప్టెంబర్ 22 (జనంసాక్షి)

దేశం అభివృద్ధి బిజెపితోనే సాధ్యమని బిజెపి రాష్ట్ర కార్యదర్శులు కొండయ్య అన్నారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ అర్బన్ శాఖ ఆధ్వర్యంలో మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని చందాపూర్ లో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి భారతీయ జనతా పార్టీ కుటుంబంలో చేరే విధంగా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీని యువత ఆదర్శంగా తీసుకుని ఈ దేశం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి అర్బన్ మండల అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నరేందర్, చందాపూర్ సీనియర్ నాయకులు రాములు, గ్రామ పార్టీ అధ్యక్షులు కొండయ్య, నర్సింలు, రాములు, రాజు, హనుమంతు, హోటల్ వెంకటప్ప, ప్యాట్ల లక్ష్మణ్, నాగరాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
23 సెప్టెంబర్ 2024

317 జీవో సమస్యల పరిష్కారానికి ఉద్యోగుల ఎదురు చూపులు

- కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయంపైనే ఆశలు
- సమస్యలు పరిష్కరిస్తామని మేనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలోని 33 శాఖలకు చెందిన 317 జీవోతో పలు ఇబ్బందులు పడుతున్నారు. 317 జీవో సమస్యల పరిష్కారానికి ఉద్యోగ సంఘాలు,ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 317 జీవో సమస్య పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపింది. అధికారంలోకి వచ్చిన పిదప 317 జీవో సమస్యల పరిష్కారం కోసం క్యాబినెట్ సబ్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. క్యాబినెట్ సబ్ కమిటీ పలుమార్లు సమావేశం అయినప్పటికీ తుది నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రికి అందజేయలేదు. ప్రభుత్వం నుండి ఎలాంటి నిర్ణయం రాకపోవడంతో ఉద్యోగులకు ఎదురుచూపులు తప్పడం లేదు.2018 రాష్ట్రపతి ఉత్తర్వులు రాగ గత ప్రభుత్వం 2021లో 317 జీవోను అమలు చేసింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 33 శాఖలకు చెందిన సుమారు 50 వేల మంది ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తులు చేసుకోగా సీనియార్టీ ప్రాతిపదికన ఉద్యోగులను ప్రభుత్వం బదిలీ చేసింది. సీనియార్టీ తక్కువగా ఉన్న ఉద్యోగులను ఇతర జోన్ లకు బదిలీ చేయడంతో వారు స్థానికత కోల్పోయి పలు ఇబ్బందులు పడుతున్నరు. ఒక జోన్ నుండి మరో జోన్ కు బదిలీ కావడంతో ఉద్యోగులు తమ సమస్యను గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళినప్పటికీ వారికి పరిష్కారం కాలేదు. దీంతో ఉద్యోగులు 2021లో హైకోర్టులో పలు పిటిషన్ దాఖలు చేయగా ఈ నెలలో పిటిషన్ విచారణకు రానున్నట్లు సమాచారం.

సమస్య పరిష్కరిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీ...

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల ప్రధాన సమస్య 317 జీవో పరిష్కరిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపింది. ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు 317 జీవో సమస్యలపై క్యాబినెట్ సబ్ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆ కమిటీ నియామకం అయినప్పటి నుండి పలుమార్లు సమావేశం నిర్వహించిన కమిటీ తుది నిర్ణయం వెలబడటం లేదు. దీంతో సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులకు ఉద్యోగ సంఘాల నాయకులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

సీనియార్టీ కోల్పోయిన ఉద్యోగులు ...

317 జీవో ప్రకారం ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. కాగా తమ జిల్లాలకే బదిలీ చేయాలని ఉద్యోగ సంఘాలు కోరడంతో గత ప్రభుత్వం తిరిగి వారి సొంత జిల్లాలకు కేటాయించింది.అయితే పునః కేటాయింపు పేర్కొకపోవడంతో ఉద్యోగుల సీనియార్టీని కోల్పోయారు. సుమారు 450 మంది ఉద్యోగులు సీనియారిటీ కోల్పోవడంతో గత ప్రభుత్వం మొదలుకొని ఇప్పటి ప్రభుత్వ వరకు తమ సమస్యను పరిష్కరించాలని వినతి పత్రాలు ఇస్తూనే ఉన్నారు. వీటితో పాటు అనేక సమస్యలు ఉద్యోగులు ఎదుర్కొంటున్నారు.కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చిన హామీ మేరకు తమ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరుతున్నారు

రాష్ట్ర ప్రభుత్వం పైనే ఆశలు..

గత ప్రభుత్వంలో 317 జీవోను రద్దు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో తెలపడంతో పాటు ఆనాటి పిసిసి అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హామీ ఇచ్చారని పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి తెలిపారు. 317 జీవో ద్వారా 33 శాఖలకు చెందిన ఉద్యోగులను ఒక జోవ్ నుండి మరో జొన్ బదిలీ చేయడం సరైన పద్ధతి కాదని మేము హైకోర్టులో పిటిషన్ వైశామని, రాష్ట్ర ప్రభుత్వం కూడా క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసిందని ఆ కమిటీ తుది నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రికి ఇవ్వలేదన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కమిటీ తుది నివేదికను సీఎంకు అందజేయాలని ఆయన కోరారు.33 శాఖల ఉద్యోగులు రాష్ట్ర ముఖ్యమంత్రి పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని సీఎం 317 జీవోను రద్దు చేసే దిశగా కృషి చేయాలన్నారు.

- పి మధుసూదన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు...

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని కలిసిన నిఖత్ జరీన్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 22 (జనం సాక్షి) : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీని ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్ మర్యాదపూర్వకంగా షబ్బీర్ అలీ నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మొహమ్మద్ ఆలీ షబ్బీర్ ని కలిసి డీఎస్పీ గా నియమించినందుకు నిఖాత్ జరీన్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా షబ్బీర్ అలీ కి ధన్యవాదాలు తెలిపారు.ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ మరియు ఒలింపిక్ అథ్లెట్ నిఖత్ జరీన్ ఆమె తల్లిదండ్రులతో కలిసి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ని మర్యాదపూర్వకంగా ఆదివారం జూబ్లీ హిల్స్‌లోని షబ్బీర్ అలీ నివాసంలో కలిశారు.నిఖత్ జరీన్ తెలంగాణలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (స్పెషల్ పోలీస్)గా తన నియామకాన్ని పొందడంలో షబ్బీర్ అలీ చేసిన కృషికి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడల భవిష్యత్తు కోసం రేవంత్ రెడ్డి విజన్‌ను ముఖ్యమంత్రి గురించి వివరించారు. ఒలింపిక్ స్థాయి అథ్లెట్లను తయారు చేసేందుకు వచ్చే విద్యా సంవత్సరంలో క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

ఔత్సాహిక క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడానికి ప్రపంచ స్థాయి క్రీడా పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి అంతర్జాతీయ కోచ్‌లను తీసుకువస్తామని ఆయన చెప్పారు.2036 సమ్మర్ ఒలింపిక్స్‌కు వేలం వేయాలని మరియు హైదరాబాద్‌లో ఈవెంట్‌ను నిర్వహించాలని కేంద్రాన్ని డిమాండ్ చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డిని షబ్బీర్ అలీ ప్రశంసించారు. అగ్రశ్రేణి క్రీడా మౌలిక సదుపాయాలను నిర్మించడం లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి యువ ప్రతిభను ప్రోత్సహించడంలో రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు. దేశంలో మొత్తం క్రీడలు, ఆటలకు హైదరాబాద్‌ను హబ్‌గా మార్చాలను కుంటున్నామని ఆయన చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం కారణంగా 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణకు చెందిన అథ్లెట్లు భారత్‌కు అత్యధిక పతకాలు సాధిస్తారని షబ్బీర్ అలీ విశ్వాసం వ్యక్తం చేశారు.గతంలో 2000లో ఆఫ్రో-ఆసియన్ గేమ్స్ ,ప్రపంచ సైనిక క్రీడలను నిర్వహించిన గచ్చిబౌలి స్పోర్ట్స్ విలేజ్ వైభవాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుకుంటోందని షబ్బీర్ అలీ చెప్పారు.హైదరాబాద్‌లో ఉన్న స్టేడియాలను అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరాన్ని ఆయన హైలైట్ చేశారు, వీటిని తరచుగా క్రీడల కోసం ఉపయోగించారు. రాజకీయ లేదా ప్రైవేట్ కార్యక్రమాలకు ఉపయోగిస్తారు.

హైదరాబాద్‌లోని బగారీ కాంచెలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి సంబంధించి బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా తో ప్రాథమిక చర్చలు కూడా సానుకూలంగా ఉన్నాయని ఆయన చెప్పారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, రాష్ట్రవ్యాప్తంగా ప్రతిభను పెంపొందించడానికి సమగ్ర క్రీడా విధానంతో సహా క్రీడలను ప్రోత్సహించడానికి వివిధ చర్యలను ప్రారంభించిందని ఆయన సూచించారు. అంతర్జాతీయ క్రికెటర్ మహ్మద్ సిరాజ్,నిఖత్ జరీన్ వంటి అత్యుత్తమ అథ్లెట్లకు గ్రూప్-1 పోస్ట్‌లను అందించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని షబ్బీర్ అలీ ప్రస్తావించారు.సిరాజ్ యొక్క అర్హతలు గ్రూప్-1 పోస్ట్ కోసం విద్యా అవసరాలను తీర్చలేనప్పటికీ, అతని క్రీడా విజయాలకు గుర్తింపుగా మినహాయింపు ఇవ్వబడింది. జరీన్, ఆమె డి ఎస్ పి పోస్ట్‌తో పాటు, ఆమె సాధించిన విజయాలకు రూ. 2 కోట్ల రివార్డ్ కూడా లభించింది.2024-25 బడ్జెట్‌లో స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కోసం రూ.321 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.దేశంలో క్రీడల్లో మొదటి స్థానంలో ఉన్న హర్యానా వంటి రాష్ట్రాల తో పోటీపడి తెలంగాణను మొదటి స్థానంలో ఉంచాలన్నదే కాంగ్రెస్ ధ్యేయం మన్నారు రాష్ట్ర కొత్త క్రీడా విధానం, మండల కేంద్రాలలో స్టేడియంల నిర్మాణంతో సహా క్రీడా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెడుతుందన్నారు అన్నారు.

పేరుకేపట్టాలు.. పేదలకు కష్టాలు!

- పట్టా కాగితాలు ఇచ్చారు-స్థలం చూపడం మరిచారు
- కాంగ్రెస్ ప్రభుత్వమైన దయ చూపాలని కోరుతున్న పేదలు
- సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలో పేదల ఇంటి అద్దె కష్టాలు



రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 22 (జనంసాక్షి) : పేదలంటే ఇంత చులకనా.. పట్టాలిచ్చి చేతులు దులిపేసుకున్నారు. కనీసం స్థలం కూడా చూపలేదు. మా బాధ చెబుదామంటే వినేవాళ్లు లేరు.. ఇది సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఇంటి అద్దెలు చెల్లించలేక దయనీయ స్థితిలో ఉన్న ఓ నిరుపేద ఆవేదన.

అధికారికంగా 44 మంది అనధికారికంగా 900 పైచిలుకు నిరుపేద కుటుంబాల ఆవేదన. పేద కుటుంబాలపై అప్పటి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు అందించి ఆత్మగౌరవంతో జీవించేలా చేస్తామని చెప్పిన మాటలు పూర్తిగా నమ్మిన నిరుపేదలు ఇంటి అద్దె కష్టాలు తీరుతాయని ఆశతో ఎదురు చూశారు. తీరా పేద ప్రజల ఆశలు నిరాశగానే మిగిలాయి. డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల ఎంపిక కోసం అనేక సర్వేలు చేసిన అధికారులు మూడు వేల పదిహేను లబ్ధిదారులను ఎంపిక చేశారు. తిరిగి వార్డుల వారీగా గ్రామసభలు నిర్వహించి లక్కీ డ్రా లో లబ్ధిదారులను ఎంపిక చేసి డబల్ బెడ్ రూములు అందించారు. అప్పట్లో డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల ఎంపిక విషయంలో అనేక ఆరోపణలు వచ్చిన విషయం విధితమే. అర్హులైన లబ్ధిదారులకు కాకుండా తమకు అనుకూలంగా ఉన్నవారికి కేటాయింపులు జరిగాయని ఆరోపణలు వినిపించిన విషయం తెలిసిందే. దాదాపు 924 మంది పైగా డ్రాలో ఎంపిక కానీ నిరుపేదలు మిగిలిపోయారు. డ్రాలో గెలుపొందని లబ్ధిదారులకు కనీసం నివేషణ స్థలమైన ఇవ్వాలని కోరుతూ అప్పట్లో పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. అప్పటి అధికార పార్టీ నేతలు అర్హులైన పేదలందరికీ తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 377 లో 75 గజాల చొప్పున స్థలం కేటాయిస్తున్నట్లు విస్తృతంగా ప్రచారం చేశారు. ఎన్నికలు ముంచుకొస్తున్న సమయంలో కోడ్ రాకముందే పట్టాలు ఇవ్వాలనే ఉద్దేశంతో అప్పటి మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చేతుల మీదుగా3-10-23 23 న ప్రత్యేకంగా కలెక్టరేట్లో సమావేశం నిర్వహించి 44 మంది నిరుపేదలను ఎంపిక చేసి పట్టాలు అందజేశారు. మిగిలిన వారికి త్వరలో ఇస్తామంటూ చెప్పుకొచ్చారు. నాయకులు పేదలకు ఇచ్చిన మాటను అటకెక్కించారు. పేదలు మాత్రం ఇంకా ఆశతో ఎదురుచూస్తుంది ఉన్నారు. విచిత్రం ఏమిటంటే సర్వేనెంబర్ 377 లో కేటాయిస్తున్నట్లు పట్టా కాయితాలు ఉన్నాయి. ఫ్లాట్ నెంబర్ ఎక్కడ లేకపోవడం గమనార్హం. ఉట్టి పట్టాలు చూసుకుంటూ పేదలు గొల్లుమంటున్నారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైన స్పందించి పేదల ఆవేదన అర్థం చేసుకోని స్థలం చూపించాలని కోరుతున్నారు. ఏడాది కాలంగా ఎదురు చూస్తున్నారు.

ఉట్టి పట్టాలి ఇచ్చిండ్రు.. యాడికని పోవాలె..

గరీబోళ్లకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తున్నారని సంబర పడ్డాం. అప్పుడే డ్రా అనిరి. డ్రా ల పేరు రాలేదు. కొట్లాడంగా కొట్లాడంగా పట్టా కాయితం ఇచ్చిండ్రు. ఆజాగా ఎక్కడ ఉన్నదో ఇప్పటికి చూపియ్యలే. తీరాలే. గరీబోళ్లంటే చులకన అయిపోయారా.. ఈ సర్కార్ అయినా జాగా చూపియ్యలని కోరుతున్నాం. బీడీలు చుడుతూ కుటుంబాన్ని పోషించుకోవడమే కష్టం అవుతుంది. సాంచల పని లేకనే పాయే. నెలకు 3000 ఇంటి అద్దె తప్పక పాయే. మా కష్టాలు ఎట్లా తీరాలే.

- మ్యాన లావణ్య, బీడీ కార్మికురాలు

జాగా చూపిస్తే ఇంటి అద్దె భారం తగ్గుతుండే...

అన్ని అర్హతలు ఉన్న డ్రాలో రాలేదని మాకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇయ్యాలే. తిరుగంగా తిరుగంగా అప్పటి గవర్నమెంట్ పట్టాలు ఇచ్చింది. ఇప్పటిదాకా కట్టిన ఇంటిదగ్గరతో చిన్న రూమ్ అయినా వేసుకుంటుంటిమీ. జాగ చూపియ్యక పాయె. పట్టా ఇచ్చిరి. పట్టాల సర్వేనెంబర్ తప్ప ఫ్లాట్ నెంబర్ ఎయ్యాలే. ఉట్టి పట్టా తోని ఏం చేసుకోమంటారు..

- మోర తిరుపతి, మరమగ్గాల కార్మికుడు.

పోల్సాని సుగుణాకర్ రావును ఎమ్మెల్సీగా గెలిపించుకుందాం

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) : ఆదివారం రోజు ఉదయం 11 గంటలకు 100 మంది పైగా బిజెపి నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు పోల్సాని సుగుణాకర్ రావు స్వగృహానికి విచ్చేసి వారిని కలిసి రానున్న ఉమ్మడి మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు పోల్సాని సుగుణాకర్ రావు ని గెలిపించుకోవాలని వారు ప్రతినభూనారు. కరీంనగర్ జిల్లాలో బిజెపి కోసం గ్రామ గ్రామాన తిరిగి అనేకమంది కార్యకర్తలను, నాయకులను తయారుచేసి పార్టీని బలోపేతం చేసిన వ్యక్తి అని, అలాగే కార్యకర్తలకు ప్రజలకు అందుబాటులో ఉండుకుంటూ సేవలు చేస్తున్న వ్యక్తిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనదే అని తెలియజేశారు. రాష్ట్రంలో కాకుండా దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలు ముఖ్యంగా రైతుల సమస్యలపై అనేక పోరాటాలు చేసిన నాయకులు పోల్సాని సుగుణాకర్ రావు అని కొనియాడారు. వివిధ సమస్యలపై అవగాహన కలిగి ఉండి ప్రజా సమస్యలపై గర్జించే గొంతుకైన సుగుణాకర్ రావు ని గెలిపించవలసిందిగా ఈ సందర్భంగా వారు ప్రజలను విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పార్టీల అవినీతి అక్రమాలపై, నిరుద్యోగులు, ఉద్యోగస్తులు, వృత్తి నిపుణులు అన్ని వర్గాల ప్రజల సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించగలిగే సమర్థుడని తెలిపారు. రానున్న ఉమ్మడి మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పి. సుగుణాకర్ రావు గెలుపు కొరకు ప్రతి ఒక్కరం కృషి చేస్తామని అలాగే ఓటర్ల అభిమానాన్ని చూరగొని గెలిపించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు దుర్గ మారుతి, గంప జగన్, ఎలగందల్ నందకుమార్, తాదూరి బ్రహ్మం, జెడి భగవాన్, కనక చంద్రం, ఎస్ బి ఎస్ రామకృష్ణ, గుడిపాటి జితేందర్ రెడ్డి, నందెల్లి మహిపాల్, ఫిజియోథెరపీ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శంకర్, బాస్కర్, మొలుగూరి కిషోర్, కొత్త శ్రీనివాసరెడ్డి, మావురపు సంపత్, శ్రీనివాస్ గౌడ్, బుర్ర సత్యనారాయణ, బాసం కుమార్, కామారపు నరహరి, బిజెపి కార్యకర్తలు, పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370